www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 222

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా.12.08 తదుపరి సప్తమి; నక్షత్రం: పునర్వసు రా.6.48 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.7.26-8.56, రా.2.38-4.12; దుర్ముహూర్తం: మ.12.21-1.06, మ.2.36-3.21; అమృతఘడియలు: సా.4.31-6.02; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.21, సూర్యాస్తమయం: 5.36

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ఆకాశ్

8 బంతుల్లో 8 సిక్సర్లు

11 బంతుల్లో హాఫ్ సెంచరీ

మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

అరుణాచల్‌తో రంజీ ప్లేట్ మ్యాచ్

11

ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదితే అద్భుతమనుకున్నాం. కానీ మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ చౌధరి అంతకు మించి అన్నట్లుగా.. వరుసగా 8 బంతుల్లోనూ సిక్సర్లు బాది వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అతడి దూకుడైన ఆటతీరుకు 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకేసారి రెండు రికార్డులను నమోదు చేసిన క్రికెటర్ అయ్యాడు.

కేసీఆర్ ఓట్లడగలేదేం?

మైకులు బంద్

12

ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

రేపు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ షురూ

జూబ్లీహిల్స్ ఓటర్లకు ఎందుకు విజ్ఞప్తి చేయలేదు?

దీన్నిబట్టి కేటీఆర్, హరీశ్‌పై ఆయన ఆలోచనను అర్థం చేసుకోవచ్చు

ధృతరాష్ట్రుడిలా దుర్మార్గాల్ని భరిస్తున్నరు

పార్టీ కూలుతుంటే కుమిలిపోతున్నరు

బీఆర్ఎస్ వ్యాలిడిటీ అయిపోయింది

ఈసారి ఎన్నికలు 2029 జూన్‌లో..

2034 వరకూ కాంగ్రెస్సే అధికారంలో..

రానున్న పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసి చూపిస్తాం

కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్నీ ఆపలే

గుజరాత్‌కు గులామురా కిషన్‌రెడ్డి

కేటీఆర్‌తో చెడు సావాసాన్ని ఆపాలి

సెంటిమెంటా? డెవలప్‌మెంటా?

జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి

కాలేజీలు నిబంధనల ప్రకారం పోదామంటే మేం సిద్ధం

'మీట్ ద ప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి


మీట్ ద ప్రెస్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందన్నారు. ఇదేమీ తాను రాజకీయ విమర్శ కోసం చెబుతున్నది కాదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఇక్కడ లేకుండా పోయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ పని అయిపోతుందన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన బయటికి రావడంలేదని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటేయాలని

మిగతా 13వ పేజీలో...



జూబ్లీహిల్స్ తీర్పుతో రేవంత్ పీఠం కదలాలి!

12

గోస పడుతున్న తెలంగాణ మీ దిక్కు చూస్తోంది

ఇంత చిల్లర ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలే: కేటీఆర్

13

కేటీఆర్.. ప్రమాణం చెయ్



డ్రగ్స్ తీసుకోలేదని భాగ్యలక్ష్మి అమ్మవారి వద్దకు వచ్చి ఒట్టు వెయ్యి

కేటీఆర్‌కు కేంద్ర మంత్రి బండి సవాల్

సునీతకు 2 ఓటర్ ఐడీలున్నాయి.. విచారణ జరిపించాలని డిమాండ్


ఓటర్లకు నగదు పంపిణీ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రాంతంలో నెలకొన్న హడావుడి

ఓటర్లకు 100 కోట్లు!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీల పంపిణీ వ్యయం

ఖర్చుకు వెనుకాడని ప్రధాన పార్టీల అభ్యర్థులు.. పార్టీ బలహీనంగా ఉన్న చోట్ల రెట్టింపు తాయిలం

2 లక్షల మంది ఓటర్లు లక్ష్యంగా నగదు పంపిణీ.. ఇంట్లోని మహిళల చేతికే డబ్బు ఇచ్చేలా ఏర్పాటు

తమకు డబ్బులు అందలేదంటూ కొందరి నిరీక్షణ.. డబ్బు పంపిణీ చేస్తున్న నేతల వద్దకు వెళ్లి ఆరా

కొన్ని చోట్ల అభ్యర్థి ఇచ్చిన డబ్బులో కోత విధింపు.. స్థానిక నాయకుల పనేనన్న అనుమానాలు

లక్ష పట్టు చీరలు తెప్పించిన ఓ పార్టీ.. ఇప్పటివరకు 50 వేల చీరల పంపిణీ?

ఆంధ్రజ్యోతి - హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రతినిధి: అటు అధికార కాంగ్రెస్, ఇటు విపక్ష బీఆర్ఎస్ రెండూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నువ్వా? నేనా? అన్నట్లుగా హోరాహోరీగా సాగుతోంది. దీంతో ఖర్చు పరంగానూ ఈ ఉప ఎన్నిక కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ మహానగరంలో ఒక ఉప ఎన్నికకు ప్రధాన రాజకీయ పార్టీలు కేవలం ఓటర్లకు పంపిణీ చేసేందుకే రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఒకటిరెండు సందర్భాల్లో మినహాయిస్తే.. హైదరాబాద్ నగర శివారులో ఎన్నికల కోసం ఒక్క నియోజకవర్గంలోనే రూ.100 కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. కోర్ ఏరియాలోని 15 నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయం మరింత తక్కువగా ఉంటుంది. ఓట్లకు నోట్ల పంపిణీ కూడా పరిమితంగా జరుగుతుంది. కానీ, ఈసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రధాన పార్టీల అభ్యర్థులు పెడుతున్న ఖర్చు అంచనాలకు అందడం లేదు. ప్రచారం మొదలైనప్పటికి ప్రస్తుతం జరుగుతున్న

12

మిగతా 12వ పేజీలో...

పోలింగ్ డే.. డ్రోన్ల నిఘా

రాష్ట్రంలో తొలిసారి వాడకం

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్.. జీహెచ్ఎంసీ ఆఫీసు నుంచి పరిశీలన

12

ఎన్నికల అధికారి కర్ణన్

అధికారం శాశ్వతం అనుకున్న వారిని

ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు



నేను ఎన్నో సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు

20 ఏళ్లు బీఆర్ఎస్‌లో పనిచేసిన నన్ను అవమానకరంగా బయటికి పంపారు

కేసీఆర్ తిరిగి పిలిస్తే వెళ్తా..

రాజకీయంగా వెళ్లే పరిస్థితి లేదు

నేను అవమానాన్ని తట్టుకోలేను

పాలిటిక్స్ పక్కాగా చేస్తా.. ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎట్లుంటదో చూపిస్తా


హరీశ్ బినామీ కంపెనీకి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు

1,100 కోట్ల నుంచి 1,700 కోట్లకు అంచనా వ్యయం పెంచేసుకున్నారు

'మీట్ ద ప్రెస్'లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

వరంగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. అలా శాశ్వతం అనుకున్నవాళ్లను ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తాను ఉద్యమ సమయంలో బతుకమ్మ సంబరాల పేరుతో ప్రతీ పల్లె తిరిగానని, కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రొటోకాల్ పేరుతో తనను నిజామాబాద్‌కే కట్టడి చేశారని ఆరోపించారు. తనను అకారణంగా బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారని

మిగతా 14వ పేజీలో...



దేశాన్ని మతప్రాతిపదికన

విభజించడమే..

'కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్' అంటారా?

రేవంత్ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ మండిపాటు

ఇదీ కాంగ్రెస్ సంస్కృతి.. అంటూ బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆగ్రహం

ఔరంగాబాద్, నవంబరు 9: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అని ఆయన అన్నారని, ఇది దేశాన్ని మతప్రాతిపదికన విభజించడమేనని చెప్పారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన ఆదివారం ఆయన ఔరంగాబాద్, ససరాంల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. 'తెలంగాణ సీఎం చెప్పింది విన్నారా? కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే

మిగతా 13వ పేజీలో...

ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో

గెలుపు మాదే!

దేశాన్ని విభజించడానికి యత్నిస్తున్న బీజేపీ, ఆరెస్సెస్: రాహుల్

మోదీ, షా ఎక్కడికెళ్లినా 'ఓట్ల చోరీ'పై దొరికిపోతారని వ్యాఖ్య

సాత్పురా టైగర్ రిజర్వులో రాహుల్ సఫారీ.. బీజేపీ విమర్శలు

శిక్షణ శిబిరానికి ఆలస్యంగా రాహుల్.. శిక్షగా పది బస్కీలు

కిషన్‌గంజ్, నవంబరు 9: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్కడికెళ్లినా కూడా ఓట్ల చోరీ విషయంలో దొరికిపోతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో నూటికి నూరు శాతం ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన కిషన్‌గంజ్, పూర్ణియా సభల్లో మాట్లాడారు. దేశాన్ని విభజించడానికి బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే ఇండియా కూటమి మాత్రం దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఓటు చోరీపై తాము చేసిన ఆరోపణలకు మోదీ, షా, ఈసీ వద్ద ఎలాంటి సమాధానం లేదని, ఇప్పుడు వాస్తవాలన్నీ ప్రజల ముందుకు వచ్చాయని అన్నారు. హరియాణాలో

మిగతా 2వ పేజీలో...



బిహార్‌లో ప్రచారం

పరిసమాప్తం

రేపు 122 చోట్ల ఓటింగ్

ఐదో పర్యాయంపై సీఎం నితీశ్ దృష్టి

2

ఆత్మవిశ్వాసంతో తేజస్వి



రాబోయే పది రోజులు

గజగజే!

14

రాష్ట్రంలో మరింత పెరగనున్న చలి తీవ్రత

11-19 తేదీల్లో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే నమోదయ్యే అవకాశం

రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం హెచ్చరిక

వాయు కాలుష్యంతో

ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

'గ్యాస్ చాంబర్'గా దేశ రాజధాని!

2

దారుణంగా పడిపోయిన గాలి నాణ్యత

ఒక్కరోజు పీలిస్తే.. 20 సిగరెట్లతో సమానం!

ఢిల్లీలో కాలుష్యంపై నేడు సుప్రీం విచారణ



₹1,00,57,322

కోటి దాటిన యాదగిరిగుట్ట ఆలయ ఒక్కరోజు ఆదాయం

స్వామివారిని దర్శించుకున్న 88 వేల మంది భక్తులు

3

సత్యదేవుడి వ్రతాల్లో పాల్గొన్న 1,958 జంటలు

సైబర్ నేరాలపై సమరం

5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆపరేషన్

25 రోజుల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

రూ.95 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీల గుర్తింపు

నేరస్థుల్లో బ్యాంకు ఉద్యోగులు, విద్యావంతులు

నేర మూలాల మౌలిక వసతులను ధ్వంసం చేయడమే లక్ష్యం

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: టీజీసీఎస్‌బీ

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపుతోంది. సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు దేశంలోనే తొలిసారిగా పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించింది. అక్టోబరులో 25 రోజులపాటు నిర్వహించిన ఈ సమన్వయ దాడిలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మొత్తం 81 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ తెలిపింది. కేరళలో 28 మంది, మహారాష్ట్రలో 23 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10 మంది, తమిళనాడులో ఏడుగురు, కర్ణాటకలో 13 మందిని అరెస్ట్



మిగతా 3వ పేజీలో...

రాకెట్‌లాంటి యుద్ధ విమానం

ఎక్స్-బ్యాట్



నిట్టనిలువునా టేకాఫ్ అయ్యే సత్తా.. ల్యాండింగ్ కూడా అలాగే!

జీపీఎస్ లేని చోట్ల.. 'హైవ్‌మైండ్ ఏఐ' సాయంతో ప్రయాణం

అమెరికన్ డిఫెన్స్ టెక్నాలజీ దిగ్గజం షీల్డ్ ఏఐ అద్భుత ఆవిష్కరణ

2

ఈ విమానాలను భారత వాయుసేనకు విక్రయించే యోచన

షీల్డ్ ఏఐ ఇండియా ఎండీ సర్జన్ షా





పట్టణ ప్రాంతాల్లో రూ.31,782

ప్రైవేటు బడుల్లో ఏడాదికి ఒక్కో విద్యార్థిపై ఫీజు భారమిది!

పల్లెల్లో రూ.19,554.. దేశవ్యాప్త సగటు రూ.25 వేలు

ప్రభుత్వ, ప్రైవేటు.. బడి ఏదైనా 30% మంది ట్యూషన్లకు!

ఏటికేడాదీ గణనీయంగా పెరుగుతున్న విద్యా వ్యయం

'కేంద్ర గణాంకాల శాఖ 2025 సర్వే'లో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వేల కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నా.. కుటుంబాలపై ఆర్థిక భారం ఏమాత్రం తగ్గట్లేదని కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన అధ్యయనంలో తేలింది. దేశవ్యాప్తంగా పిల్లల చదువుల కోసం కుటుంబాలు చేస్తున్న ఖర్చుపై కేంద్ర గణాంకాల శాఖ ఈ ఏడాది ఏప్రిల్-జూన్

మిగతా 14వ పేజీలో...

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్

ఒకరు హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు

ఆయుధాలు, రసాయనాల స్వాధీనం

పలు నగరాల్లో ఉగ్రదాడులకు కుట్ర

ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్‌ల్లో రెక్కీ


సయ్యద్ అహ్మద్

హైదరాబాద్/ సిటీ, రాజేంద్రనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉగ్ర దాడులకు పన్నిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి ఆదివారం విలేకరులకు తెలిపిన

మిగతా 2వ పేజీలో...

రాకెట్‌లాంటి యుద్ధ విమానం.. ఎక్స్-బ్యాట్

- నిట్టనిలువునా టేకాఫ్ అయ్యే సత్తా.. ల్యాండింగ్ కూడా అలాగే!
- జీపీఎస్ లేని చోట్లా.. 'హైవ్‌మైండ్ ఏఐ' సాయంతో ప్రయాణం
- అమెరికన్ డిఫెన్స్ టెక్నాలజీ దిగ్గజం షీల్డ్ ఏఐ అద్భుత ఆవిష్కరణ



న్యూయార్క్, నవంబరు 9: వైమానికరంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది! చోదకుడు లేకుండా.. రన్‌వే అవసరమే లేకుండా.. ఏఐ సాయంతో నిట్టనిలువునా రాకెట్‌లాగా గాల్లోకి లేచి లక్ష్యం దిశగా దూసుకుపోయే ఫైటర్ జెట్‌ను అమెరికన్ డిఫెన్స్ టెక్నాలజీ దిగ్గజం షీల్డ్ ఏఐ అభివృద్ధి చేసింది. టేకాఫే కాదు.. ఈ విమానం ల్యాండింగ్ కూడా నిలువుగానే అవుతుంది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుల్లీ ఆటానమస్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీవోఎల్) యుద్ధవిమానం ఇది. షీల్డ్ ఏఐ సంస్థ ఈ విమానానికి 'ఎక్స్-బ్యాట్' అని పేరు పెట్టింది. ఈ విమానం తయారీలో ఆ సంస్థ తాను సొంతంగా అభివృద్ధి చేసుకున్న 'హైవ్‌మైండ్' అనే కృత్రిమ మేధ వ్యవస్థను ఉపయోగించింది. దీనివల్ల.. జీపీఎస్, ఇతర సమాచార వ్యవస్థలేవీ పనిచేయని చోట కూడా ఎక్స్-బ్యాట్లు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని పనిచేయగలుగుతాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. ఈ విమానం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తే.. పొడుగాటి రన్‌వేలు ఉండని లద్దాఖ్, అరుణాచల్ వంటి ఎత్తైన ప్రదేశాల్లో మిషన్లు చేపట్టడానికి ఎంతగానో ఉపకరిస్తాయని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. షీల్డ్ ఏఐ భారతదేశ విభాగానికి ఎండీగా వ్యవహరిస్తున్న సర్జన్ షా కూడా ఈ మేరకు సంకేతాలిచ్చారు. ఈ విమానాలు భారత వాయుసేన అమ్ములపొదిలో చేరే అవకాశం ఉందని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.



తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ముఖేశ్ అంబానీ

తిరుమలలో వంటశాల నిర్మాణానికి ముఖేశ్ అంబానీ రూ.100 కోట్ల విరాళం

తిరుమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఆయన తిరుమలతో పాటు కేరళలోని గురువాయూర్, రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా ఆలయాలను సందర్శించారు. ఆయా ఆలయాల తరఫున చేపట్టే వివిధ సేవా కార్యక్రమాలకు భూరి విరాళాలను ప్రకటించారు. ఆదివారం వేకువ జామున సుప్రభాత సేవ పూర్తయ్యాక ముఖేశ్ అంబానీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో నూతన శాటిలైట్ కిచెన్(వంటశాల) నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళం ప్రకటించారు. నిత్యం 2లక్షల మందికి సరిపడేలా అన్నప్రసాదాలను తయారు చేసేందుకు వీలుగా ఈ వంటశాలలను నిర్మించనున్నారు. 'కొత్త వంటశాలలను అన్నప్రసాదం ట్రస్టుకు అంకితం చేస్తున్నాం. ఏపీ ప్రభుత్వ సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమాన్ని చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం మహాభాగ్యం' అని రిలయన్స్ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, నాథ్‌ద్వారాలో భక్తుల సౌకర్యార్థం రూ.50 కోట్లకు పైగా వ్యయంతో యాత్రికుల సముదాయాన్ని వచ్చే మూడేళ్లలో నిర్మించనున్నట్లు ముఖేశ్ అంబానీ ప్రకటించారు. తొలి విడతలో భాగంగా రూ.15 కోట్లు విరాళంగా ఇచ్చారు. గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికిగాను మొదటి విడతగా రూ.15 కోట్లు చెక్కును అందజేశారు.

వాయు కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలి నాణ్యత అత్యంత దారుణంగా పతనమైంది. ఢిల్లీలో ఒక్కరోజు గాలి పీల్చే సగటున 20 సిగరెట్లు తాగిన దానితో సమానం!. అనేక ప్రాంతాలను ఇప్పటికే రెడ్‌జోన్‌లుగా ప్రకటించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వాయు నాణ్యత ప్రమాణాల ప్రకారం 300-400 మధ్య గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ఉంటేనే అత్యంత ప్రమాదకరం. 400-500 మధ్య ఉంటే హానికరమని సంకేతం. ఢిల్లీలో ప్రస్తుతం పది ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటింది. ప్రస్తుత పరిస్థితిని బట్టి ఢిల్లీని గ్యాస్ ఛాంబర్‌గా అనేక మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు ఇంటి నుంచి బయటికి రావాలని వైద్యులు చెబుతున్నారు. కాగా, ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రతపై అక్కడి ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆదివారం ఇండియా గేట్ దగ్గర భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

పాక్ రాజ్యాంగ సవరణపై దేశవ్యాప్త ఆందోళనలు

ఇస్లామాబాద్, నవంబరు 9: పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్(సీడీఎఫ్) పదవిలో కూర్చోబెట్టేందుకు ఏకంగా దేశ రాజ్యాంగంలో 27వ సవరణ తీసుకురావడంపై విపక్షాలు దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాయి. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో 243అధికరణంలో మార్పులు ప్రతిపాదించడంపై మండిపడుతున్నాయి. ఈ నెల 28న రిటైర్ కానున్న మునీర్‌ను ఏకీకృత కమాండ్ వ్యవస్థ అధిపతిగా చేస్తే ఆయనకు త్రివిధ దళాలపై మరింత పట్టుపెరుగుతుందని, అపరిమిత అధికారాలు లభిస్తాయని విపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాజ్యాంగం పునాదులే కదిలిపోతాయని, మునీర్ జీవించినంత కాలం వ్యతిరేకంగా ఒక్క కేసు కూడా నమోదు చేయలేరని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పాక్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ ఆరోపించింది. సోమవారం ఈ ప్రతిపాదనలపై పార్లమెంట్‌లో ఓటింగ్ ఉండటంతో విపక్షాలన్నీ ఐక్యమై దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

అడ్వాణీ సేవలను తక్కువగా చూడొద్దు: థరూర్

న్యూఢిల్లీ, నవంబరు 9: కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్.. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీపై ప్రశంసలు కురిపించారు. శనివారం అడ్వాణీ 98వ జన్మదినం సందర్భంగా థరూర్ శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన వ్యాఖ్యలను ఓ న్యాయవాది తప్పుబట్టడంపై తాజాగా స్పందించారు. ఒక్క సంఘటననే చూపిస్తూ దేశానికి అడ్వాణీ చేసిన విశేషమైన సేవలను తక్కువ చేసి చూడడం సరికాదన్నారు. నెహ్రూ చేసిన సేవలను చైనా సంఘటనతో, ఇందిరాగాంధీ సేవలను ఎమర్జెన్సీతో ముడిపెట్టి తక్కువ చేసి చూడటం కూడా సమంజసం కాదని, ఇదే న్యాయం అడ్వాణీకి వర్తిస్తుందని పేర్కొన్నారు. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచే విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ అణు సైరన్!



ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి తరహాలో మళ్లీ అణ్వాయుధాల పోటీ

- ఉక్రెయిన్ వేదికగా అగ్ర రాజ్యాల పోరు
- అణుశక్తితో నడిచే క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించిన రష్యా
- అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు ట్రంప్ ప్రకటన.. అణ్వస్త్రాల పెంపులో చైనా

(సెంట్రల్ డెస్క్)

మన ప్రపంచం మళ్లీ 'అణు'భయంలోకి వెళుతోంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తర్వాత తిరిగి అణ్వాయుధ పోటీ మొదలవుతోంది. ఒకప్పుడు అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధంతో ప్రపంచమంతా వణికిపోతే.. ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధ పరిణామాలతో అమెరికా, రష్యా మధ్య ఉప్పూనిప్పుగా మారిన పరిస్థితి కలకలం రేపుతోంది. అణుశక్తితో నడుస్తూ, అణ్వస్త్రాలను ప్రయోగించే సామర్థ్యమున్న అత్యాధునిక క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల వెల్లడించగా.. తాము అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అక్టోబరు 22న రష్యా అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించి డ్రిల్స్ కూడా నిర్వహించింది.

'స్టార్‌వార్స్' నుంచి నేటి 'పొసైడాన్' వరకు..

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా అగ్ర రాజ్యంగా అవతరించింది. జపాన్‌పై చేసిన అణుదాడితో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం అమెరికానే అనే అభిప్రాయం కలిగించింది. అమెరికాకు దీటుగా నిలిచేందుకు నాటి సోవియట్ యూనియన్ పెద్ద ఎత్తున అణ్వాయుధాలు, క్షిపణులను తయారు చేసింది. ఈ క్రమంలో సోవియట్ యూనియన్ నుంచి రక్షణ కోసమని 1983లో నాటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 'స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ (ఎస్‌డీఐ)'ను ప్రకటించారు. భూమితో పాటు అంతరిక్షంలోనూ రాడార్లు, క్షిపణులు, లేజర్ ఆయుధాలను మోహరిస్తామని ప్రకటించారు. ఈ ఎస్‌డీఐనే 'స్టార్‌వార్స్'గా కూడా పిలుస్తారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడంతో అమెరికా దూకుడు తగ్గించుకుంది. కానీ సోవియట్‌లో భాగమైన రష్యా పోటీగా నిలవడంతో మళ్లీ ఆయుధాల రేసు మొదలైంది. ఈ క్రమంలో 10 వేల కిలోమీటర్లకుపైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణి మినట్ మ్యాన్-3, జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ట్రైడెంట్-2 డీ5 బాలిస్టిక్ క్షిపణుల (7,300 కి.మీ. పరిధి)ను, బీ-2 వంటి అత్యాధునిక, స్టెల్త్, భారీ బాంబర్లను అమెరికా అభివృద్ధి చేసింది. మరోవైపు రష్యా కూడా 18వేల కిలోమీటర్ల పరిధి ఉన్న ఆర్ఎస్-28 సర్మత్ వంటి క్షిపణులను, క్షిపణుల నుంచి విడివడి గంటకు 24 వేల కిలోమీటర్ల వేగంతో లక్ష్యంపై దాడి చేయగల అవన్‌గార్డ్ వంటి గ్లైడ్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. తాజాగా అణుశక్తితో నడిచే, అణ్వాయుధ సామర్థ్యమున్న బురెవెస్ట్‌నిక్ క్రూయిజ్ క్షిపణి, పొసైడాన్ టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. బురెవెస్ట్‌నిక్ క్షిపణి అణుశక్తితో దూసుకెళ్తుంది కాబట్టి.. దానికి గరిష్ఠ పరిమితి ఏమీ లేదని, ప్రయోగ సమయంలో 15 గంటల్లో 14 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిందని రష్యా తెలిపింది. ఇక జలాంతర్గామి నుంచి ప్రయోగించే పొసైడాన్ టార్పెడో కూడా సముద్రంలో అడుగున ప్రయాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లి విధ్వంసం సృష్టించగలదని చెబుతున్నారు.

పోటాపోటీగా అణ్వస్త్రాలను సమకూర్చుకున్న తీరు ఇదీ..

ఏడాది	అమెరికా	సోవియట్
1948	50	0
1950	299	5
1960	18,638	1,627
1967	31,255	8,400
1977	25,542	24,281
1986	23,317	40,159
2000	10,577	12,188

'అణు'తెరపై చైనా దూకుడు

ప్రపంచంలో ఆర్థిక పరంగా రెండో అతిపెద్ద దేశంగా ఎదిగిన చైనా కూడా అగ్రరాజ్యం అనిపించుకోవడానికి 'అణు'మార్గం పట్టింది. కొన్నేళ్లుగా అణ్వస్త్రాల తయారీ వేగాన్ని పెంచింది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 2030 నాటికి ఈ సంఖ్య 1000 దాటుతుందని అంచనా. కానీ చైనా భారీ స్థాయిలో అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తోందని.. వచ్చే ఐదారేళ్లలో అమెరికా, రష్యాలతో సమానంగా చైనా వద్ద అణ్వస్త్రాలు ఉంటాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

ఏ దేశం వద్ద ఎన్ని అణ్వాయుధాలు

దేశం	అణ్వస్త్రాలు
రష్యా	5,449
అమెరికా	5,277
చైనా	600
ఫ్రాన్స్	290
యూకే	225
భారత్	180
పాకిస్థాన్	170
ఇజ్రాయెల్	90
ఉత్తరకొరియా	50

అణు పరీక్షలకు సిద్ధమవుతున్న పాక్?

పాకిస్థాన్ తమ సింధ్ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో రహస్యంగా సొరంగాల నిర్మాణం చేపట్టింది. అది అణు పరీక్షల కోసమేనని సింధు ప్రాంతంలోని పౌర సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ)లకు తాజాగా ఫిర్యాదు చేశాయి. పాకిస్థాన్ రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తోందని ఇటీవల ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

ప్రపంచంపై ఆధిపత్యం కోసం..

ప్రపంచంలో తొలిసారిగా అమెరికా అణ్వాయుధాల తయారీ కోసం 1942లో మాన్‌హట్టన్ ప్రాజెక్టును చేపట్టింది. 1945లో జూలైలో ట్రినిటీ పేరిట తొలి అణు పరీక్ష నిర్వహించింది. అదే ఏడాది ఆగస్టులో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై వేసిన అణు బాంబులు ప్రపంచ గతినే మార్చేశాయి. అగ్ర రాజ్యాల మధ్య అణ్వాయుధ పోటీ మొదలైంది. 1949 ఆగస్టులో సోవియట్ యూనియన్ 'ఫస్ట్ లైట్నింగ్' పేరిట తొలి అణుపరీక్ష నిర్వహించింది. ప్రపంచం రెండు ధ్రువాలుగా మారిపోయింది. ఈ క్రమంలో 1962లో ప్రపంచం ఒకసారి అణుయుద్ధం అంచుల వరకు వెళ్లింది. అమెరికాకు సమీపంలో ఉన్న కమ్యూనిస్టు దేశం క్యూబాలో సోవియట్ యూనియన్ క్షిపణులు మోహరించిన విషయం తెలిసి అమెరికా అగ్గిమీద గుగ్గిలమైంది. ఇరుదేశాల యుద్ధ నౌకలు, విమానాల మోహరింపుతో అణు యుద్ధం మొదలైనట్టేనన్న పరిస్థితి నెలకొంది. కానీ ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో అమెరికా, సోవియట్ వెనక్కి తగ్గాయి. 1963లో కొత్త అణుపరీక్షల నిషేధంపై మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. కానీ అణ్వాయుధాల తయారీ కొనసాగింది. కొత్తగా అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు తయారు చేయకుండా 1972లో సాల్ట్-1 (వ్యూహాత్మక ఆయుధాల నియంత్రణ ఒప్పందం) చేసుకున్నాయి. తర్వాత 1979లో సాల్ట్-2 ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ అణ్వాయుధాల సంఖ్యను, ఒకే సమయంలో ఎక్కువ సంఖ్యలో లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల (ఎంఐఆర్‌వీ) సంఖ్యను తగ్గించుకోవడానికి అంగీకరించాయి. కొన్నేళ్లు అంతా బాగానే ఉన్నా.. అఫ్ఘానిస్థాన్‌ను సోవియట్ ఆక్రమించుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

క్షిపణులు, సబ్‌మెరైన్ల సామర్థ్యం ఎంత?

రష్యా..

అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు రష్యా వద్ద 1,950 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేల మీది నుంచి ప్రయోగించే.. ఆర్ఎస్-28 సర్మత్-18,000 కి.మీ., ఆర్-36ఎం - 16,000 కి.మీ., ఆర్ఎస్-24 యార్స్ - 12,000 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ఆర్-29 ఆర్ఎంయూ2 సినేవా - 11,500 కి.మీ., ఆర్ఎస్ఎం-56 బులవా - 9,000 కి.మీ. సామర్థ్యం ఉన్నవి. ఇవన్నీ ఇప్పటికే వినియోగంలో ఉన్నవి. ఇటీవల పరీక్షలు చేసిన అణుచోదిత క్షిపణి, అణుచోదిత పొసైడాన్ టార్పెడోలు వీటికి అదనం. ఇక రష్యా వద్ద మొత్తం 79 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 16 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం.

యూఎస్ఏ

అమెరికా వద్ద అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు 1,200 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేలమీద నుంచి ప్రయోగించే.. మినట్‌మ్యాన్-3, సెంటినల్ క్షిపణుల పరిధి 13 వేల కి.మీ వరకు ఉంటే.. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ట్రైడెంట్-2డీ5 పరిధి 12 వేల కి.మీ. ఇక అమెరికా వద్ద మొత్తం 68 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 14 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం. యూఎస్ వద్ద ఉన్నవాటిలో ఒహియో, కొలంబియా క్లాస్ సబ్‌మెరైన్లు ముఖ్యమైనవి.

ఓట్ల చోరీని అడ్డుకుంటే..

బిహార్‌లో విజయం మాదే!

(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున ఓట్ల చోరీ జరిగిందని ఇటీవల తాను బయటపెట్టానని గుర్తుచేశారు. దీనిపై మోదీ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పందించలేదని, రాహుల్ అబద్ధాలాడుతున్నాడని చెప్పే ధైర్యం వారు చేయలేదన్నారు. ఓటింగ్ రోజున (నవంబరు 11న) పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండి ఓట్ల చోరీని అడ్డుకోవాలని యువత, కార్మికులు, రైతులకు ఆయన పిలుపునిచ్చారు. చేపలు, మఖానా సమృద్ధిగా లభించే రాష్ట్రంలో 20ఏళ్లలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీశ్ కుమార్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

ఓటు చోరీని కప్పిపుచ్చే యత్నం.. 'సర్'

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చడానికి, వ్యవస్థను సంస్థాగతీకరించడానికి చేస్తున్న ప్రయత్నమని రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి ఆయన ఆదివారం నర్మదాపురంలోని పంచ్‌మర్హికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హరియాణాలో 25 లక్షల ఓట్లను చోరీ చేశారని, ఇదే తరహాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ జరిగి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై తమవద్ద మరిన్ని ఆధారాలతో పాటు వివరణాత్మక సమాచారం ఉందని, దాన్ని కూడా త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ చూపించింది చాలా స్వల్పమేనని చెప్పారు. అనంతరం సాత్పురా టైగర్ రిజర్వ్‌లోని పనార్పణిలో రాహుల్ జంగిల్ సఫారీకి వెళ్లారు. దీనిపై బీజేపీ ఘాటుగా స్పందించింది. బిహార్ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందో రాహుల్‌కు ముందే అర్థమైపోయిందని, అందుకే సెలవు తీసుకొని మరీ జంగిల్ సఫారీని ఆస్వాదిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి ఆయన ప్రాధాన్యతలు ఏమిటో తెలుస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మాత్రం ఈసీఐపై నిందలు వేస్తూ హెచ్(హాలిడే) ఫైల్స్‌పై ప్రజంటేషన్ ఇస్తారని ఆరోపించారు. బిహార్ ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రజల నుంచి కాకుండా జంతువుల నుంచి ఓట్లు అడగడానికి రాహుల్ అడవికి వచ్చారా అని మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ సారంగ్ ప్రశ్నించారు. రాజకీయాలను రాహుల్ గాంధీ ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని ఆయన విమర్శించారు.



శిక్షణ శిబిరానికి ఆలస్యంగా రాహుల్.. పది బస్కీలు శిక్ష

పంచమర్హిలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరానికి ఆలస్యంగా హాజరైన రాహుల్ గాంధీకి పది బస్కీలు శిక్ష లభించింది. ఆయనతో పాటు ఆలస్యంగా వచ్చిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూడా చెమటోడ్చాల్సి వచ్చింది. దీంతో పార్టీ సంస్థాగత సమావేశం కాస్తా వ్యాయామ శిబిరంగా మారింది.

బిహార్‌లో ముగిసిన ప్రచారం

- రేపు 122 స్థానాలకు ఓటింగ్

వాడీవేడిగా నెల రోజుల పాటు సాగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆదివారం సాయంత్రం తెరపడింది. మంగళవారం చివరిది అయిన రెండో దశ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిబంధనల మేరకు ప్రచారాలను ముగించారు. ఈ దశలో 122 స్థానాలకు పోలింగ్ జరగనుంది. చివరి రోజున జరిగిన ప్రచారంలో కేంద్ర సీనియర్ మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు పాల్గొన్నారు. ఎన్నికల కోసం రాహుల్ మొత్తం 15 ప్రచార సభల్లో ప్రసంగించారు. ప్రధాని మోదీ 14 బహిరంగ సభలు, ఒక రోడ్ షోలో పాల్గొన్నారు. జేడీ(యూ) అధినేత నీతీశ్ అయిదోసారి సీఎం పదవిని చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకొని, ఎలాంటి హడావిడి లేకుండా నిరాడంబరంగా ప్రచారాన్ని నిర్వహించారు.ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఇండియా కూటమి తరఫున ఉధృతంగా ప్రచారం చేశారు. ఎంతో మంది నాయకులకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించి, ఆర్భాట ప్రచారాలు నిర్వహింపజేసిన జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ సంప్రదాయ పద్ధతుల్లో ఇంటింటి ప్రచారానికే పరిమితమయ్యారు.

సంఘ్ శాఖకు ఎవరైనా రావచ్చు!

- ఏ పార్టీకీ ఆర్ఎస్ఎస్ మద్దతివ్వదు
- ఆర్ఎస్ఎస్ రిజిస్టర్ అయిన సంస్థ కాదు
- అయినా మాపై మూడు సార్లు నిషేధం
- తద్వారా ప్రభుత్వమే గుర్తించింది: భాగవత్



బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ శాఖలకు రావచ్చని, ముస్లింలు, క్రైస్తవులన్న భేదభావం లేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టంచేశారు. అయితే తాము ఫలానా అన్న ప్రత్యేకతను దూరం పెట్టి, భరతమాత పుత్రులుగా రావాలన్నారు. సమాజంలో అందరినీ కలిసికట్టుగా ఉంచాలన్నదే తమ ఉద్దేశమన్నారు. సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తినో, రాజకీయ పార్టీనో ఆర్ఎస్ఎస్ సమర్థించదని.. విధానాలకే మద్దతిస్తుందని స్పష్టంచేశారు. 'ఏ పార్టీకీ మద్దతివ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనం' అని పేర్కొన్నారు. 'రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ మద్దతిచ్చి ఉంటే సంఘ్ కార్యకర్తలే దానికే ఓటేసి ఉండేవారు' అని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ రిజిస్టర్డ్ సంఘం కాదన్న ప్రియాంక్ ఖర్గే వ్యాఖ్యలను భాగవత్ ప్రస్తావిస్తూ.. 'ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమైంది. బ్రిటిష్ ప్రభుత్వం వద్ద మేం రిజిస్టర్ చేసుకోవాలా? స్వాతంత్ర్యానంతరం రిజిస్ట్రేషన్ తప్పనిసరని చట్టాలు చెప్పలేదు. అయితే, ఐటీ విభాగం, కోర్టులు సంఘ్‌ను వ్యక్తుల సంఘంగా గుర్తించాయి. మాకు ఐటీ నుంచి మినహాయింపు కూడా ఇచ్చాయి. సంఘ్‌పై 3సార్లు నిషేధం విధించారు. తద్వారా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించినట్లయింది" అన్నారు. "రిజిస్టర్ కాని అంశాలు చాలానే ఉన్నాయి. హిందూ ధర్మం కూడా రిజిస్టరై లేదు" అని ఆయన పేర్కొన్నారు.

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ప్రకారం.. ప్రమాదకర రసాయనాలు, ఆధునిక ఆయుధాలతో భారీ ఉగ్రదాడికి కుట్ర చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్(35), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను అరెస్టు చేశారు. మొహియుద్దీన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 7న రెండు గ్లోక్ పిస్టళ్లు, ఒక బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు లీటర్ల కాస్టర్ ఆయిల్, రిసిన్ తయారీకి వాడే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విచారణలో తాను గాంధీనగర్ జిల్లాలో మారుమూల ఉన్న కలాల్ ప్రాంతంలో ఈ ఆయుధాలను అందుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఉగ్ర కార్యకలాపాలు చేపట్టేందుకే వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేసే క్రమంలో ఉగ్రవాదులతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఐఎస్‌కేపీ(ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్)కు చెందిన అబూ ఖదీజా(ఆఫ్ఘనిస్థాన్) ఇతడితో సంప్రదింపులు జరుపుతున్నాడని గుర్తించారు. ఖదీజాకు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి. చైనాలో వైద్యవిద్య చదివిన మొహియుద్దీన్ దేశంలో భారీ ఉగ్రదాడులు జరిపేందుకు అత్యంత విషపూరితమైన రిసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ చెప్పారు. అతడి ఫోన్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా అతడికి ఆయుధాలు అందించిన యూపీకి చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్‌లో సేకరించిన ఆయుధాలను వీరు మొహియుద్దీన్‌కు అందించారు. పాకిస్థాన్‌లోని వీరి హ్యాండ్లర్ డ్రోన్ ద్వారా ఆ ఆయుధాలను పంపాడని డీఐజీ వెల్లడించారు. కాగా వీరు ఉగ్రదాడులు జరిపేందుకు లఖ్‌నవూ, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని పలు రద్దీ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. మొహియుద్దీన్ అరెస్టుతో నగరంలోని రాజేంద్రనగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. ఇతడు నివాసం ఉంటున్నది ఈ కాలనీలోనే. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీ రోడ్డు నెంబరు 9లోని ఆషాద్ మంజిల్ మొదటి అంతస్తులో ఇతడు నివాసం ఉంటున్నట్లు సమాచారం.

ఎక్కడ ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా హైదరాబాద్‌కు లింకులు

దేశంలో ఎక్కడ ఎప్పుడు ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఎక్కడ ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టయినా హైదరాబాద్ నగరంతో వారికి ఏదో ఒక లింకు ఉంటోంది. హైదరాబాద్ నగరం ఉగ్రవాదులకు ఒక షెల్టర్ జోన్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గతేడాది సెప్టెంబరులో ఐఎస్(ఇస్లామిక్ స్టేట్) ఉగ్రవాద సంస్థకు చెందిన యువకుడు రిజ్వాన్ అలీ నగరానికి వచ్చి ఆశ్రయం పొంది తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఇతడు సైదాబాద్‌లోని శంకేశ్వర బజార్‌లో సుమారు ఆరు నెలలపాటు తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలింది.
- గతేడాది నగరంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ఒక సదస్సు సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో జరిగినా.. పోలీసు నిఘా వ్యవస్థ కనిపెట్టలేక పోయిందనే చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర సహా.. వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ఇస్లామిక్ సానుభూతిపరులు హోటల్లో దిగి నెల రోజులపాటు మత విద్వేష సదస్సును ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించారంటే.. నగరాన్ని వారు ఎంత సేఫ్టీ జోన్‌గా వాడుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ సదస్సుకు హాజరైన ఓ యువకుడు ముత్యాలమ్మ ఆలయంలోకి వెళ్లి అమ్మవారి విగ్రహాన్ని కాలితో తన్ని ధ్వంసం చేశాడు.

లోకం తీరు



సైబర్ నేరాలపై సమరం

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు వెల్లడించింది. వారిలో పురుషులు 74, మహిళలు ఏడుగురు ఉన్నారు. వీరిలో బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల ఉద్యోగులు, విద్యావంతులు కూడా ఉండటం గమనార్హం. ఈ దాడుల్లో భాగంగా అధికారులు సుమారు రూ.95 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీలను గుర్తించారు. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, 11 మంది నేరుగా ఆర్థిక లావాదేవీల్లో పాల్గొన్నవారు (రూ.34.70 లక్షలు), 53 మంది 'మ్యూల్ అకౌంట్' హోల్డర్లు ఉన్నారు. వీరి వద్ద నుంచి 84 మొబైల్ ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్ బుక్‌లు, చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టీజీసీఎస్‌బీ అధికారులు వెల్లడించారు.

బ్యాంకు ఉద్యోగుల కక్కుర్తి

కమీషన్లకు కక్కుర్తి పడి బ్యాంకుల వంటి ఆర్థిక కార్యకలాపాల్లో పని చేసే పై స్థాయి ఉద్యోగులు సైతం ఈ నేరగాళ్లకు సహకరించడం విస్మయం కలిగిస్తోంది. అరెస్టయిన నిందితుల్లో ఐడీఎఫ్‌సీ బ్యాంకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ (106 కేసులతో లింక్), ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి, బంధన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేషన్స్ డిప్లొమా హోల్డర్ (96 కేసులు), చెన్నై కిల్‌పోక్ ఆడిట్ ఆఫీసులో అకౌంటెంట్ (31 కేసులు), బీబీఏ గ్రాడ్యుయేట్ (45 కేసులు), ఒక మల్టీనేషనల్ కంపెనీ ఉద్యోగి ఉన్నారు. కొంతమందికి విదేశాల్లోని నేర నెట్‌వర్క్‌లతో కూడా సంబంధముందని తేలింది. వారిని ఇక్కడికి తీసుకొచ్చేందుకు లుక్ ఔట్ సర్క్యులర్ జారీచేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో అరెస్టయినవారు టీజీసీఎస్‌బీకి చెందిన 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 41 కేసులతో సంబంధం ఉన్నవారని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 754 క్రైమ్ లింకులను గుర్తించగా, అందులో తెలంగాణలోనే 128 లింకులు బయటపడ్డాయి. ఈ



ఆపరేషన్ ద్వారా సైబర్ నేరగాళ్లకు మద్దతిచ్చే సరఫరా గొలుసును పూర్తిగా విచ్ఛిన్నం చేయటమే లక్ష్యమని టీజీసీఎస్‌బీ అధికారులు తెలిపారు. భారీ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన అధికారులను టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ అభినందించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు టీజీసీఎస్‌బీ సూచించింది. ముఖ్యంగా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఉచ్చుల్లో పడొద్దని కోరింది. అధిక రాబడి ఇస్తామని చెప్పే ఆన్‌లైన్ స్టాక్, ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ యాప్స్, టాస్క్ బేస్డ్ ఇన్‌కమ్ ఆఫర్లను నమ్మవద్దని సూచించింది. అధికారికంగా ధృవీకరించిన వెబ్‌సైట్లు /యాప్‌లను మాత్రమే ఆర్థిక లావాదేవీలకు ఉపయోగించాలని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది.

సైబర్ క్రైం తీవ్రమైన సామాజిక సమస్య

- కుటుంబానికో సైబర్ సింబతోనే సమాజం సురక్షితం
- 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్'లో డీజీపీ
- డబ్బులు ఊరకే రావు: సీపీ సజ్జనార్



'జాగృత్ హైదరాబాద్- సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో సైబర్ సింబ లోగోను ఆవిష్కరిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని డీజీపీ శివధర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పనకు లోయర్ ట్యాంక్ బండ్‌లోని కవాడిగూడ జల వాయు టవర్స్ కమ్యూనిటీ హాలులో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించారు. సైబర్ సింబ లోగో, క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరించి.. బ్యాడ్జీలను వలంటీర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులైన మహిళలు, వృద్ధులు, రిటైర్డు ఉద్యోగులను భయపెట్టి, బెదిరించి, వారి బ్యాంకు ఖాతాల్లోని రూ.కోట్లు ఖాళీ చేస్తున్నారన్నారు. ఇటువంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు చెప్పారు. సైబర్ మోసాలపై ప్రతి ఇంట్లో అవగాహన గల ఒక సైబర్ సింబ ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుందని డీజీపీ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని చెప్పారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ.. డబ్బులు ఊరకే రావని గుర్తించాలన్నారు. రోజూ సైబర్ మోసాలతో హైదరాబాదీలు సగటున రూ.కోటి వరకూ నష్టపోతున్నారని చెప్పారు. ఏడాదికి సగటున రాష్ట్ర ప్రజల నుంచి రూ.400 కోట్లు సైబర్ మోసగాళ్లు దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో సీపీ సజ్జనార్ సైబర్ ప్రతిజ్ఞ చేయించారు.

ములుగు అడవుల్లో అరుదైన సీతాకోకచిలుకలు

- కొత్తగా 80 రకాల జాతుల గుర్తింపు


కొత్త జాతి సీతాకోకచిలుక

ములుగు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అభయారణ్యంలో 80 రకాల అరుదైన సీతాకోక చిలుకల జాతులను ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ గుర్తించింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో లక్నవరం, తాడ్వాయి, పస్రా అడవుల్లో మూడు రోజులపాటు ఈ పరిశోధన చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సర్వేలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా పరిశోధకులు, ఫొటోగ్రాఫర్లు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారని ఆయన చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 150కి పైగా సీతాకోకచిలుకల జాతులు ఉండగా, కొత్తగా 80 జాతులను గుర్తించినట్టు పేర్కొన్నారు. సీతాకోకచిలుకలు పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని అటవీ శాఖ జిల్లా అధికారి రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. అరుదైన జాతులను గుర్తించి వాటి మనుగడను కాపాడడానికి పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో ర్యాగింగ్ !

- ఇంటరాక్షన్ పేరుతో జూనియర్లతో సీనియర్ల వెకిలి ఆటలు

కొడిమ్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి(కొండగట్టు)జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేగింది. ఇంటరాక్షన్ పేరిట ఫస్టియర్ విద్యార్థులను కలిసిన సీనియర్లు వారితో వెకిలి ఆటలు ఆడించారు. ఇద్దరు ఫస్టియర్ విద్యార్థుల(ఇద్దరు అబ్బాయిలే)ను కూర్చోబెట్టి పెళ్లి తంతు జరిపించారు. కళాశాలలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా విషయం చర్చనీయాంశమైంది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ జీ నరసింహ వివరణ కోరగా.. ర్యాగింగ్‌పై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులతో ఇంటరాక్షన్‌లో భాగంగా సరదాగా ఏవో ఆటలు ఆడుకున్నారని చెప్పారు. అయినా ఆ ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఓ కమిటీని వేశామని, ర్యాగింగ్‌పై ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పంట దెబ్బతినడంతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

కాసిపేట, జమ్మికుంట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు పాడవడంతో మనస్తాపానికి గురైన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొత్తవరిపేటకు చెందిన మహిళా కౌలు రైతు గుండ శ్రీదేవి(35) నాలుగు ఎకరాల్లో వరి, ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేసింది. ఇటీవల వర్షాలకు వరి, పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో పంటల సాగు కోసం చేసిన రూ.15 లక్షల అప్పులు చెల్లించే మార్గం కనిపించక ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. అలాగే, కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నాగంపేటకు చెందిన రైతు సోమల్ల హరీష్ (28) రెండెకరాల సొంత భూమిలో వరి, ఎకరం కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఇటీవల అధిక వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతినడంతో మనస్తాపానికి గురై శనివారం పురుగు మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.


గర్భాలయంలో ఉభయ క్యూలైన్లలో భక్తులు

రూ.1 కోటి దాటిన 'గిరి' క్షేత్ర నిత్యాదాయం

- స్వామివారిని దర్శించుకున్న 88వేల మంది భక్తులు
- సత్యదేవుడి వ్రతాల్లో పాల్గొన్న 1,958 జంటలు

యాదగిరిగుట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.1,00,57,322 ఆదాయం సమకూరింది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రానికి వచ్చారు. 88వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. కొండపైనా, పాతగుట్టలో 1,958 జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయని ఆలయ ఈవో వెంకట్రావ్ తెలిపారు. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ధర్మదర్శనానికి మూడున్నర గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.


చిన్నారి తలపై ట్యూబ్‌లైట్లను పగులగొడుతున్న దృశ్యం

6.9 నిమిషాలు.. 100 ట్యూబ్‌లైట్లు!

- తలపై పగలగొట్టుకుని తొమ్మిదేళ్ల బాలిక సాహసం

తాడిపత్రి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక యశస్విభారతి 6.9 నిమిషాల్లో తలపై 100 ట్యూబ్‌లైట్లను పగులగొట్టించుకుని ఔరా అనిపించింది. యశస్వి స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. రెండేళ్ల క్రితం నుంచి తైక్వాండో శిక్షణ పొందుతూ, నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకునే లక్ష్యంతో తాడిపత్రిలోని కృష్ణాపురం జీరో రోడ్డులో ఆదివారం ఈ ఫీట్ చేసింది. యశస్విభారతి తల్లిదండ్రులు రంగనాథ, పద్మజ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వీడియోలు, ఫొటోలను నోబుల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కమిటీకి పంపనున్నట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు.

విజయవంతంగా త్రివిధ దళాల ఉమ్మడి విన్యాసాలు

న్యూఢిల్లీ, నవంబరు 9: భారత సైన్యంలోని త్రివిధ దళాలు ఆదివారం విజయవంతంగా ఉమ్మడి విన్యాసాలు నిర్వహించాయి. రాణ్-క్రీక్ సెక్టారులో 'ఎక్సర్‌సైజ్ బ్రహ్మ శిర' పేరుతో వీటిని జరిపాయి. గతకొంతకాలంగా త్రివిధ దళాలు నిర్వహిస్తున్న ఎక్సర్‌సైజ్ త్రిశూల్‌లో భాగంగా ఈ విన్యాసాలు జరిగినట్టు ప్రజా సంబంధాల అదనపు డైరెక్టరేట్ జనరల్ ఎక్స్ ద్వారా తెలిపారు. ఆర్మీ, నౌకాదళం, వాయుదళం, కోస్టుగార్డ్, బీఎస్ఎఫ్‌లు పౌర యంత్రాంగం సహకారంతో వీటిని నిర్వహించినట్టు పేర్కొన్నారు. వివిధ దళాల మధ్య సహకారం, సమన్వయం ఉండేలా చూడడం; భూమి, సముద్రం, వాయు మార్గాల్లో ఉమ్మడిగా సామర్థ్యాలను ప్రదర్శించడం కోసం దీన్ని నిర్వహించినట్టు వివరించారు. సైన్యం ఆధునికీకరణ, ఏకీకరణ కోసం చేపట్టిన 'పరిణామ దశాబ్ది' కార్యక్రమంలో భాగంగా ఈ ఉమ్మడి విన్యాసాలు జరుగుతున్నాయి. క్లిష్టమైన ప్రాంతాల్లో ఏ విధంగా ఉమ్మడి విన్యాసాలు జరపాలి, ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదానిపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమాలను ఆర్మీ నిర్వహిస్తోంది.

అనుమానం పెనుభూతమై.. భార్యను హత్యచేసిన భర్త

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో దారుణం
- ఆమె కోహీర్ డీసీసీబీలో అసిస్టెంట్ మేనేజర్


కృష్ణవేణి (ఫైల్)

అమీన్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన భార్యకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఓ భర్త ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పట్టణంలో ఆదివారం జరిగింది. గుంటూరు జిల్లాకు చెందిన కృష్ణవేణి (40) కోహీర్ డీసీసీబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ భర్త వెంకటబ్రహ్మం, ఇద్దరు పిల్లలతో కలిసి అమీన్‌పూర్‌లో నివాసముంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి కొన్నిరోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వెంకటబ్రహ్మం.. కృష్ణవేణికి ఎవరితోనో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయంలో భార్యాభర్తలు తరచూ గొడవపడేవారని ఇరుగుపొరుగు వారు చెబుతున్నారు. ఆదివారం జరిగిన గొడవలో పట్టరాని ఆవేశంలో ఉన్న వెంకటబ్రహ్మం అక్కడే ఉన్న క్రికెట్ బ్యాట్‌తో భార్యపై దాడికి దిగాడు. తలపై బ్యాట్‌తో పలుమార్లు బాదడంతో తీవ్ర రక్తస్రావమై కృష్ణవేణి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారి కుమార్తె ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటుండగా, కుమారుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపారు.


ఈదుకుంటూ బాలిక మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న ఎస్సై రవీందర్ (సర్కిల్‌లో)

నదిలో దిగి.. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి!


- నేరేడుచర్ల ఎస్సై రవీందర్ సాహసం
- మూసీ ఉధృతికి కొట్టుకుపోయి బాలిక మృతి


సుస్మిత (ఫైల్)

నేరేడుచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిలో నుంచి బాలిక మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చేందుకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్సై సాహసమే చేశారు. నీటి ఉధృతి అధికంగా ఉన్నా ఈదుకుంటూ వెళ్లి బాలిక మృతదేహాన్ని తెప్పపై ఒడ్డుకు తెచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమారంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సుస్మిత (13) మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేసింది. ఇద్దరు చిన్నారులతో కలిసి ఆ విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని మూసీ నదికి వద్దకు వెళ్లి నీటి ఉధృతికి బాలిక గల్లంతైంది. విషయం తెలిసి నేరేడుచర్ల ఎస్సై రవీందర్.. సిబ్బంది, రెస్క్యూ టీంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. రాత్రి 10 గంటల వరకు గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. అయితే ఆదివారం తెల్లవారు జామున మూసీకి అవతలి వైపు మృతదేహం తేలడంతో ఎస్సై సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉధృతికి నీటిలో దిగడానికి సిబ్బంది ఎవరూ సాహసించకపోవడంతో ఎస్సై రవీందర్ ఓ తాడు తీసుకుని నదిలో ఈదుకుంటూ వెళ్లి బాలిక మృతదేహం వద్దకు చేరారు. బాలిక మృతదేహాన్ని జాలర్లు ఉపయోగించే తెప్ప మీదకు చేర్చి, ఈదుకుంటూ రెస్క్యూ టీం సాయంతో ఇవతలి ఒడ్డుకు తెచ్చారు. దీంతో ఆయన్ను గ్రామస్థులు అభినందించారు.

తరాల చీకటి!





దేన్నైనా ఎంతకాలం భరిస్తవ్
ఎగరాలనుకునే ప్రతీసారి
నీ రెక్కలు కట్టేస్తున్న
తరాల చీకటి ఇది!

కళ్లముందే... పార్టులు పార్ట్‌లుగా
జీవితం ముగిసిపోతుంటుంది
చెరగని చిరునవ్వులతో...
రాలుతున్న పూలను చూసి
ఒంటరిగా దుఃఖిస్తుంటావు

మెరుపుల కలల్ని
నీలో సమాధి చేసుకుంటూ
ఒక సాహసయాత్రలో
నడుస్తుంటావు

రేపైనా గెలవకపోతానా అని
ప్రతీరోజూ ఓడిపోతుంటావు

మర్రిచెట్టులా నీడను పంచాలనుకుంటావు
మల్లెతీగవై పందిరిగుంజలమీదే
కాలాన్ని గడుపుతుంటావు
నెరవేరని ఆశల్ని
చలిమంటమీద కాల్చుకుంటూ...
తలుచుకొని తలుచుకొని
పొగిలి పొగిలి ఏడుస్తుంటావు
అడ్డంపడ్డ ఎద్దు కొమ్ము మీద కూర్చొని
కన్ను పొడుచుకు తింటున్నట్టు కాకి కాలం
నీ మానని గాయమై వెంటనడిచే నేస్తం
దుఃఖసంద్రాల మీద
ఒంటరి ప్రయాణీకుడివై
ఒడ్డును కలగంటుంటావు

చెరువుగట్టున చేపవై
చావుబతుకుల నడుమ
ఎదురీదుతుంటావు

గెలుపో... ఓటమో...
నీ కొట్లాటను చూసి
లోకం ఒక రిపోర్ట్ తయారుచేస్తుంది...
ఏదీ పట్టించుకోకు...
ఎక్కడా ఆగిపోకు...
నీకోసం ఉదయించే సూర్యోదయాలు
నీకోసం రెక్కలు చాచే సముద్రాలు
నీవైన కాలాలు తప్పక పుట్టకపోవు
రేపటిని నీకు
బహుమానంగా ప్రకటించకపోవు!

■ పసునూరి రవీందర్
✆ 77026 48825

కవిత్వ బలానికి కళా సాధనాలు

కవిత్వమంటే మనసులో ఉప్పొంగే భావాలను ఉద్వేగంగా చెప్పడమే కాదు, దానికి మించిన అర్థం, శబ్దం, భావోద్వేగాల కలయిక. కవిలో కలిగే అంతర్ బహిర్ సంఘర్షణలకు ప్రతిరూపమైన కవిత్వానికి ప్రాణం పోసే కళా సాధనాలు అనేకం ఉన్నాయి. ఈ సాధనాలు లేకుండా కవిత్వం ఒక ఆత్మ లేని దేహం.

గొప్ప కవులు తమ కవిత్వంలో ఒక వాతావరణాన్ని సృష్టించడానికి, శబ్దం ద్వారా మాధుర్యాన్ని ఇవ్వడానికి, ఉత్కృష్ట దృశ్యాలను ఆవిష్కరించడానికి, భావోద్వేగాలను లోతుగానూ స్పష్టంగానూ వ్యక్తీకరించడానికి, చెప్పదలచుకున్న అర్థాన్ని పొరలు పొరలుగా ప్రవేశపెట్టడానికి ఈ సాహిత్య కళా సాధనాలను ఉపయోగిస్తారు. ఫలానా సాధనాన్ని వాడుతున్నామని ప్రత్యేకంగా కవులు అనుకోరు కాని వారి కవిత్వాన్ని పరిశీలిస్తే ఇవి కనిపిస్తాయి.


వీటిలో ముఖ్యమైనవాటిని పరిశీలిద్దాం. కవిత్వంలో 'ప్రతిబింబాలు' (Imagery) చదువరి మనసుకి ఆనందాన్ని కలిగించే చిత్రణని ఇస్తాయి. ఉదాహరణగా చెప్పుకుంటే "ఆకాశం తేనెలా ఒలుకుతోంది.". 'ఉపమానం' (Simile) అంటే "వంటి" లేదా "లాగా" ఇలాంటి పదాలతో పోలికను సృశించడం. 'రూపకం' (Metaphor) అంటే నేరుగా పోలిక చేయడం. 'జీవీకరణ' (Personification) కవిత్వంలో నిర్జీవ వస్తువులకు మానవ లక్షణాలని ఆపాదించటం. 'అనుప్రాస' (Alliteration) కవితలోని పదాల ఆరంభాలలో ఒకే ధ్వనుల్ని పునరావృత్తి చేయడం.

ఇక 'యమకం' (Rhyme) అంటే సమాంతరంగా పద అంత్యాలలో ధ్వనుల పునరావృత్తి. 'ఛందస్సు' (Rhythm/ Meter) ఇది కవిత్వంలో తాళం, ఉచ్చారణ ధోరణికి ఉదాహరణ. 'ఎంజాంబ్మెంట్' (Enjambment) అంటే కవితలో పంక్తి ముగిసిన తర్వాత, ఆ పంక్తిలోని భావం ఆగకుండా తదుపరి పంక్తికి కొనసాగడం. ఇక 'ముగింపు పంక్తి' (Endstopped line) అంటే పంక్తి చివర విరామ చిహ్నాన్ని ప్రకటించడం, మరొక సాధనం 'పునరావృత్తి' (Repetition) కవితలో పదాలను, పద బంధాలను మళ్లీ మళ్లీ వాడడం. కవిత్వంలో 'సంకేతం' (Symbol) అత్యంత ప్రధానంగా కనిపించే సాధనం, అది ఒక మామూలు వస్తువు ద్వారా లోతైన భావాన్ని చెప్పడం. 'Irony' అంటే వాక్యంలో ఒకటి అంటూనే, దానికి విరుద్ధమైన అర్థాన్ని స్ఫురింపచేయటం. ఇది మాటల్లో ద్వంద్వార్థం ద్వారా హాస్యం, వ్యంగ్యం, లేదా ఆకస్మిక మలుపును చూపించడానికి వాడతారు.

Onomatopoeia అనేది ధ్వన్యనుకరణ శబ్దాల అలంకారం. అంటే, ఏదైనా వస్తువు లేదా చర్య పలికించే సహజమైన శబ్దాన్ని దాన్ని సూచించే పదం కూడా అనుకరించడం అన్నమాట. ఈ శబ్దం చదువరికి మానసికంగా కూడా అనుభూతిని కలిగిస్తాయి. 'అతిశయోక్తి' అంటే, ఏదైనా విషయాన్ని ఉద్దేశపూర్వకంగా అతిశయంగా, చాలా ఎక్కువగా చెప్పడం అన్నమాట. ఇక 'విరోధాభాసం' (Paradox) అనేది బయటకు తేలికగా అర్థం చేసుకున్నప్పుడు తప్పుగా అనిపించవచ్చు కానీ లోతుగా ఆలోచిస్తే అది నిజం అయ్యే వాక్యం లేదా భావన. ఇక Oxymoron అనేది వ్యతిరేక భావాలు కలిగిన రెండు పదాలను ఒకే చోట కలిపే శైలీ అలంకారం.

> **కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు కవితను కేవలం మామూలు పదాల సమాహారంగా కాకుండా, లోతైన అనుభూతి ప్రయాణంగా మార్చుతాయి.**

'అనిశ్చితి', 'అస్పష్టత' (Ambiguity) అనేది ఒక పదం, లేదా వాక్యం, లేదా భావానికి ఒకటి కంటే ఎక్కువ అర్థాలు కలిగి ఉండే స్థితి. 'ప్రత్యక్ష సంబోధన' (Direct Address) శైలిలో రాసిన కవితలో కవి నేరుగా ఒక వ్యక్తి, వస్తువు, లేదా భావనను సంబోధిస్తూ మాట్లాడుతున్నట్టు ఉంటుంది. Refrain అనేది 'పునరావృత పదబంధం'. ఇందులో ఒకే పదబంధం లేదా వాక్యం ఆ కవితలో, పాటలో, లేదా ప్రసంగంలో పునరావృతంగా వస్తుంది. 'ఇంద్రియ మిశ్రమం' (Synaesthesia) అనేది ఒక ప్రత్యేకమైన అలంకార శైలి. ఇందులో ఒక ఇంద్రియ అనుభూతిని మరొక ఇంద్రియ ద్వారా వ్యక్తీకరిస్తారు (ఉదా: "నీ మాటలు తేనెలా మధురంగా ఉన్నాయి" - అంటే శబ్దాన్ని రుచిగా అనుభవించడం, రంగును మోగుతుందనిపించడం, గంధాన్ని చూడగలిగినట్లు చెప్పడం.)



ఇలా కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు కవితను కేవలం మామూలు పదాల సమాహారంగా కాకుండా, లోతైన అనుభూతి ప్రయాణంగా మార్చుతాయి. ఎవరు రాసినా కవితలు శబ్దాన్ని వినిపించాలి, చిత్రాన్ని చూపించాలి, హృదయాన్ని స్పృశించాలి. ఈ మూడింటినీ కలిపే మంత్రం కవిత్వంలోని ఈ కళా సాధనాలల్లో దాగి ఉంది. మనం రాసిన కవిత్వం బలపడాలంటే కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు మనకు మార్గదర్శకాలు.

■ వారాల ఆనంద్
✆ 94405 01281

'నాగటి తరం' నవల

నందిని సిధారెడ్డి నవల 'నాగటి తరం' ఆవిష్కరణ సభ నవంబర్ 16 ఉ.10గం.లకు సిద్దిపేట జిల్లా బందారంలో జరుగుతుంది. ఆహ్వానం నర్ర భగవాన్‌రెడ్డి; అధ్యక్షత బైస దేవదాసు; ఆవిష్కరణ వాసిరెడ్డి నవీన్; సమీక్ష నాళేశ్వరం శంకరం; ఆత్మీయ అతిథులు దేవీ ప్రసాద్, దేశపతి శ్రీనివాస్, విరాహత్ అలీ, నక్క యాదవ రెడ్డి, కందుకూరి శ్రీరాములు తదితరులు.

సిద్దెంకి యాదగిరి

కాళోజీ పురస్కారాలు

కాళోజీ సోదరుల యాది సభ, కాళోజీ పురస్కారాల ప్రదానం నవంబర్ 13 సా.6గం.లకు వాగ్దేవి డిగ్రీ అండ్ పిజీ కళాశాల, కిషన్ పుర, హన్మకొండలో జరుగుతాయి. అధ్యక్షత ఎస్. జీవన్ కుమార్, ముఖ్య అతిథి అంపశయ్య నవీన్. పురస్కారాలను మంగారి రాజేందర్, అంజనీ కుమార్ గోయల్ అందుకుంటారు.

కాళోజీ ఫౌండేషన్

'మట్టిపువ్వు' కవిత్వ సంపుటి

ఎస్. తిర్మల్ కవిత్వ సంపుటి 'మట్టి పువ్వు' ఆవిష్కరణ నవంబర్ 16 సాయంత్రం ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరుగుతుంది. అధ్యక్షత సయ్యద్ హనీఫ్, ఆవిష్కర్త జయధీర్ తిరుమలరావు, ముఖ్య అతిథులు జూలూరి గౌరీశంకర్, జీవన్, మువ్వా శ్రీనివాసరావు, పోటు రంగారావు, నున్నా నాగేశ్వర రావు తదితరులు.

ఎన్. అరుణ

సోమవారం 10 నవంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'తెలంగాణ దేశీ సాహిత్య గంప'

తెలంగాణ సాహిత్య అకాడమి 'సాహిత్యవారం' కార్యక్రమంలో భాగంగా కాలువ మల్లయ్య రెండు పుస్తకాలు 'తెలంగాణ దేశీ భాష సాహిత్య గంప', 'బుక్ ఆఫ్ కల్చర్' (ఇంగ్లిష్) ఆవిష్కరణ సభ నవంబర్ 15 సా.5గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త పులికొండ సుబ్బాచారి, పరిచయం టి. గౌరీశంకర్, బాణాల భుజంగరెడ్డి.

నామోజు బాలాచారి

తెలంగాణలో మహిళల కథలు

సాహిత్య అకాడమీ, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'తెలంగాణలో మహిళల కథలు: వికాసం, విస్తృతి, వైవిధ్యం' అంశంపై సదస్సు నవంబర్ 15 ఉ.10గం.ల నుంచి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ బిల్డింగ్, తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి లో జరుగుతుంది. ఎల్. సురేశ్ కుమార్, కరిమిండ్ల లావణ్య, ఎస్వీ సత్యనారాయణ, టి. యాదగిరి రావు, సూర్యాధనంజయ్, పి. కనకయ్య, వంగరి త్రివేణి తదితరులు పాల్గొంటారు.

సాహిత్య అకాడమీ

అనువాదంతోపాటు అదనపు శ్రమా ఉంటుంది!


ముస్లిం బాల్య జీవిత అనుభవాలతో నెల్లూరు మాండలికంలో మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన పుస్తకాలు 'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు'ను అనువాదకురాలు **డి.వి. శుభశ్రీ** ఇంగ్లీష్ లోకి అనువదించారు. ఈ అనువాదాలను 'స్పీకింగ్ టైగర్' ప్రచురణ సంస్థ 'దట్స్ ఏ ఫైర్ ఆంట్ రైట్ దేర్' పేరుతో ఇటీవల విడుదల చేసింది. ఈ సందర్భంగా అనువాదకురాలితో 'వివిధ' సంభాషణ.

'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు' పుస్తకాలనే అనువాదానికి ఎందుకు ఎంచుకున్నారు?

నిజం చెప్పాలంటే పదేళ్ళ కిందట ఈ పుస్తకాలని చదివినప్పుడు అందరి లాగే ఇవి అనువాదానికి లొంగవని ఊరుకున్నాను. ఆపై ఖదీర్ బాబు గారు రాసినవే 'మెట్రో కథలు'లో కొన్నింటిని అనువదించాను. అయితే కాలక్రమేణా అనువాద ప్రక్రియపై నా అవగాహన పెరిగింది. అనేక భాషల అనువాదాలు చదవటంతోపాటు, ట్రాన్స్‌లేషన్‌లో పీజీ డిప్లొమా చేసాను. ఆ తర్వాత నాకు అనిపించింది ఏమిటంటే– అనువాదంలో భాషాపరంగాను, ఇతరత్రాను ఎన్నో అంశాలు కోల్పోయినప్పటికీ, ఒక పుస్తకం అనువాదం కావటం వల్ల ఎంతో మేలు కూడా జరుగుతుంది. ఇంగ్లిష్, రష్యన్, బెంగాలీ భాషల నుంచి తెలుగులోకి అనువదించడం కుదరని పని అనుకుని ఉంటే తెలుగువారు ఎంతో కోల్పోయేవారు. 'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు' వంటి పుస్తకాలు ఇంగ్లీష్‌లోకి వెళ్ళడం ద్వారా తెలుగేతరులకు మన సాహిత్యం, సంస్కృతి, భాష రుచి తెలిసే అవకాశం ఉంది. ఈ కథల్లో రచయిత మనల్ని నవ్విస్తూనే ప్రస్తావించిన అనేక విషయాలు సమాజాన్ని ఆలోచింపచేసే విధంగా ఉంటాయి.

బాల్య అనుభవాలతో ప్రాంతీయ మాండలికంలో రాసిన ఈ కథలను ఇంగ్లీష్‌లోకి అనువదించటం ఎలాంటి అనుభవం?

ఈ కథలు అనువదించడం సాహసమే. వీటిలో అనువాదానికి లొంగని మూడు అంశాలున్నాయి: నెల్లూరు మాండలికం, ముస్లిం తెలుగు సంస్కృతి కలగలిసి ఉండటం, అంతర్లీనంగా సాగే హాస్యం. ఈ మూడింటిని ఇంగ్లీష్ లోకి మార్చటం పెను సవాలు. దీన్ని అధిగమించడానికి మూస పద్ధతిలో మాటకి మాట, పదానికి పదం అన్నట్టు కాకుండా, కొత్త ఆలోచనలు చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా, ఇంగ్లీష్‌లో కూడా మన దేశీయ పరిమళం ఉట్టిపడే విధంగా అనువదించాలని నిర్ణయించుకున్నాను. వీలైనంతవరకు అవసరమైనచోట తెలుగు, ఉర్దూ పదాలను కొద్దిపాటి వివరణతో అలాగే ఉంచేసాను. Formal, written English లోకి కాకుండా, Spoken Indian English లోకి తర్జుమా చేసాను.



మీ అనువాదంతో ప్రచురణ సంస్థలని ఎలా అప్రోచ్ అయ్యారు? ఈ క్రమంలో ఎదురైన అనుభవాలు ఏమిటి?

అనువాదాలకి గుర్తింపు, మార్కెట్ పెరుగుతున్నప్పటికీ, అనువాదాలను ప్రచురణ దాకా తీసుకు వెళ్ళటం ప్రయాసతో కూడుకున్న పనే. నేను ఐదారేళ్ళకు పైగా అనేక ప్రచురణ సంస్థల తలుపు తట్టాను కానీ పెద్దగా లాభం లేకపోయింది. అడపాదడపా ఆన్‌లైన్ మ్యాగజైన్లలో కథలు ప్రచురించాను. అనువాదకులు కేవలం అనువాదం మాత్రమే చేస్తారు అనేది అపోహ. ఒక పుస్తకం మరో భాషలో రావాలంటే అనువాదకులు చేపట్టే స్వచ్ఛంద అదనపు శ్రమ చాలా ఉంటుంది. కాపీరైట్ సంపాదించడం దగ్గర నుంచి, ప్రపోజల్ రాయటం, రీసెర్చ్ చేయటం, ప్రచురణకర్తని ఒప్పించటం వంటి పనులు లెక్క లోకి రావు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పనులన్నింటికీ నిర్దిష్టమైన సంస్థాగత ఆలంబన లేకపోవడం, అనువాద ప్రక్రియకి గానీ అనువాదకులకి గానీ ప్రోత్సాహం లేకపోవడం పెద్ద లోటు.



సంస్థాగతంగా ఏ ప్రోత్సాహం అవసరం?

కేంద్రీయ, రాష్ట్ర సాహిత్య అకాడెమీలు చాలా నాణ్యమైన పని చేస్తున్నాయి కానీ, మనకున్న భాషా సంపదకి అది సరిపోదు. దేశ భాషల్లోకైనా, విదేశీ భాషల్లోకైనా మన సాహిత్యం వెళ్ళాలీ అంటే ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పౌరులు అందరూ పూనుకోవాలి. అనువాదకులను తయారు చేయడానికి కావలసిన శిక్షణ, అనువాదాన్ని వృత్తిగా చేపట్టడానికి అవసరమైన ఆర్థిక సాయం, ఫెలోషిప్స్, గ్రాంట్స్, రెసిడెన్సీస్ వంటివి కల్పించి, అనువాదాన్ని ప్రోత్సహించే ఎకోసిస్టమ్‌ను తయారుచేయడం అవసరం.

అనువాదాల్ని పెద్ద ప్రచురణ సంస్థల వద్దకు తీసుకు వెళ్లినప్పుడు కొత్త అనువాదకులు ఎలాంటి సవాళ్లకు సిద్ధం కావాలి?

అనువాదకులు తాము అనువాదానికి ఎంచుకున్న పద్ధతిని, తమ నిర్ణయాలని జస్టిఫై చేసుకోగలగాలి. మూల భాషనీ, వస్తువునీ రూపు మాపకుండా, అదే సమయంలో exoticize చేయకుండా చదువరులకు చేర్చడం ముఖ్యం.

ఈ పుస్తకం విషయంలో 'స్పీకింగ్ టైగర్' ప్రచురణ సంస్థ ఎడిటర్ల నుంచి మీకు ఎలాంటి సూచనలు అందాయి?

ఎడిటర్లు మొదటి డ్రాఫ్ట్ చదివాక వాళ్ళకి కూడా ఈ కథల్లో హాస్యం వినిపించింది అన్నప్పుడు ఊపిరి పీల్చుకున్నాను. అయితే, తెలుగు, ఉర్దూ మాటలను ఎంతవరకు వివరించాలి అనే ప్రశ్నపై కొంత చర్చ జరిగింది. చదువరులకు మన మాటలు మొదట్లో కొత్తగా అనిపించినా అర్థమయ్యే కొద్దీ అలవాటుపడతారు అనే నమ్మకం మాకు కలిగింది. జెర్రీ పింటో, మినీ కృష్ణన్ వంటి సాహిత్య దిగ్గజాలకు ఈ కొత్తరకం కథలు, అనువాద శైలి నచ్చాయి అంటే, దాన్నే విజయంగా పరిగణిస్తున్నాను.

మంట



నీటిలో దాక్కుంటావు సరే
నిప్పులో ఎట్లా దాక్కుంటావు?
మేఘవిస్ఫోటనం నుండి
తప్పించుకుంటావు సరే
ఆకాశం గురి చూసి కొడుతున్న
పిడుగులను ఎట్లా తప్పించుకుంటావు?
పర్వతాల నుండి వరదై ప్రవహిస్తున్న
ఘోర హిమపాతం సరే
అగ్నిపర్వతాల్ని బద్దలుకొట్టుకుని వచ్చే
లావా ప్రవాహం సంగతేమిటి?

కార్చిచ్చుకు బలవుతున్న ప్రతి చెట్టు
ఒక ఆగ్నేయాస్త్రమే
యుద్ధం కూడా ఫైర్‌తో మొదలై
ఫైర్‌తో అంతమవుతుంది
కాని అన్ని అగ్నుల కన్నా క్రూరమైంది
అన్ని చిచ్చుల కన్నా భయంకరమైంది
అన్ని మంటల కన్నా ప్రాణాంతకమైంది
ఒకటుంది
క్షణక్షణం మృత్యువుకు చేరువ చేసే
కాలకూటం
కడుపులో విస్తరించే ఎడారి
మనిషిని జంతువు చేసే ఘోర కరువు
అదే
ఆకలిమంట!

■ అమ్మంగి వేణుగోపాల్
✆ 94410 54637

బహుళ స్వరాల నేటి విమర్శ

కొంతమంది కవులు/ రచయితలు తాము చెప్పింది పరమ ప్రామాణికం అనే ఆలోచనతో, ఎటువంటి పరిశోధనాత్మక పద్ధతి లేకుండా, కేవలం వ్యక్తిగత అభిప్రాయాలను, సాధారణ ప్రకటనలను సిద్ధాంతాలుగా ప్రకటిస్తున్నారు. ఇది విమర్శకు నష్టం చేస్తుంది. సుంకర గోపాలయ్య రాసిన 'ప్రమాణాల్లేని నేటి విమర్శ' వ్యాసం (వివిధ: 03-11-2025) ఈ కోవలోని వ్యాసమే! ఈ వ్యాసంలో, గత పదిహేనేళ్లుగా తెలుగు విమర్శ స్తబ్దతలో ఉందని, కొత్త సిద్ధాంతాలు లేవని, లోతైన విశ్లేషణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు గోపాలయ్య. కట్టమంచి నుండి త్రిపురనేని వరకు సాగిన 'పద్ధతైన' విమర్శ ఆగిపోయిందని, నేటి విమర్శకులు కేవలం 'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. వ్యాసంలో వ్యక్తమైన కొన్ని ఆందోళనలలో వాస్తవం ఉన్నప్పటికీ, సమకాలీన విమర్శనా రంగాన్ని పూర్తిగా 'ప్రమాణాలు లేనిదిగా' కొట్టిపారేయడం పొరపాటు. వాస్తవానికి, నేటి తెలుగు విమర్శ 'ప్రమాణాలు లేకపోవడం'తో బాధపడటం లేదు; అది 'ఏక ప్రమాణం' స్థానంలో 'బహుళ ప్రమాణాల' వైపు పరిణామం చెందింది. ఇది బలహీనత కాదు, ఆధునిక సమాజపు సంక్లిష్టతకు, సాహిత్యపు వైవిధ్యానికి అద్దం పట్టే పరిపక్వతకు సంకేతం.

మూల వ్యాసంలో 'కొత్త సిద్ధాంతాలు లేవు' అన్న ప్రధాన ఆరోపణ అత్యంత విస్మయపరిచే వాదన. 'కొత్త సిద్ధాంతం' అంటే ఆకాశం నుండి ఊడిపడదు; ప్రపంచవ్యాప్తంగా వస్తున్న నూతన తాత్విక చింతనలను, సామాజిక శాస్త్ర సిద్ధాంతాలను మన సాహిత్యానికి అన్వయించి, మనదైన విమర్శనా పద్ధతులను నిర్మించుకోవడమే. ఆ దిశగా గత పదిహేనేళ్లలో జరిగిన, జరుగుతున్న కృషిని విస్మరించలేం.

ఈ కాలంలో అస్తిత్వవాద విమర్శలు విస్తరించాయి. ఈ కోవలో దళిత, స్త్రీవాద, బీసీ, ప్రాంతీయవాద విమర్శలు కేవలం 'వస్తు' విమర్శగా ఆగిపోలేదు. అవి తమదైన సౌందర్య శాస్త్రాలను నిర్మించుకుంటున్నాయి. ముస్లిం సాహిత్యంపై సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకం 'సవారు', కొలిమి పత్రికలో కాత్యాయనీ విద్మహే 'నీలి రాగం' వ్యాసాలు, దత్తయ్య అట్టెం పుస్తకం 'తెలంగాణ బి.సి. వాద సాహిత్యం', సూర్యా ధనంజయ్ పుస్తకం 'కాకోటి' వంటివి ఈ కోవలోనివే. అద్లూరు రఘురామరాజు "వాచకం, పఠనం, విమర్శ" అన్న కోణంలో వడ్డెర చండీదాస్ నవలలను చర్చించిన గ్రంథం 'వడ్డెర చండీదాస్: దర్శనమూ సాహిత్యమూ'. జి. అరుణ కుమారి ఫ్యూచరాలజీ కోణంలో రాసిన గ్రంథం 'తెలుగు కవిత్వం భవిష్యద్దర్శనం'. ఓల్గా మల్టీ డిసిప్లినరీ పెర్‌స్పెక్టివ్‌లో రాసిన గ్రంథం 'సంతులిత'. యస్. రఘు డిస్క్రిప్టివ్ క్రిటిసిజం కోణంలో రాసిన గ్రంథం 'సమన్వయ'... జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్ నవ్య దళిత వాద విమర్శ వంటి కొత్త పద్ధతులను పరిచయం చేశారు. ఇవన్నీ 'కొత్త సిద్ధాంతాల' అన్వయాలు, నిర్మాణాలే. కాబట్టి, 'ఏమీ జరగడం లేదు' అనడం కళ్ల ముందున్న వాస్తవాన్ని కాదనడమే.

విమర్శకుడు 'న్యాయమూర్తి' పాత్ర పోషించాలని మూల వ్యాసం ఆశిస్తున్నది. కానీ ఆధునిక విమర్శలో 'న్యాయమూర్తి' పాత్ర స్థానంలో 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం. గతంలో కట్టమంచి వంటి వారు 'కవిత్వం ఇలా ఉండాలి' అని తీర్పులు ఇచ్చారు. అది ఆ కాలపు చారిత్రక అవసరం. నేటి విమర్శ ఒక రచన 'ఎందుకు అలా ఉంది', 'దాని సామాజిక – చారిత్రక సందర్భం ఏమిటి,' 'దాని వెనుక భావజాలం ఏమిటి' అని విశ్లేషిస్తోంది. 'తీర్పు' ఇవ్వడం కంటే, 'పాఠకుడికి ఆ రచనను బహుళ కోణాల్లో అర్థం చేసుకునే పరికరాలను అందించడం' నేటి విమర్శ లక్ష్యం. నేటి విమర్శలో 'కేవలం విశ్లేషణ మాత్రమే చూస్తున్నాం' అని గోపాలయ్య నిరాశపడుతున్నారు. కానీ ఆ 'విశ్లేషణ'లోనే 'మూల్యాంకనం' అంతర్భాగం.

'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటలతో రాస్తే విమర్శ కాదని గోపాలయ్య తీసిపారేయడం సరికాదు. ఏ కాలపు విమర్శ అయినా వీటి చుట్టూనే తిరుగుతుంది. సమస్య ఆ మాటల్లో లేదు, వాటిని విశ్లేషించే పద్ధతిలో ఉంది.



ఉదాహరణకి గోపాలయ్య ప్రస్తావించిన వాటిలో మొదటిదైన 'వస్తువు'నే తీసుకుంటే– గతంలో వలె నేటి విమర్శ రచనలో 'వస్తువు ఏమిటి' అనేదానికే పరిమితం కాలేదు. 'ఆ వస్తువును ఎవరి దృక్కోణం నుంచి చూస్తున్నారు' అనేది నేటి విమర్శ ప్రధాన ప్రశ్న. ఉదాహరణకు, 'కుటుంబం' అనే ఒకే వస్తువును– మార్క్సిస్టు విమర్శ 'వర్గ' సంబంధాల కోణంలోను; స్త్రీవాద విమర్శ 'లింగ' వివక్ష, 'పితృస్వామ్య' కోణంలోను; మనోవైజ్ఞానిక విమర్శ 'అంతర్గత' సంఘర్షణల కోణంలోను విశ్లేషిస్తుంది. ఇక నేటి విమర్శ రచనలోని 'భాష' కేవలం 'సరళంగా ఉందా, సంక్లిష్టంగా ఉందా,' 'గ్రాంథికమా, వ్యావహారికమా' అని చూడటం లేదు. భాష వెనుక ఉన్న 'అధికార సంబంధాలను', 'ఆధిపత్య భావజాలాన్ని' శోధిస్తోంది. దీన్నే Discourse Analysis అంటారు. తెలంగాణ, రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ 'భాష'పై, 'మాండలికాల రాజకీయం'పై చేసినంత లోతైన చర్చ గతంలో ఎన్నడూ లేదు. ప్రామాణిక భాష పేరుతో కొన్ని ప్రాంతాల, సమూహాల భాషను ఎలా అణచివేశారో విశ్లేషించడం నేటి విమర్శలో ముఖ్యమైన అంశం కాదా? ఇక 'అభివ్యక్తి', 'శిల్పం' విషయానికి వస్తే– ఆధునికోత్తరవాద పద్ధతులు వచ్చిన తర్వాత 'శిల్పం'పై విశ్లేషణ పూర్తిగా మారింది. గతంలా ఇది అలంకారాల లెక్క, ఛందస్సుల బేరీజు కాదు. కథన పద్ధతులు, మ్యాజిక్ రియలిజం, ఇంటర్–టెక్స్ట్యువాలిటీ (intertextuality) వంటి కొత్త పరికరాలతో శిల్పాన్ని విశ్లేషిస్తున్నారు. పాఠకుడి పాత్ర కూడా శిల్ప విశ్లేషణలో భాగమైంది.

మూల వ్యాసకర్త బహుశా పత్రికల్లో వచ్చే 'సమీక్ష'లను చూసి, దాన్నే సమగ్ర 'విమర్శ'గా భ్రమపడి ఉండవచ్చు.

కట్టమంచి, రా.రా. వంటి విమర్శకులను ప్రస్తావిస్తూ గోపాలయ్య గతాన్ని ఆదర్శీకరిస్తున్నారు. వారు గొప్ప విమర్శకులే, కానీ వారి కాలపు ప్రమాణాలతో నేటి అస్తిత్వవాద (దళిత, బీసీ, గిరిజన) సాహిత్యాన్ని కొలవలేం. "సృజన ఆధారంగానే విమర్శ పరికరాలను సిద్ధం చేసుకోవాలి" అని వ్యాసకర్త చెప్పిన వాక్యమే ఆయన వాదనను ఖండిస్తుంది.

గత 15-20 ఏళ్లలో తెలుగు సృజనాత్మక సాహిత్యం (ప్రపంచీకరణ, తెలంగాణ ఉద్యమం, అస్తిత్వవాదాల కేంద్రంగా) పూర్తిగా మారింది. ఈ 'కొత్త సృజన'ను అర్థం చేసుకోవడానికి విమర్శ కూడా 'కొత్త పరికరాలను' సిద్ధం చేసుకుంది (దళిత, స్త్రీ, బీసీ వాదాలు, బయోపాలిటిక్స్ మొదలైనవి). ఈ పరిణామాన్ని గుర్తించకుండా 'ఏమీ జరగడం లేదు' అని తేల్చేయడం నిరాశావాదం. సమకాలీన తెలుగు విమర్శ 'ప్రమాణాలు లేని' శూన్యంలో లేదు. అది గతం కంటే భిన్నంగా, బహుళ స్వరాలతో కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల వల్ల విమర్శ ప్రజాస్వామ్యీకరించబడింది. అక్కడ 'కువిమర్శ' ఉన్నా, లోతైన సిద్ధాంత చర్చలూ ఉన్నాయి.

■ వెంకట రామయ్య గంపా
✆ 99586 07789

కులాంతర వివాహాలకు ప్రోత్సాహమేది?

- ఎస్సీలను పెళ్లి చేసుకున్నవారికి అందని ఆర్థిక సాయం
- వరంగల్ జిల్లాలో 160 జంటల ఎదురుచూపులు
- ఐదేళ్లలో ఇచ్చింది కేవలం 40 మందికే..

7



నాయనా..!

మద్యం షాపుల విజేతలకు లిక్కర్ డాన్‌ల వల

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

లక్కీడ్రాలో మద్యం షాపులను దక్కించుకున్న అదృష్టవంతులపై లిక్కర్ వ్యాపారులు వల వేస్తున్నారు. ఏళ్ల తరబడి లిక్కర్ వ్యాపారంలో ఉండి పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో షాపులు దక్కకపోవటంతో వీరిపై నజర్ వేశారు. ఏరియాను బట్టి మద్యం షాపునకు రూ.75లక్షల నుంచి రూ.2కోట్లకు పైగా గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. దీంతో వ్యాపారంలో పెద్దగా అనుభవం లేనివారు ఈ ఆఫర్ జాక్‌పాట్‌గా భావిస్తున్నారు. ఫలితంగా కోట్లాది రూపాయలు లిక్కర్ షాపుల పేరిట చేతులు మారుతున్నాయి.

పాత.. కొత్త..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం2025-27 సంవత్సరానికి మద్యం షాపులను దకించుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. సెప్టెంబరు 26వ తేదీ నుంచి అక్టోబరు 23వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 17 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 294 లిక్కర్ షాపుల కోసం 10,493 దరఖాస్తులు వచ్చాయి. లిక్కర్ వ్యాపారంలో అపార అనుభవం ఉన్న అనేకమంది సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు వేశారు. కొందరు కొత్త వ్యక్తులు కూడా దరఖాస్తులు సమర్పించారు. అక్టోబరు 27వ తేదీన లక్కీడ్రా ద్వారా మద్యం షాపులనుకేటాయించారు. అయితే చాలామంది ఔత్సాహిక వ్యాపారులను అదృష్టం వరించింది. లక్కీ డ్రాలో కొత్తవారికి మద్యం షాపులు దక్కాయి. అయితే భారీ ఎత్తునదరఖాస్తులు వచ్చినప్పటికీ చాలామంది లిక్కర్ వ్యాపారులకు అదృష్టం కలిసిరాలేదు.

సిండికేట్

హనుమకొండకు చెందిన ఓ సిండికేట్ బృందం రూ.6.30కోట్లతో 210 డీడీలు తీసి దరఖాస్తులు వేస్తే కేవలం 18 షాపులే దక్కాయి. వరంగల్‌కు చెందిన మరో సిండికేట్ టీమ్ వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో సుమారు రూ.4.62కోట్లతో 154 డీడీలు తీసి దరఖాస్తులు వేస్తే కేవలం రెండు షాపులే లక్కీడ్రాలో తగిలాయి. ఇలా అనేక మంది లిక్కర్ వ్యాపారులు సిండికేట్‌గా డీడీలు తీసి దరఖాస్తులు వేస్తే.. అదృష్టం కలిసి రాలేదు. దీంతో చాలామంది వ్యాపారులు డీలా పడిపోయారు. అయితే కొంతమంది ఔత్సాహికులకు అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది.

వరంగల్ జిల్లాలో 18 మంది యువకులు కలిసి 18 డీడీలు తీసి దర ఖాస్తులు వేస్తే వీరికి ఏడు షాపులు తగిలాయి. అలాగే 10మంది టీమ్‌గా 24డీడీలు తీసి దరఖాస్తు లు సమర్పిస్తే.. వీరికి 12 షాపులు తగిలాయి. అయితే ఏళ్ల తరబడి లిక్కర్ వ్యాపారంలో ఉన్నవారికి షాపులు దక్కకపోవటంతో కంటికి నిద్రకూడా రావడం లేదు. దీంతో గుడ్‌విల్‌తో లిక్కర్ (మిగతా 7వ పేజీలో)

- ఎంత ఇచ్చి అయినా షాపులను దక్కించుకునేలా ప్లాన్
- ఏరియాను బట్టి రూ.70లక్షల నుంచి రూ.2కోట్ల వరకు ఆఫర్
- పట్టణం కంటే గ్రామీణ ప్రాంతాల దుకాణాలకే ప్రాధాన్యత
- పెద్ద మొత్తంలో వస్తుండడంతో ఖుషీ అవుతున్న లక్కీడ్రా విజేతలు
- షాపు నిర్వహణ, స్థలం, పెట్టుబడి భయంతో ఆఫర్‌కే మొగ్గు
- వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కొత్త షాపులు

ప్రభుత్వ ఆదాయానికి దీటుగా..

లిక్కర్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి దీటుగా గుడ్‌విల్ కింద ఖర్చు చేస్తున్నారు. ఏ4 మద్యం షాపునకు రెండేళ్లలో రూ.55లక్షలు చెల్లించాలి. ఒక్కో విడతకు రూ.9,16,667 చొప్పున ఆరు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ప్రభుత్వానికి రెండేళ్లలో ఒక షాపునకు రూ.55లక్షల ఆదాయమే వస్తుంది. కానీ గుడ్‌విల్ పేరిట కొత్తగా షాపు దక్కించుకున్నవారికి ఒక్కోషాపునకు రూ.70లక్షల నుంచి రూ.2కోట్ల వరకు చెల్లిస్తున్నారు. అంటే ప్రభుత్వానికి వచ్చే అదాయం కంటే గుడ్‌విల్ కింద షాపును అమ్ముకునే వారికే ఎక్కువ అదాయం రానుంది. ఇప్పటివరకే 23షాపుల వరకు గుడ్‌విల్ కింద లిక్కర్ వ్యాపారులు దక్కించుకున్నట్లుగా సమాచారం. వీటికి సమారు సూ.15కోట్లకుపైగా గుడ్‌విల్ కింద చేతులు మారాయనే చర్చ నడుస్తోంది. అలాగే మరో 20మద్యం షాపులకు పైగా గుడ్‌విల్‌పై బేరసారాలు జరుగుతున్నాయని లిక్కర్ మార్కెట్‌లో చర్చ నడుస్తోంది. లిక్కర్ షాపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే అదాయం కంటే లక్కీడ్రాలో షాపు దక్కినవారికే ఎక్కువ అదాయం వస్తోంది. ఇదంతా కూడా బ్లాక్‌మనీ కావటంతో పన్నుల బాధ కూడా ఉండదని భావిస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కొత్త వ్యాపారులకు గుడ్‌విల్‌తో లిక్కర్ వ్యాపారులు వల వేస్తుండటం.. జాక్‌పాట్ కొట్టామనే ఆనందం అదృష్టవంతుల్లో కనిపిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి

- రెండేళ్లలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..
- అభివృద్ధికి ఇద్దరు మంత్రులు కృషి చేయాలి..
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- హనుమకొండలో రెండో రోజు జాగృతి జనం బాట



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

వడ్డెపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో అభివృద్ధి కానరావడం లేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యమాల ఫలితంగా భౌగోళిక తెలంగాణను సాధించుకున్నామని, సామాజిక తెలంగాణే జాగృతి లక్ష్యమని తెలిపారు. కబ్జాలు చేసే వారే ఎమ్మెల్యేలు అవుతారనే నినాదం వరంగల్‌లో ఉందని చెప్పారు. వరంగల్ జిల్లాలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుంటే ఆదివాసీ తెగకు చెందిన మంత్రి సీతక్క ఉండి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ అందరి తెలంగాణ కావాలని, కొందరి తెలంగాణ కాకూడదని అన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త నాయకత్వం రావాలంటే యూనివర్సిటీలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

నిజామాబాద్‌లో మూడేళ్లలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తాము నిర్మించుకున్నామని కవిత చెప్పారు. వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వరంగల్‌లో నిర్మించే బస్టాండ్‌కు పునాది రాయి వేసి వదిలివేశారని, కేవలం షెడ్‌కే బస్టాండ్ పరిమితమైందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో భద్రకాళి చెరువు మరమ్మతుల కోసం రూ.200కోట్లు చెరువులో పోస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.300కోట్లను చెరువు మరమ్మతులకు కేటాయించి ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తుఫాన్ ప్రభావంతో రైతాంగం వేలాది ఎకరాల్లో వేసిన పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు (మిగతా 7వ పేజీలో)



మేడారంలో వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

వనదేవతలకు జోరుగా మొక్కులు

తాడ్వాయి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మేడారంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 15 వేల మంది తల్లులను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. చీరెసారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్న భక్తులు.. యాటలు, ఎదురుకోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు తీరాలని వనదేవతలను వేడుకున్నారు. కాగా, దేవస్థానం పునరుద్ధరణ పనులు జరుగుతుండగా దర్శనానికి వెళ్లే దారిని మళ్లించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని భక్తులు తెలిపారు. వనదేవతలను దర్శించుకోవడానికి వెళ్లే దారి తెలియక, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు లేక అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు.

వృత్తి విద్యతోనూ ఉపాధి అవకాశాలు

- అడిషనల్ కలెక్టర్, డీఈవో వెంకట్‌రెడ్డి
- ఉత్సాహంగా వొకేషనల్ విద్యార్థులకు జాబ్ మేళా



జాబ్ మేళాలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, డీఈవో వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి విద్యతోనూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, డీఈవో ఎ.వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్లో వొకేషనల్ విద్యార్థులకు జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి జాబ్ మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యతోనే కాకుండా వొకేషనల్ విద్యతోనూ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థులు వొకేషనల్ విద్యను అభ్యసించి నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సును అభ్యసించే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సింది గా ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ జాబ్ మేళాలో 24 కంపెనీలు పాల్గొనగా 682 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకు న్నారు. కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలు అనం తరం వివిధ కంపెనీలో 214 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉద్యోగవకాశా లు కల్పిస్తూ నియామక పత్రాలను అందజే శారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ వొకేషనల్ కోర్సు కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, ఏఎంవో డాక్టర్ మన్మోహన్, హనుమకొండ ఎంఈవో నెహ్రూ నాయక్, నిర్వాహకులు మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రామారావు, ప్రాక్టీసింగ్ స్కూల్ హెడ్మాస్టర్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధానకార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తామని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు.

ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

● దేశ సేవ కోసం..



భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్ పథకం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 10వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా అర్హత పరీక్ష సాధించిన యువకులు ఆదివారమే పెద్దఎత్తున తరలివచ్చారు. సోమవారం ఉదయమే దేహదారుఢ్య పరీక్షలు జరుగుతుండడంతో దూరప్రాంతాల నుంచి ఒక రోజు ముందుగానే చేరుకున్నారు. స్టేడియం పరిసరాల్లో షాపుల ముందు ఇలా నిద్రించారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ స్పోర్ట్స్

అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- నకిలీ బంగారం విక్రయాలు, దారి దోపిడీ కేసుల్లో నిందితులు
- రూ.3.48లక్షలు నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ, ఎస్సైలు

కాటారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం విక్రయాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆగడాలకు భూపాలపల్లి జిల్లా కాటారం పోలీసులు చెక్ పెట్టారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వివరాలను కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ ఆదివారం వెల్లడించారు. కాటారం మండలంలోని చింతకాని గ్రామ శివారులో పోలీసులు శనివారం సాయంత్రం కాటారం-మేడారం రహదారిపై గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు మేడారం వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 8 రోజుల కిందట కాటారం మండల కేంద్రంలో సూపర్ మార్కెట్ యజమానికి తక్కువ ధరకే మేలిరకం బంగారం అంటూ నకిలీ బంగారాన్ని అమ్మి రూ.10లక్షలతో ఉడాయించిన వ్యక్తులు వీరేనని తేలింది. అలాగే నస్తూరుపల్లి వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసి దోపిడీకి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రూ.3.48లక్షల నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన రాజు సోలంకి, మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన పుణ్యాబాలచంద్ రాథోడ్, మీనాపుణ్య రాథోడ్, కోరెగావ్‌కు చెందిన శాంతివిజయ సోలంకి, స్వప్న ఈశ్వర్ సోలంకిగా గుర్తించారు. ఈ ఐదుగురిని ఎస్సై శ్రీనివాస్ అరెస్టు చేశారని డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. నకిలీ బంగారం విక్రయం కేసును చేధించిన సీఐ నాగార్జునరావు, ఎస్సైలు ఆకుల శ్రీనివాస్, జక్కుల మహేష్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మరిపెడ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పెండ్లీ లింగారెడ్డి(73) ఆదివారం మృతి చెందా డు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ మృతదేహంపై పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి తమ్ముళ్లు పెండ్లీ గోవర్ధన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డిని ఓదార్చారు. మాజీ మంత్రి వెంట గాదె అశోక్‌రెడ్డి, పెండ్లీ మధుసూదన్‌రెడ్డి, రాంపెల్లి రవిగౌడ్, కొమ్ము నరేశ్ యాదవ్, చంద్రశేఖర్, పరుశురాములు, గుండగాని యాకన్న, వీరగాని వెంకన్న, రాంపెల్లి నాగన్న తదితరులున్నారు.

హైకోర్టు న్యాయవాదిగా మరిపెడ వాసి


శ్రీనివాస్ నాయక్

మరిపెడ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని దంట కుంట తండా చెందిన భూక్యా రాములునాయక్ కుమారుడైన భూక్యా శ్రీనివాస్ న్యాయవాదిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. తాను న్యాయవిద్యను సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ గిరిజన గురుకుల న్యాయ కళాశాలలో పూర్తి చేశానన్నారు. న్యాయ విద్య పూర్తి అనంతరం హై కోర్టులో న్యాయవాదిగా ప్రమాణం చేసినట్లుగా తెలిపారు. మారుమూల ప్రాంతమైన గిరిజన తండా నుంచి ప్రారంభమైన ప్రయాణం హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం గర్వకారణం అన్నారు. తాను ఈ స్థాయికి ఎదగానికి కృషి చేసిన తల్లిదండ్రులు, గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన వృత్తిలో నిబద్ధతతో సమాజానికి న్యాయం, సేవ, సమానత్వం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దవంగర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచారం గ్రామ శివారు భద్రుతండాకు చెందిన దారవత్ సోమాని (41) ఇటీవల మరణించడంతో స్నేహితుడి కుటుంబ సభ్యులకు బాల్య మిత్రులు అండగా నిలిచారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.21వేలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ చిన్న వయస్సులో మిత్రుడిని కోల్పోవడం బాధకరమన్నారు. పూర్వవిద్యార్థులు కొమరమల్లు, సంపత్, శ్రీరాం రాము, సోమన్న, శ్రీనివాసచారి, లక్ష్మణ్, మేనక, రోజా, లలిత, నాగమణి, ఉదయ్‌కుమార్, నరేష్, రమేష్, చంద్రశేఖర్, శ్రీను, సతీష్, మురళి, సుధాకర్, రమేశ్, రామకృష్ణ, గోపాల్, స్వామి, ఎర్రన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి


మృతిచెందిన యాచకుడు

కాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్ సమీపంలో బస్టాండ్ వద్ద ఓ గుర్తు తెలియని యాచకుడు మృతి చెంది ఉన్నాడు.. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు, మృతుడి వయస్సు 60 నుంచి 65 వరకు ఉంటుంది. ఛామనఛాయ రంగు, పొడవైన ముఖం, తెలుపు గడ్డం, నల్ల స్వెట్టర్‌పై తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడు. గులాబీ పూలరంగు లుంగీ, బ్లాంకెట్ కప్పుకుని ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి తీవ్ర గాయాలు.. ప్రమాద స్థలిని పరిశీలించిన సిరికొండ

కృష్ణకాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం మంజూర్‌నగర్ మైసమ్మగుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీకి చెందిన శ్రీకాంత్ శనివారం సాయంత్రం తన కారులో భూపాలపల్లి నుంచి హనుమకొండకు బయల్దేరాడు. మధ్యలో మైసమ్మ గుడి సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం తీవ్రంగా ధ్వంసం కాగా శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో హనుమకొండ వైపు వెళ్తున్న శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రుడిని దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్


ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న మూగల కుమార్ యాదవ్

న్యూశ్యాయంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి ఆధునికతలో భాగంగా ఉపయోగిస్తున్న ఫోన్స్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని డీకన్వెషన్ హాల్‌లో షైన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం రిథం - 2025 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డీఐఈవో, వరంగల్ ఆర్‌జేడీ గోపాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థుల చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల డైరెక్టర్లు మూగల రమ, ఎ.కవిత, జక్కుల శ్రీనివాస్, మూగల రమేష్‌యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజ్ గౌడ్, పీ.శ్రీనివాస్, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, షైన్ విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలకు పాంచుమినార్ సినియా యూనిట్ బృందం పాల్గొని విద్యార్థులతో సందడి చేశారు. హీరో రాజ్ తరుణ్, హీరోయిన్ సాక్షిసింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

శాడిస్టు అల్లుడు

- అత్తామామలను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి పైశాచికం
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స

ఐనవోలు, నవంబరు 9(ఆంధ్రజోతి): భార్య పుట్టింటినుంచి రానన్నందుకు ఓ శాడిస్టు అల్లుడు అత్తమామలను ట్రాక్టర్‌తో కొట్టాడు. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. ఐనవోలు మండలంలోని రెడ్డిపాలెంలో రాపోలు భీములు - కనుకమ్మల కూతురు మానసను అదే గ్రామానికి చెందిన గండికోట బాలస్వామికి ఇచ్చి కిందటేడు వివాహం చేశారు. కొద్ది రోజులుగా అల్లుడు అదనపు కట్నం తీసుకరావాలని భార్యను మానసికంగా ఇబ్బందులు పెడుతుండగా విసుగెత్తి మానస ఈ నెల 7న పుట్టింటికి వచ్చింది. దీంతో మరుసటి రోజు రాత్రి 9 గంటలకు అల్లుడు అత్తవారింటికి వచ్చి భార్య మానసను తనతో రమ్మన్నాడు. అందుకు ఆమె ఇప్పుడు వద్దు.. రేపు వెళ్దాం అని చెప్పడంతో ఆగ్రహించి కత్తితో అత్త మామలపై దాడిచేసి గాయపరిచాడు. అంతటితో ఆగకుండా ట్రాక్టర్ ఇంజన్‌ను వేగంగా నడుపుకుంటూ వచ్చి కనుకమ్మ కాళ్లపై నుంచి వెళ్లగా కాలు రెండు చోట్ల విరిగింది. మామ, భార్య, మరొకరు ఐలమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో బాలుడి కిడ్నాప్ హైడ్రామా

- ఆడుకుంటుండగా కారులో ఎక్కించుకున్న యువకుడు
- తెలిసిన వ్యక్తే చేశాడని చెబుతున్న తండ్రి
- మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

వరంగల్ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ సబ్‌డివిజన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఓ బాలుడి కిడ్నాప్ కలకలం సృష్టించింది. మిల్స్‌కాలనీ ఎస్సై శ్రావణ్ కథనం ప్రకారం.. ఉర్సు గుట్ట సమీపంలోని గ్రౌండ్‌లో ఆడుకుంటున్న నలుగురు బాలురులను వారి ఇంటిపక్కనే ఉండే యువకుడు కారులోకి ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లాక ముగ్గురిని కారులో నుంచి దింపి ఒక్క బాలుడిని మాత్రమే తన వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో బాలుడి నోటికి కర్చీఫ్ పెట్టి కిడ్నాప్ చేస్తున్నట్లుగా బాలుడిని బెదిరించి అక్కడే కారు నుంచి దింపాడు. ఆపై వెంటనే బాలుడి తండ్రికి యువకుడు ఫోన్‌చేసి జరిగిన విషయం చెప్పాడు. అయితే స్థానికుల ద్వారా కిడ్నాప్ విషయం తెలుసుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకొని బాలుడిని ప్రశ్నించారు. ఓ వ్యక్తి కారులో ఎక్కించుకొని ఇంజక్షన్ ఇచ్చి కిడ్నాప్ చేస్తున్నట్లుగా బెదిరించాడని బాలుడు తెలిపాడు. దీంతో పోలీసులు బాలుడిని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించగా ఎలాంటి ఇంజక్షన్ ఇవ్వలేదని తేలింది.

బాలుడి తండ్రిని ఆరా తీయగా.. బాలుడు నిత్యం బయట కనపడుతున్నాడని తనకు తెలిసిన యువకుడే బెదిరించడానికి తీసుకెళ్లాడని చెప్పాడు. బాలుడిని కారు ఎక్కించుకున్న విషయం తనకు యువకుడు ఫోన్ చేసి చెప్పాడని తెలిపాడు. కాగా, కిడ్నాప్‌పై దర్యాప్తు జరుగుతోందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

‘ప్రజా సమస్యలు మరిచిన పాలకులు’

తొర్రూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికి వదిలేసి పట్టించుకోవడంలేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డొనక దర్గయ్య అన్నారు. తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని కోరుతూ గత 6నెలలుగా దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం అర్హులైన లబ్ధిదారులకు మద్దతుగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నిర్మించి ఉన్న ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని దీక్షలు చేపడుతున్నా సర్వే చేపట్టి పంపిణీ చేయకుండా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అర్హులకు వెంటనే ఇళ్ల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, యాకయ్య, శ్రీను, పుష్ప, దస్తగిరి, ధర్మయ్య, భవాని, మంజుల ఉన్నారు.

ఎన్ఐటీలో ఉచిత ‘గేట్’ కోచింగ్

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రవేశపెట్టిన ఉచిత గేట్ కోచింగ్ క్లాసులను ఇప్పుడు అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. అన్నివర్గాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నిట్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీలతో పాటు జనరల్, ఓబీసీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులతో పా టు వరంగల్ నిట్, వరంగల్ పరిసర ప్రాంతాల ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు. ఈ కోచింగ్‌ను అన్ని ఇంజనీరింగ్ విభాగాలను కవర్ చేస్తూ ఈ నెల 17 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 9 వరకు 8 వారాల పాటు కొనసాగుతుంది. గేట్ పరీక్షకు సన్నద్ధం అవుతున్న ప్రతీ విద్యార్థికి సమాన అవకాశం, తగిన మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశంతో నిట్ ఈ అవకాశాన్ని కల్పించింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు సూచించిన మార్గదర్శకాల ప్రకారం నమోదు చేసుకొని తరగతులకు హాజరుకావచ్చు. దరఖాస్తు ఫారం, నిబంధనలు, ఇతర వివరాలు ఎన్ఐటీ వరంగల్ వెబ్‌సైట్‌లోని నోటిఫికేషన్ల విభాగంలో అందుబాటులో ఉంది.

మహిళను మోసం చేసిన యువకుడి అరెస్టు

వరంగల్ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళను పెళ్లి పేరుతో లోబర్చుకొని మోసం చేసిన యువకుడిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ.. ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తూ హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటోంది. హసన్‌పర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మేకల అభినేష్ అనే యువకుడు సదరు ఒంటరి మహిళ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో వివాహం చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. ఆ మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకరాగానే మహిళను తీవ్రంగా కొడుతూ బెదిరించడంతో హనుమకొండ పోలీసులను ఆశ్రయించింది. దీంతో యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా పలువురు మహిళలతో వివాహేతర సంబంధం ఉన్నట్లుగా తెలిసింది. బాధిత మహిళలతో సన్నిహితంగా ఉన్న వీడియోలు, ఫొటోలు యువకుడి సెల్‌లో లభ్యమైనట్లుగా తెలుస్తోంది. కాగా, ఇదే యువకుడు తన స్వగ్రామంలో ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేయగా, గ్రామస్తులు తరిమేసినట్లుగా సమాచారం.

ద్విచక్ర వాహనం, ఆటో ఢీ

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


రోదిస్తున్న మృతుడి బంధువులు

మరిపెడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఆటో ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలకు గురైన సంఘటన ఆదివారం రాత్రి బుర్హాన్‌పురం పల్లె ప్రకృతి వనం వద్ద ఎన్‌హెచ్‌ఏ 365పై చోటు చేసుకొంది. మరిపెడ ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆర్వపల్లి మండలం ఇటిక్యాలపల్లికి చెందిన శివరాత్రి చందు(30) అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం జిల్లా సిరిమోరికి చెందిన బత్తుల రాము, బుర్హాన్‌పురానికి చెందిన బండారి లింగమ్మ రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. బుర్హాన్‌పురంలోని వడ్డెర కాలనీలో పండుగ వేడుకలు జరుగగా చందు, బత్తుల రాము, బండారి లింగమ్మ అక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా బైక్ ఆటో ఢీకొని ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ వెనుక కూర్చొన్న చందు మృతి చెందగా, బైక్ నడుపుతున్న రాము రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆటోలో ప్రయాణిస్తున్న బండారి లింగమ్మకు సైతం రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితికి చేరుకుంది. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స కోసం ఖమ్మం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు పేర్కొన్నారు.

రెజోనెన్స్ పోటీ పరీక్షలకు అనూహ్యస్పందన


రెజోనెన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

హనుమకొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెజోనెన్స్ జూనియర్ కళాశాలలో ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ కాలేజీలో ప్రవేశం పొందాలనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం పోటీ పరీక్ష నిర్వహించినట్లు రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 100 శాతం ఫీజు రాయితీ లభిస్తుందని తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీలు, ఎన్ఐటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి వందలాదిమంది విద్యార్థులు ఉచితంగా సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏవో లెక్కల రమ్యరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో వీడియో కెమెరామన్, ఫొటోగ్రాఫర్‌గా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణ సాధించిన వారు అర్హులని, ఆసక్తి, అర్హత గల వారు వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి రూ. 27,130 వేతనం లభిస్తుందని పేర్కొన్నారు.

చిట్‌ఫండ్ యజమానిపై కేసు

కాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండకు చెందిన ఓ చిట్ వ్యాపారిపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కుమార్‌పల్లికి చెందిన గుండ్ల శ్రవణ్ కుమార్ అనే వ్యక్తి నగరంలో సుమారు 30మంది వ్యాపారుల వద్ద చిట్‌ల పేరుతో రూ.30లక్షలు వసూలు చేశాడు. నెల రోజులుగా కనిపించకుండా పోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో బాధితుడు బి. రమేశ్ ఆదివారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నవీన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని

సెల్ టవర్ ఎక్కిన భర్త


టవర్ ఎక్కిన లోకేందర్‌ను కిందకు దించిన పోలీసులు

కురవి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని భర్త శెట్టి లోకేందర్ సెల్ టవర్ ఎక్కి ఆదివారం ఆందోళన చేపట్టాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు గ్రామానికి చెందిన పుష్పతో పెరుమాండ్ల సంకీసకు చెందిన లోకేందర్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. ఇటీవల మరోమారు గొడవజరుగగా భార్య పుష్ప తన పుట్టింకి వెళ్లింది. దీంతో రాజోలులో సెల్ టవర్ ఎక్కి, తన భార్య కాపురానికి రావాలంటూ నినాదాలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లోకేందర్‌ను సెల్ టవర్ దింపి కురవి పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

మామ మిర్చితోటను ధ్వంసం చేసిన అల్లుడు

డోర్నకల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పంపడంలేదని కోపోద్రిక్తుడైన అల్లుడు మామకు చెందిన మిర్చితోటను ధ్వంసం చేశాడు. డోర్నకల్ ఎస్సై ఖాదర్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం ఫకీరాతండాకు చెందిన బానోత్ వెంకన్న తన కూతురు సునీతను కొన్నేళ్ల క్రితం మహబూబాబాద్ మండలం ఏటిగడ్డతండాకు చెందిన గుగులోతు రవికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఈనెల 2న ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో సునీత పుట్టింటికి వచ్చింది. 4న రవి తన భార్యను తీసుకువెళ్లేందుకు అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో మామ, అల్లుడి మధ్య వాగ్వావాదం జరగడంతో కోపోద్రికుడైన అల్లుడు అదే రోజు తన మామసాగు చేసిన 10 గుంటల మిర్చి తోటను ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు వెంకన్న ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


గోదావరి వద్ద భక్తుల రద్దీ

మహదేవపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఆదివారం సందడి నెలకొంది. కార్తీక మాసంతోపాటు వారాంత సెలవు ఉండటంతో భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే చేరుకొని ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకునానరు. బిల్వ పత్రాలతో పూజలు చేసిన అనంతరం తులసి చెట్టు వద్ద లక్ష దీపాలు అలంకరించారు. శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ఆదిలాబాద్ జడ్జి కె.ప్రభాకర్‌రావు, టాలీవుడ్ నటుడు మధునందన్ వేర్వేరుగా దర్శించుకున్నారు. జడ్జి ప్రభాకర్‌రావుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికరు. అనతరం స్వామి వారి తీర్థప్రసాదాలతో సత్కరించారు.



ఆదిలాబాద్ జడ్జిని సన్మానిస్తున్న అర్చకులు


కాళేశ్వరాలయంలో పూజలకు హాజరైన భక్తులు

టీఆర్‌పీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

కృష్ణకాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)ని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులు రవి పటేల్ అన్నారు. భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కష్టపడే వారికి తప్పకగుర్తింపు ఉంటుందని, క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి సునీల్, ఇనుగాల ప్రణయ్, గుండు కరుణాకర్, సామల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో భక్తుల సందడి

వెంకటాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం వారాంత సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ముందుగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీశ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా పర్యాటకులు ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ఉల్లాసంగా గడిపారు. అదేవిధంగా రామప్ప దేవాలయాన్ని అమెరికా దేశానికి చెందిన ప్రీస్టన్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయ కొట్టారు.


రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

కులాంతర వివాహాలకు ప్రోత్సాహమేది?

- ఎస్సీలను పెళ్లి చేసుకున్నవారికి అందని ఆర్థిక సాయం
- జిల్లాలో 160 జంటల ఎదురుచూపులు
- ఐదేళ్లలో ఇచ్చింది కేవలం 40 మందికే..

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందజేస్తోంది. ఎస్సీలను వివాహం చేసుకున్న ఇతర సామాజిక వర్గాలవారు దీనికి అర్హులు. అలాంటి జంటలకు ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను సమకూరుస్తున్నాయి. గతంలో సాయం అంతంత మాత్రమే ఉండేది. 2019 సంవత్సరంలో ఆ మొత్తాన్ని ఏకంగా ఐదు రేట్లు పెంచారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం మంజూరులో జాప్యం జరుగుతూనే ఉంది.



పెళ్లికి మాత్రమే వివాహ ప్రోత్సాహం అందుతుంది. వివాహం అయిన సంవత్సరంలోపే జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వధువు, వరుడికి సంబంధించిన కుల, నివాస ధ్రువపత్రాలను తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ వివరాలు తెలిపే ధ్రువపత్రాలను సైతం దరఖాస్తుతో జత చేయాలి. ఇద్దరి ఆధార్‌కార్డులు, రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి తీసుకున్న వివాహ ధ్రువీకరణ పత్రం తప్పకుండా జతచేయాలి. వరుడు, వధువుకు సంబంధించి జాయింట్ బ్యాంకు అకౌంట్, వివాహానికి సంబంధించిన ఫొటోలతో సాయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రూ. 2.50 లక్షల ఆర్థికసాయం

కులాంతర వివాహాలు చేసుకున్న వారికి 1980 సంవత్సరం నుంచి ప్రోత్సాహక సాయాన్ని అందిస్తున్నారు. మొదట రూ. 3వేలు మాత్రమే ఇచ్చేవారు. 1993 నుంచి రూ.10 వేలు అందజేశారు. 2011లో రూ.50 వేలకు పెంచి అమలు చేస్తున్నారు. 2019 నవంబరులో విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం రూ. 2 లక్షల 50 వేలు అందిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఏ ఇతర సామాజిక వర్గానికి చెందిన వారిని వివాహం చేసుకున్నా కులాంతర వివాహ ప్రోత్సాహక పథకం వర్తిస్తుంది.

ఐదేళ్లలో వచ్చిన దరఖాస్తులు 200

గత ఐదు సంవత్సరాల్లో 200 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 40 మందికి మాత్రమే మంజూరు చేయగా, 160 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కులాంతర వివాహాలు చేసుకున్న పలువురు ఎదురు చూడాల్సి వస్తోంది.

దరఖాస్తు విధానం

దంపతుల్లో ఒకరు తప్పనిసరిగా షెడ్యూల్ కులానికి చెందిన వారు, మరొకరు ఇతర కులానికి చెందిన వారై ఉండాలి. మొదటి

త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉంది..



కులాంతర వివాహాలకు సంబంధించిన నిధులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరు అయిన వెంటనే లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటాం. అర్హులైన వారికి సాయం తప్పనిసరిగా అందుతుంది. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

భాగ్యలక్ష్మి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి వరంగల్ జిల్లా అధికారి

గుడ్‌విల్ కావాలా నాయనా..!

(5వ పేజీ తరువాయి)

షాపును కొట్టేసే ప్రయత్నంలో చక్రం తిప్పుతున్నారు.

గుడ్‌విల్‌తో జాక్‌పాట్

డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభించాల్సి ఉంది. ప్రతీ షాపునకు 1/6శాతం అంటే.. రూ.9,16,667లు ఎక్సైజ్ శాఖకు తొలి విడత పన్ను చెల్లించాల్సి ఉంది. దీంతో పాటు లిక్కర్ కోసం మరో రూ.10లక్షల వరకు పెట్టుబడితోపాటు షాపు కోసం రూములు, సిబ్బంది నియామకం, తదితర వాటికి ఒక్కో షాపునకు సుమారు రూ.25లక్షల నుంచి రూ.40లక్షల వరకు మళ్లీ పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టేందుకు షాపులు దక్కించుకున్నవారు వెనుకాడుతుండటం లిక్కర్‌రంగంలో డాన్‌లుగా నిలిచినవారికి కలిసివస్తోంది. అలాగే జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో మద్యంషాపు ఉండాలనే నిబంధన ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో షాపులు నిర్వహిస్తున్న వారు.. కొత్తగా షాపులు దక్కించుకున్నవారికి అడ్డాను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో కొత్తగా షాపు ఏర్పాటు చేసేందుకు అవకాశం లేకపోవటంతో గుడ్‌విల్ కింద షాపును ఇవ్వటమో.. లేక కొంత షేర్ ఇచ్చి కలుపుకపోవటమో చేయాల్సి వస్తుందని నయా లిక్కర్ వ్యాపారులు పేర్కొంటున్నారు.

భారీ మొత్తంలో..

ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ షాపునకు గుడ్‌విల్ కింద రూ.80లక్షలు చెల్లించినట్లుగా సమాచారం. వరంగల్ నగరంలో రూ.70లక్షలు, జనగామలో రూ.1.20కోట్లు, ఏటూరునాగరంలో రూ.1.50కోట్ల వరకు గుడ్‌విల్ ఆఫర్ల జోరు సాగుతోంది. దీంతో పెట్టుబడి పెట్టింది రూ.3లక్షలు.. వచ్చేది కోటి రూపాయలు కావటంతో గుడ్‌విల్‌కు కొందరు సై అంటున్నారు. రూ.3లక్షల పెట్టుబడితో అదృష్టవంతులు జాక్‌పాట్ కొట్టేస్తున్నారనే చర్చ నడుస్తోంది. అయితే జిల్లా కేంద్రంలోని షాపులకంటే మండల కేంద్రాల్లో ఉండే గ్రామీణ మద్యం షాపులకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. కొన్నిచోట్ల లిక్కర్ షాపుల ఏర్పాటుకు అడ్డాలు దొరకకపోగా, ప్రస్తుతం నిర్వహిస్తున్న షాపులను కొత్తవారికి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక గుడ్‌విల్‌కు మొగ్గుచూపుతున్నారు.



'ఓరుగల్లు ప్రముఖులు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్ఎస్ఆర్ ప్రసాద్, పొట్లపల్లి తదితరులు

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ఓరుగల్లు చరితం

ప్రముఖ కవి లంకా శివరామ ప్రసాద్

హనుమకొండ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు గడ్డ మహా కవి పోతన, ప్రజా కవి కాళోజీ వంటి సాహితీమూర్తుల స్పర్శతో, రాణిరుద్రమ వీరధారలతో, కాకతీయుల దార్శనికతతో, జయాపసేనాని పేరిణి ప్రభలతో పులకితమైన వీర చరిత భూమి అని ప్రముఖ కవి, విభిన్న భాషల బహు గ్రంథకర్త డాక్టర్ లంకా శివరామ ప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి హనుమకొండ భీమారంలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'కవిత్వంతో కలుద్దాం' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెరసం అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'ఓరుగల్లు ప్రముఖులు' పేరిట గ్రంథాన్ని కూడా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎల్ఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు విభిన్న రంగాల్లో అవసరమైన స్ఫూర్తినిచ్చిన చరితం ఓరుగల్లుదేనని అన్నారు. పరిశోధకులు యావత్ ఓరుగల్లు, కాకతీయుల చరితాన్ని పరిశోధించినా కొద్ది కొత్త విషయాలను ఆవిష్కృతం అవుతాయన్నారు. పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కవిత్వం సమాజ చైతన్యానికి దోహదకారి అని, మనిషి కేంద్రంగా రచన చేయడం ఆ దిశగా స్పందించడం మానవ జీవన వికాసానికి నిర్మాణాత్మక కృషి చేయడం ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. ఆది కవులుగా వర్తమాన భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప సహకారమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాళోజీ పురస్కార గ్రహీత నెల్లుట్ల రమాదేవి, యువ కవులు, కాళోజీ రచనలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలంటూ 'చావుకు కళ లేదు' కవితను వినిపించారు. తెరస రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణపురం దేవేందర్, రాజుల ఆస్థానాలపై కవిత వినిపించారు. బాలబోయిన రమాదేవి బతుకుబాట పేరిట, మాదారపు వాణిశ్రీ మరో కవిత్వంతో కలుద్దాం, కాంచనపల్లి అనంతవాణి సిరా ఇంకిన కళ, నాగబెల్లి జితేందర్ ఐదు వేళ్ల ఒక్కటైతే, ఎడవెల్లి రాములు హృదయ స్పర్శ, రామబ్రహ్మచారి ప్రకృతిమాత రోదనపై, కామిడి గోవర్ధన్‌రెడ్డి, మైన ఎర్రన్నలు అద్భుతమైన పాటలతో ఇంకా మిట్టపరం శ్రీమన్నారాయణ, రాజబాబు, వీరభద్రరావు, శ్రీనివాస్ తదితరులు తమ కవిత్వాన్ని వినిపించారు. ఈ సందర్భంగా నెల్లుట్ల రమాదేవి, గణపురం దేవేందర్, లంకా శివరామ ప్రసాద్, నాగబెల్లి జితేందర్‌లను తెరసం పక్షాన సత్కరించారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- చోరీలు, అత్యాచారాలు పెరిగాయి..
- ఇంత జరిగినా ప్రభుత్వం స్పందించడం లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హనుమకొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో దొంగతనాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం హనుమకొండలోని ఏకశిల పార్కులో జయశంకర్ విగ్రహానికి, నక్కలగుట్టలో కాళోజీ నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు హాల్‌లో మేధావులు, జాగృతి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. గురుకులాల్లో చదువుతున్న వందలాదిమంది విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై దృష్టిసారించకపోవడంతో పేదప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రజల తరఫున ప్రశ్నించేందుకే జాగృతి జనం బాట కార్యక్రమం ద్వారా జిల్లాల పర్యటన చేస్తున్నామని కవిత తెలిపారు. రాజకీయాలు ఎన్నికలప్పుడే చేయాలని, మిగతా నాలుగేళ్లు అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. జాగృతి అంటేనే మేల్కొల్పడం, ప్రశ్నించడం అని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొన్ని మంచి పనులు జరిగాయని, ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో జాగృతిలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.



జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కల్వకుంట్ల కవిత

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

పోచమ్మ మైదాన్ (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎస్ఆర్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రాని బాధితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎస్ఆర్‌నగర్‌లో మొత్తం వేయి కుటుంబాల వరకు నివసిస్తుండగా గతంలో 150 ఇళ్లను కూల్చివేసి కొత్తగా 750 ఇళ్లు నిర్మించారని, ఇంత మంది నివాసం ఉంటున్నా ఇప్పటివరకు వారికి పట్టాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాలనీలో విద్యుత్, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కలెక్టర్, మునిసిపల్ అధికారులు కాలనీని సందర్శించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇతర పార్టీలకు ఓటు వేశారని ఈ కాలనీ ప్రజల వైపు చూడకపోవడం శోచనీయమని, ఓట్లు వేసినా వేయకపోయినా ప్రజాప్రతినిధులుగా కాలనీని సందర్శించి వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉంటుందని హితవుపలికారు. కాలనీ సమస్యలను పరిష్కరించే వరకు ప్రజల పక్షాన జాగృతి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేయకుండా వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం ఆమె జానపద కళాకారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో లక్షా 50వేల మంది కళాకారులు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. ఇక్కడి ప్రభుత్వం 500 మందికి పెన్షన్ ఇస్తే కేంద్రం 5500 మందికి పెన్షన్ ఇస్తుందని, ఆ అవకాశం ఉన్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని అన్నారు. జానపద అకాడమిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలు వచ్చే వరకు జాగృతి పోరాటం చేస్తుందని కవిత స్పష్టం చేశారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కవిత



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ముగిసిన సర్జన్ల సదస్సు

వరంగల్ మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో నిర్వహించిన సర్జన్ల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్జన్ల సదస్సు విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, కాకతీయ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగాలు సంయుక్తగా నిర్వహించిన సదస్సులో డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ జీవన్‌రావు, డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ బి.ఆర్.సిద్ధార్థ తదితర వైద్యులు పాల్గొన్నారు.

కేయూ ఏఆర్‌ల పదోన్నతిలో మీనమేషాలు

ఉద్యోగ సంఘాల విన్నపాలు పట్టించుకుని అధికారులు

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ల పదోన్నతిలో వర్సిటీ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్లకు ప్రమోషన్లు కల్పించిన అధికారులు.. అసిస్టెంట్ రిజిస్ట్రార్ల ప్రమోషన్లలో జాప్యం చేయడం పట్ల వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా డిప్యూటీ రిజిస్ట్రార్ల ప్రమోషన్లను పెండింగ్‌లో పెట్టి ఇటీవల వారికీ ప్రమోషన్ల కల్పించినప్పటికీ ఏఆర్‌ల ప్రమోషన్లను ఇవ్వడలో వర్సిటీ అధికారులు జాప్యంచేయడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో డిప్యూటీ రిజిస్ట్రార్లుగా నలుగురికి ప్రమోషన్లు కల్పించి ఏఆర్‌కు పదోన్నతి ఇవ్వడంలో జాప్యం చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేయూలో కొన్నేళ్లుగా 1 పోస్టు ఖాళీగా ఉండగా, జూలై మాసంలో మరొక ఏఆర్ పోస్టు ఖాళీ అయింది. దీంతోపాటు ఇటీవల నలుగురి ఏఆర్‌ల నుంచి డీఆర్ పోస్టుల పదోన్నతి కల్పించారు. ఇవన్నీ కలిపి మొత్తంగా వర్సిటీ 6 పోస్టులు ఏఆర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఆయా పోస్టుల కోసం అర్హులైన 20 సూపరింటెండెంట్లు దీర్ఘకాలికంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే వారిలో 15మంది వరకు సూపరింటెండెంట్లుగా 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఏఆర్ ప్రమోషన్ల కోసం వెయిటింగ్‌లో ఉన్నారు.

ఇదిలా ఉండగా, అర్హులైన ఏఆర్‌ల ప్రమోషన్ల సీనియారిటీ లిస్టును ప్రకటించడంలో వర్సిటీ ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారు. డీఆర్‌లకు ప్రమోషన్లు ఇచ్చి 3 నెలలు గడుస్తున్నా ఏఆర్‌ల ప్రమోషన్లకు సీనియార్టీ లిస్టును ప్రకటించకపోవడం పట్ల అర్హులైన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారికి ప్రమోషన్లు ఇచ్చి మాకు ఎందుకు ఇవ్వడం లేదని అనేకమార్లు వర్సిటీ ఉన్నతాధికారులు విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా తమ విన్నపాలను బుట్టదాఖలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. ఏఆర్‌ల పదోన్నతి కల్పించకపోవడంతో వర్సిటీ పరిపాలన కుంటుపడుతోంది. ఏఆర్‌లు చేయాల్సిన పనులన్ని సూపరింటెండెంట్లతో నెట్టుకువస్తున్నారు. అర్హులై ఉన్నా తమకు ప్రమోషన్లు కల్పించడంతో సూపరింటెండెంట్లుగానే ఉద్యోగ విరమణ పొందే పరిస్థితి దాపురించిందని ఆందోళన పడుతున్నారు. కాగా, ఏఆర్‌ల ప్రమోషన్లు కల్పించాలని గతంలో ఉద్యోగ సంఘాల నేతలు కేయూ రిజిస్ట్రార్ రామచంద్రంను కలిసి విన్నవించారు. ఇదిగో.. అదిగో.. అనడం తప్ప ప్రమోషన్లు కల్పించడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా అర్హులకు డీఆర్ ప్రమోషన్లు ఇచ్చినట్లుగా ఏఆర్ ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు (ఫైల్)

కాంగ్రెస్ ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలు సైతం రైతుల సమస్యలను గాలికి వదిలి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో అనుకున్న రీతిలో ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రమే కాని ప్రజల వద్ద డబ్బులు లేవని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధిపనులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులను ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. సమ్మక్క- సారలమ్మలుగా జిల్లాలో విరాజిల్లుతున్న మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖలు వరంగల్ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ మార్గదర్శిగా నిలిచారని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి, ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్, జిల్లా నాయకులు బానోత్ వెంకన్న నాయక్, పర్లపెల్లి శ్రీశైలం, మేకల రాణి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితమై రాజ్యాధికారం సాధించాలి

ఘనంగా పద్మశాలీ కులస్తుల కార్తీక వన భోజనాలు



కార్తీక వనభోజనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

హసన్‌పర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కులస్తులు సంఘటితమై రాజ్యాధికారం సాధించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పద్మశాలీ కులస్తులు కార్తీక మాస వన భోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్కండేయుడి, శివలింగానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ.. డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీని వరంగల్‌లో ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని పూర్తిగా ఎత్తివేసి పద్మశాలీ కార్మికులకు తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం పద్మశాలీ కులసంఘం నాయకులు ఈగ మల్లేశంను శాలువా కప్పి మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ నాయకులు బచ్చు ఆనందం, గడ్డం భాస్కర్, వైద్యం రాజగోపాల్, బత్తుల రమేష్ బాబు, వద్నాల నరేందర్, కుసుమ సతీష్, గోరంట్ల రాజు, కుసుమ శ్యామ్, చిలగాని మోహన్, గుండు సదానందం, బేతి అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో పద్మశాలీ కులస్తులు పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ హీరో రాజ్‌తరుణ్ తదితరులు

అమ్మవారి దర్శనం.. ఆనంద దాయకం

- సినీ హీరో రాజ్‌తరుణ్

వరంగల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ రాజుల ఆరాధ్యదైవం అయిన భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సినీ హీరో రాజ్‌తరుణ్ అన్నారు. ఆదివారం ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ప్రధానార్చకులు భద్రకాళి శేషు అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు తోపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణ, ఆలయ సిబ్బంది క్రాంతి కుమార్, కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభయారణ్యంలో అరుదైన సీతాకోక చిలుకలు

- నూతన జాతులను గుర్తించిన వైల్డ్ లైఫ్ సంస్థ
- సర్వేలో పాల్గొన్న 60 మంది పరిశోధకులు

ములుగు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అభయారణ్యంలో 80 రకాల అరుదైన సీతాకోక చిలుకల జాతులను ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అనే సంస్థ గుర్తించింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పరిశోధన చేసింది. లక్నవరం, తాడ్వాయి, పస్రా అడవుల్లో పర్యటించిన పరిశోధకులు సీతాకోకచిలుకల కొత్త జాతులను గుర్తించారు. ఈ మేరకు ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు ఆదివారం వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా పరిశోధకులు, ఫొటోగ్రాఫర్లు, పర్యావరణవేత్తలు చేసిన సర్వే ద్వారా ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయని అన్నారు. తెలంగాణలో 150కి పైగా సీతాకోకచిలుకల జాతులు ఉన్నాయన్నారు. కొత్తగా 80 కొత్త జాతులను గుర్తించినట్టు పేర్కొన్నారు.


అటవీ శాఖ జిల్లా అధికారి రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ.. సీతాకోకచిలుకలు పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తుంటాయన్నారు. పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సర్వేలు నిర్వహించి వాటి మనుగడను కాపాడటంతో దోహదపడుతున్నారని వివరించారు. ఈ సర్వేలో వైల్డ్ లైఫ్ సొసైటీ కార్యదర్శి చెలుకూరి శ్యాంసుందర్, జాయింట్ సెక్రటరీ రవి బాబు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న పరిశోధకులు, ఫొటోగ్రాఫర్లు



కొత్త జాతి సీతాకోక చిలుక



సీతాకోక చిలుక లార్వా



కారు డ్రైవర్ల యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా యాకూబ్



పల్లెర్ల యాకూబ్

వడ్డెపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓన్ ప్లేట్ కారు డ్రైవర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా సర్వ సభ్య సమావేశం ఆదివారం హనుమకొండలోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెర్ల యాకూబ్, గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా అమరగంటి గణేష్, కోశాధికారిగా కుర్రి రాజేష్ (ప్రవీణ్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పోరెళ్ల అశోక్, చొప్పదండి రంజిత్, సంయుక్త కార్యదర్శిగా పెంట రాజు, గౌరవ సలహాదారులుగా ఎ.రాజేందర్, ముఖ్య సలహాదారులుగా అబ్బోజు ప్రవీణ్, చుక్క కృష్ణ, సెక్రటరీలుగా కొట్టెపాక ప్రవీన్, పాలికోజు నిరంజన్, కార్యవర్గ సభ్యులుగా గుమ్మడి శ్రీకాంత్, నైనాల నవీన్, ఉపసి నరేష్, కొలిపాక హరీష్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

జానపద కళాకారులకు అండగా జాగృతి

» ప్రభుత్వం జానపద అకాడమీని ఏర్పాటు చేయాలి
» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

మట్టెవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కళాకారులకు తెలంగాణ జాగృతి అండగా ఉంటుందని సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం కాశిబుగ్గలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కళాకారులు డప్పు చప్పుళ్లతో కోలాటం ఆడుతూ.. కవితకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. తెలంగాణ అంటేనే ఆట..పాట అని, కళాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం అంటే తెలియని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం వల్ల కళాకారులను ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కళాకారులకు జాగృతి తరుపున గుర్తింపుకార్డులను ఇస్తున్నామన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేయాలని అన్నారు.

అనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంబాల పక్షాన పూలమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అటు బీఆర్ఎస్ పాలనలో, ఇటు కాంగ్రెస్ పాలనలో అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు తమ ఆటపాటలతో అందరినీ ఉర్రూతలూగించారు. అనంతరం వరంగల్ ఎస్ఆర్ నగర్‌లో కవిత పర్యటించారు. కార్యక్రమంలో మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు నూకల రాణి, కళాకా రుల సంఘం నుంచి ఇటికాల బాబురావు, సాంబలక్ష్మి, లింగాబాయి, మురళీ దేశ్‌ముఖ్‌పాండే, గువ్వా లక్ష్మి, సంకినేని సుహాసిని, జంగిరి హేమలత, ఆటో కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె. సంతోష్ పాల్గొన్నారు.



జానపద కళాకారులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న కవిత

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కవిత

వరంగల్ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): నగరంలోని భద్రకాళి అమ్మవారిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ముందు వల్లభ గణపతిని, తర్వాత భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా చారిత్రక భద్రకాళి అమ్మవారిని ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఆదివారం రాత్రి అమ్మవారిని దర్శించుకున్నారు.

పాములపర్తి రామారావును కలిసిన కవిత

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి జనం బాట రెండోరోజు పర్యటనలో ఆదివారం వరంగల్‌లోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాములపర్తి రామారావును తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామారావు కవితను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. సమాజం అభివృద్ధి చెందాలంటే ఆరోగ్యం, విద్య అవగాహన కీలకమని, డాక్టర్ రామారావు వంటి వైద్యులు ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రేరణాత్మకమైనవని పేర్కొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

వరంగల్ చౌరస్తా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏవీవీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఎస్. సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా వి. సురేష్, కోశాధికారిగా సీహెచ్.రమేష్, సహ అధ్యక్షులుగా జి. కొమురయ్యతో పాటు 17 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణాధికారులుగా రాష్ట్ర పరిశీలకులు కుందూరు గోపాల్‌రెడ్డి, తిరువరంగం ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి టి. ప్రభాకర్ పాల్గొన్నారు.

'మతోన్మాదులకు జేఎన్‌యూ ఎన్నికలు చెంపపెట్టు'

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదులకు ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ ఎన్నికలు చెంపపెట్టుగా నిలుస్తాయని కేయూ స్కాలర్ డి.తిరుపతి చెప్పారు. ఆదివారం ఢిల్లీ జేఎన్‌యూ వర్సిటీలో వామపక్ష విద్యార్థి సంఘాలు విజయం సాధించడం పట్ల ఆదివారం కేయూలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతృత్వంలో మిఠాయిలు పంచి సంబురాలు చేశారు. కేయూ మొదటి గేటు వద్ద జరిగిన సంబురాలను పురస్కరించుకుని స్కాలర్స్ బాణాసంచాలు కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబురాలు చేశారు. ఈ సందర్భంగా కేయూ స్కాలర్స్ డి.తిరుపతి మాట్లాడుతూ.. ఢిల్లీలో జేఎన్‌యూలో వామపక్ష విద్యార్థి సంఘాలు గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విద్యలో మతోన్మాద విధానాలను అవలంబిస్తూ విద్యను కాషాయికరణ చేస్తోందని మండిపడ్డారు. వామపక్ష విద్యార్థులందరూ ఐక్యంగా మతోన్మాద కూటమిని ఓడించడం గర్హనీయమని అన్నారు. భవిష్యత్తు వామపక్షాలదేన్నారు. యువత సోషలిజాన్ని స్వాగతిస్తున్నారని చెప్పారు. మత, కుల సంఘాల పేరుతో వేర్పాటు వాదులకు చోటు లేదన్నారు. భవిష్యత్‌లో జేఎన్‌యూ ఢిల్లీ తీర్పు మతోన్మాదులకు చెంపపెట్టుగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ కందికొండ తిరుపతి, కేతపాక ప్రసాద్, బొస్క నాగరాజు, జనగాం రాజారాం, దూడపాక అశోక్, జి.చంద్ర, పృథ్వీరాజ్, దామోదర్‌లు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలపై ఏబీఎస్ఎఫ్ పోరాటం'

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ఏబీఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు చేస్తోందని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు. ఆదివారం కేయూ మొదటిగేటు వద్ద ఏబీఎస్ఎఫ్ 22వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. 2004 నవంబరు 9న విద్య, ఐక్యత, పోరాటం నినాదంతో ఏబీఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. బుద్ధుడు, అంబేద్కర్, కాన్షీరాం, జ్యోతిరావుఫూలేల రాజ్యాధికార లక్ష్యంతో ముందుకు సాగుతామన్నారు. ఏబీఎస్ఎఫ్‌ను బండి భిక్షపతి స్థాపించారన్నారు. విద్య, సామాజిక సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏబీఎస్ఎఫ్.. వరంగల్ గడ్డమీద ఏర్పడిందన్నారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించామన్నారు. ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ సభను త్వరలోనే ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎప్ఎఫ్ నాయకులు విజయ్, నందు, ఉదయ్, భరత్, పీటర్, అభి, శ్రీకాంత్ సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



ఎన్నికైన గాంధీ నగర్ నూతన కార్యవర్గంతో కాలనీవాసులు

వడ్డెపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా కె.నరేందర్‌రెడ్డి, ఎండీజే రెహమాన్, దినేష్‌రెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా చెరుకు వెంకటరాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఈవీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పాలవలస వెంకటరమణ, ఆర్థిక కార్యదర్శిగా మాడిశెట్టి వీరేందర్, ముఖ్య సలహాదారులుగా ఏవీ నర్సింహారావు ఎన్నికయ్యారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహబూబియా పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మట్టెవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జేపీఎన్ రోడ్‌లోని మహబూబియా ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గం కార్యదర్శి కె.విజయభాస్కర్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి క్షమాదేశ్ పాండే

కాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా 1098, 100 నంబర్‌కు కాల్‌చేసి సమస్యలు విన్నవించి న్యాయం పొందాలని, ఇవే కాకుండా పిల్లలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి క్షమా దేశ్ పాండే అన్నారు. కాజీపేట టీటీడీ బధిరుల పాఠశాలలో లీగల్ సర్వీస్‌డే కార్యక్రమం ఆదివారం జరిగింది. అనురాగ్ సొసైటీ చైర్మన్ అనితారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జి క్షమాదేశ్ పాండే, అనితారెడ్డి, ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డిలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జేజే చట్టం, లీగల్ సర్వీసెస్ సెల్, చైల్డ్ లైన్, పోలీస్ విభాగాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు బానిసై మత్తు పదార్థాలకు ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వీటి బారిన పడొద్దని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణం, వంటశాల, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డీసీపీయూ ప్రవీణ్, ఫ్యాకల్టీ యాకయ్య, రమణతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామినేని వెంకటేశ్వర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల భత్యాలను చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా ఉండాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించి ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గణేష్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షురాలు స్నేహ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ధర్మ దీక్షకు తరలి రావాలి'

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15 వరకు కేయూ ఎస్డీఎల్‌సీఈ జ్యోతిరావు పూలే ప్రాంగణంలో నిర్వహించే బీసీ ధర్మపోరాట దీక్షలకు అందరూ తరలిరావాలని కేయూ బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కేయూ గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో నాగరాజుగౌడ్ మాట్లాడారు. బీసీల ధర్మదీక్షలు తెలంగాణ ఉద్యమ తరహాలో జరుగుతాయని చెప్పారు. తమ వాటా కోసం ఢిల్లీ నుంచ గల్లీదాకా పోరాడుతామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కావాలన్నారు. ఈ సమావేశంలో మలిదశ తెలంగాణ ఉద్యమనేతలు డాక్టర్ వంగాల సుధాకర్, కేయూ బీసీ విద్యార్థి జేఏసీ నేతలు సుమన్‌రాజ్, అజయ్ సింగ్, గణేశ్, రాజశేఖర్, అన్వేశ్, నితిన్, సాయి వరుణ్, రోహిత్, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాల ప్రవీణ్‌కు సన్మానం

కాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిట్‌లో డాక్టరేట్ పొందిన మర్యాల ప్రవీణ్‌ను కాజీపేట తేజోమయు మాలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాపూజీనగర్ వద్ద ఆదివారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, కార్యదర్శి బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రవీణ్‌కు శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రవీణ్ ఎంతో కష్టపడి నిట్ నుంచి పీహెచ్‌డీ పొందాడన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పప్పుల గోవర్ధన్, బార్ కౌన్సిల్ సభ్యుడు కొత్త రవి, కాందారి రాజమౌళి, బండి రాంచందర్, పి.శేఖర్, కె. వెంకటేశ్, బి. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలకు తరలి రండి

వరంగల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల కార్తీక వన భోజనాలను విజయవంతం చేయాలని కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం రంగంపేటలో వన భోజనాలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూపకుంటలో డ్‌లో గల మామిడితోటలో ఈ నెల 16 ఆదివారం వన భోజనాలతో పాటు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాళ్లబండి వీరాచారి, రామోజు నాగ సోమేశ్వరాచారి, వేమూరి సోమేశ్వరాచారి, వెంకన్న, పబ్బోజు రాజేష్, రాచకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వన భోజనాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పెంటర్లు

కార్తీక మాస వన భోజనాలు



మార్కండేయుడికి పూజలు చేస్తున్న పద్మశాలీ సంఘం బాధ్యులు

శంభునిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాశిబుగ్గ పద్మశాలి సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖిలావరంగల్ క్రికెట్ మైదానంలో కార్తీక మాస వన భోజనాలు, దీపారాధన కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు మార్కండేయ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ.. ప్రకృతితో మమేకమయ్యేందుకే కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సంఘ సభ్యులంతా ఐక్యతగా ఉంటూ పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. ఈ నెల 16న ఖిలా వరంగల్‌లో చేపట్టిన వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం కార్తీక వనభోజనాల కార్యక్రమానికి సభ్యులందరూ హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు గోరంట్ల మనోహర్, పోతన, లక్ష్మీనర్సయ్య, మాటేటి విద్యాసాగర్, వేముల నాగరాజు, అలువాల సదాశివుడు, కుసుమ దయాకర్, ములుక సురేష్, బండారి రాజేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, దాసి శివకృష్ణ, బేతి అశోక్, క్యాతం రంజిత్, సిందం చంద్రశేఖర్, రామ యదగిరి, గుల్లపల్లి సాంబశివుడు, చిలగాని రమేష్, కూరపాటి మహేష్, బాల మోహన్ రాజ్, గుండు సత్యనారాయణ, వెంగల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

టీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న టి. ప్రభాకర్

వడ్డెపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుండా వారి సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ స్టేట్-గౌట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్ - జీఆర్‌ఈఏ) రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని టీఎస్- జీఆర్‌ఈఏ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు ఐదు డీఏలను ఇవ్వకుండా రాష్ట్రప్రభుత్వం కాలయాపన చేస్తోందనీ దుయ్యబట్టారు. పీఆర్‌సీని ప్రకటించకుండా ప్రభుత్వం దాటవేస్తోందని ఆరోపించారు. అనంతరం టీఎస్- జీఆర్‌ఈఏ వరంగల్ జిల్లా శాఖకు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీపాద సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా వరయోగుల సురేష్, సహ అధ్యక్షుడిగా కొమురయ్య, ఉపాధ్యక్షులుగా వి.లక్ష్మీనారాయణ, మధుసూదన్, కోశాధికారిగా సీహెచ్. రమేష్‌లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరాములు, సంయుక్త కార్యదర్శులుగా కేదారి, రాంమోహనచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కుమారస్వామి, రాంభద్రయ్య, లలిత, పబ్లిసిటీ సెక్రటరీగా యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్లుగా లక్ష్మారెడ్డి, ఈశ్వరమూర్తిలను ఎన్నుకున్నారు.

శివనగర్‌లో సత్యనారాయణ వ్రతం

శంభునిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శివనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, కమిటీ బాధ్యులు సుంచు మాధవ్, దామరదద్ద ప్రభాకర్, మెరుగు అశోక్, బైరి శ్యామ్, సుంచు కేశవ్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు

మడికొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపైకార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మెట్టు రామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో రెండవ ఆదివారం ఉచిత సామూహిక మహాన్యాస రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చన, బిల్వార్చన అభిషేకాలను చేశారు. తదుపరి అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం శివ కేశవులకు వైభవంగా ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. శివాలయంలో స్వామివారికి ప్రదోషకాల రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షపూజ నీరజన మంత్ర పుష్పం నక్షత్ర హారతి, రాజోపాచార, పవళింపు సేవ కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో జరిపించారు. కార్యక్రమంలో అలయ ఈవోలు రామల సునిత, ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మల పర్యవేక్షణలో గురుజీ ప్రభాకర్, భక్తులు సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

చంద్ర పుల్లారెడ్డికి ఘననివాళి

బాలసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం సీపీఐ (ఎంఎల్) నేత, దివంగత చంద్రపుల్లారెడ్డి 41 వర్ధంతి సభ జరిగింది. రాష్ట్ర నాయకుడు కె.విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు బి.భాస్కర్, ఇతర నాయకులు చంద్రపుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మౌనం పాటించి విప్లవ జోహార్‌లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చంద్ర పుల్లారెడ్డి విద్యార్థి దశలోనే బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతో ఉద్యమాల బాట పట్టారని చెప్పారు. అనంతరం శాసన సభ్యుడిగా ఎన్నికై ప్రజాఉద్యమాలు చేశారని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలు చేసిన ఘనత చంద్ర పుల్లారెడ్డిదని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెగిలి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ నగర కార్యదర్శి నున్న అప్పారావు, భద్రాద్రి జిల్లా కారదర్శి కొమురం సత్యనారాయణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం. వెంకట్‌రెడ్డి, ఎ. సాంబ తదితరులు పాల్గొన్నారు.



హరిత హోటల్‌లో పుల్లారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పడమర కోటలో..

శంభునిపేట (ఆంధ్రజ్యోతి) : ఖిలావరంగల్‌లో కమ్యూనిస్టు నాయకులు చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి నిర్వహించారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన పడమర కోటలోని విద్యార్థి అమర వీరులస్థూపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ... సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా, గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటాన్ని నిర్మించిన నాయకుడిగా చంద్రపుల్లారెడ్డి చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. హిందూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ నాయకులు నళిగంటి విజయ్‌పాల్, బండి కుమార్, బన్న నర్సింగం, మహమ్మద్ ఖాన్, గద్దల ప్రభాకర్, గంద్రాతి హరిబాబు, మైదం సంజీవ, సుద్దాల వీరయ్య, మన్ని నారాయణ, సాంబయ్య, బండి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఓ చిన్న పిచ్చుక... చిన్నారి పిచ్చుక... రావమ్మా నీ ఇంటికి'- ఈ గీతం ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో మారుమోగుతోంది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలపించిన ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిన్నారులు, మహిళల కోసం ఈ గీతానికి రూపకల్పన చేసిన పమేలా చేపడుతున్న పలు కార్యక్రమాలు సర్వత్రా ప్రశంసలు పొందుతున్నాయి.



పాటతో మేలుకొలుపు

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలోని సునాబెడాలో పమేలా సత్పతి పుట్టి పెరిగారు. ఆమె డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధికారి ఆర్.కె.స త్పతి కుమార్తె. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసి, ఇన్ఫోసిస్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పొందిన పమేలా... ఆ తరువాత 2015లో సివిల్స్ ద్వారా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. భద్రాచలం సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అక్కడ ఆమె 19 నెలలు పని చేశాక, భద్రాచలం ఈవోగా, అనంతరం భూసేకరణ విభాగంలో విధులు నిర్వర్తించారు. 2019 డిసెంబర్‌లో వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం యాదాద్రి-భువనగిరి కలెక్టర్‌గా ఉన్నారు. 2023లో కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె భర్త దీపాంకర్ వైద్య వృత్తిలో ఉన్నారు.

సమాజంలో అవగాహన కోసం...

'సత్యమేవ జయతే' హిందీ ధారావాహికలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన 'ఓరి చిరయ్యా' అనే పాట పమేలాను ఆకట్టుకుంది. దాన్ని తెలుగులోకి అనువదిస్తే సమాజంలో అవగాహన పెరుగుతుందని ఆమె భావించారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌కు తన ఆలోచనను తెలిపారు. ఆయన 'ఓ చిన్ని పిచ్చుక... చిన్నారి పిచ్చుక' అనే శీర్షికతో ఆ పాటను తెలుగులోకి అనువదించారు. బధిర విద్యార్థుల కోరిక మేరకు పమేలా ఆ పాటను స్వయంగా పాడి వీడియో, ఆడియో ఆల్బంను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలు, అంధులు, దివ్యాంగులతో కలిసి సంతోష్, రాంబాబు అనే ఉద్యోగులు, శర్మ అనే ఉపాధ్యాయుడి సహకారంతో ఆ ఆల్బం రూపకల్పన జరిగింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో దాన్ని ఆవిష్కరించారు. సోషల్ మీడియాలో ఆ పాటకు విశేష ఆదరణ లభించింది. జిల్లా అంతటా ఆ గీతం మారుమోగుతోంది. భ్రూణ హత్యలను నిరసిస్తూ, బాలికా సంరక్షణ, మహిళా సాధికారతను చాటే ఈ పాట సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. .

మహిళలకు అండగా...

మహిళా సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ, విద్యార్థులకు మెరుగైన బోధన కోసం కలెక్టర్ పమేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో... ఆమె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శుక్రవారం సభ'కు ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ఈ సభల్లో అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది, ఐసీడీఎస్, సఖీ సెంటర్, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొంటారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్య మేళా నిర్వహించి 50 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారు. ముఖ్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు రక్తపోటు, మధుమేహం, రుతుస్రావం తదితర సమస్యలకు దారితీసే కారణాల గురించి, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారు. చికిత్సలు కూడా చేయిస్తారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళల కోసం రూపొందించిన 'పోక్సో' చట్టంపై తదితర అంశాల గురించి వివరిస్తారు. మహిళలు ఎదుర్కొంటున్న కుటుంబ, సామాజిక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అధికారులు సూచనలు చేస్తారు. ప్రతి శుక్రవారం జిల్లాలో ఏదో ఒక చోట ఈ సభల్లో కలెక్టర్ పాల్గొని అధికారులు, ఉద్యోగులతోపాటు కింది స్థాయి సిబ్బంది, మహిళలు, బాలికల ఇబ్బందులు తెలుసుకుంటారు. మరోవైపు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ఈవీ ఆటో వాహనాల డ్రైవింగ్‌లో పలువురు మహిళలకు శిక్షణ ఇప్పించి, ఆటోల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించారు.

అందరికీ ఆదర్శం...

ఉన్నతాధికారులు తమకు తమ ఆరోగ్య సమస్యలకు కార్పొరేట్ ఆసుపత్రులకే వెళ్తారనేది సర్వత్రా ఉన్న భావన. కానీ కలెక్టర్ పమేలా... వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికే వెళ్తారు. తనకు ముక్కులో ఇబ్బంది ఏర్పడినప్పుడు ప్రభుత్వాసుపత్రిలో చేరి, శస్త్రచికిత్స చేయించుకున్నారు. వైద్య ఆరోగ్య శిబిరాల్లో కూడా పరీక్షలు చేయించుకుంటూ... ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగేలా చేస్తున్నారు. పిల్లలు, మహిళల ఆరోగ్యంపై గ్రామైక్య సంఘాల సభ్యులకు అవగాహన కలిగిస్తున్నారు. ఆమె సేవలకు 'యూనిసెఫ్' గుర్తింపు సైతం లభించింది. 2022లో భువనగిరి కలెక్టర్‌గా పనిచేసినప్పుడు తన రెండున్నర ఏళ్ల కుమారుడిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

• గజవాడ ఆంజనేయులు
ఫొటోలు: ఎండీ షుకూర్



విద్యార్థుల కోసం 'బుధవారం బోధన'

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలు బోధించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం అన్ని పాఠశాలల్లో 'బుధవారం బోధన' కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా ప్రారంభించారు. దీనిలో భాగంగా... కఠినమైన పాఠాలను విద్యార్థులతో చదివించి, అవి చక్కగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు సూచనలు ఇస్తారు. ప్రతి విద్యార్థి చేతి రాతను మెరుగుపరచడానికి, కృషి చేస్తారు. పాఠశాలలను కలెక్టర్ సందర్శించినప్పుడు విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తారు. విద్యార్థులతో కలిసి పాఠాలు వినడం, బోధకురాలిగా మారి పాఠాలు చెబుతారు. బాలికలకు రక్షణ కల్పించడానికి 'స్నేహిత క్లబ్'లను ఏర్పాటు చేసి చట్టాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గత విద్యాసంవత్సరంలో 4,300 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరగా... ఈ ఏడాది ఆ సంఖ్య 7,600కు పెరిగింది.

తులసి కషాయం తాగితే...

తులసి ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. రోజూ తులసి ఆకులతో కషాయం తయారుచేసుకుని తాగితే పలు అనారోగ్య సమస్యలనుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. తులసి ఆకుల కషాయం అందించే ప్రయోజనాలు...

- తులసి ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదం చేస్తాయి. తరచూ తులసి కషాయం తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధులు దరిచేరవు.
- తులసి కషాయంలో ఉండే పోషకాలు.. జీర్ణాశయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తాయి. దీంతో కడుపులో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు రావు.
- తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. శ్వాస వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తులసి కషాయం తాగిన వెంటనే శ్లేష్మం, కఫం విసర్జితమవుతాయి. దీంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం లాంటి సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.
- ఉదయాన్నే తులసి కషాయం తాగితే శరీరంలో కార్టిసాల్ స్థాయి తగ్గుతుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. శరీరంలో ఇన్సులిన్ పనితీరు మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు అధికంగా ఉంటాయి. వారానికి రెండుసార్లు తులసి కషాయం తాగుతుంటే చర్మవ్యాధులు తొలగిపోతాయి. ముఖంపై మొటిమలు, మచ్చలు మాయమవుతాయి. చర్మం బిగుతుగా, కాంతిమంతంగా మారుతుంది. నోటి పూత, నోటి దుర్వాసన కూడా తగ్గుతాయి.



ఎలా తయారు చేయాలంటే...

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు మంచినీళ్లు పోయాలి. ఆపైన ఏడు తులసి ఆకులు, చిన్న అల్లం ముక్క, నాలుగు మిరియాలు, చిన్న దాల్చిన చెక్క వేసి పది నిమిషాలపాటు బాగా మరిగించాలి. తరువాత ఆ నీటిని వడబోసి, చెంచా తేనె కలిపితే తులసి కషాయం తయారవుతుంది. ఇందులో పావుచెంచా లవంగాల పొడి, చిటికెడు పసుపు, చిటికెడు నల్ల ఉప్పు కూడా కలుపుకొని తాగితే అనారోగ్యం దరిచేరదు.

వినూత్నం

ప్రత్యామ్నాయంతో సాధికారత దిశగా!

ఒక అసౌకర్యం... సరికొత్త ఆవిష్కరణకు నాంది పలికింది. ఒక జంటను అనూహ్యంగా పారిశ్రామికవేత్తలను చేసింది. తాన్యా గోయల్... తన భర్తతో కలిసి ఆమె ప్రారంభించిన వ్యాపారం... ఇప్పుడు ఎయిర్‌ప్యూరిఫయర్స్ రంగంలో పెను మార్పులకు కారణమైంది. ఎంతోమంది మహిళలకు జీవనోపాధి కల్పించి... సాధికారత వైపు అడుగులు వేయిస్తోంది. 'ఫోర్బ్స్ 30 అండర్ 30' జాబితాలో చోటు దక్కించుకున్న తాన్యా కథ ఇది.

"దాదాపు నాలుగేళ్ల కిందట... నేను, మావారు కరణ్ బన్సాల్ జైపూర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో ఉండేవాళ్లం. ఆ ఇంట్లో సీలింగ్ బాగా కిందకు ఉండేది. ఆ ఎత్తుకు సరిపడేలా, మంచి గాలి ఇచ్చేలా సీలింగ్ ఫ్యాన్ ఒకటి కొందామని మార్కెట్‌కు వెళ్లాం. ఆన్‌లైన్‌లో వెతికాం. కానీ ఎక్కడా సరైన ఫ్యాన్ కనిపించలేదు. బాగా గాలి రావాలి. సీలింగ్ ఎత్తుకు తగినట్టు ఇమిడిపోవాలి. పొరపాటున చేతులు తగిలినా ప్రమాదం లేకుండా ఉండాలి. అలాంటి ఫ్యాన్ కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాం. బ్లేడ్ లేని ఫ్యాన్సీ ఫ్యాన్లు చూశాం. అయితే సంప్రదాయ బ్లేడ్ గల ఫ్యాన్లతో పోలిస్తే గాలి చాలా తక్కువగా వస్తుంది. మేం గమనించిన మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. మార్కెట్‌లో లభించే ఫ్యాన్లవల్ల గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ఆందోళనకర స్థాయిల్లో పెరుగుతోందని. మనం సాధారణంగా ఉపయోగించే ఎయిర్ ప్యూరిఫయర్లను గది మూలలో పెట్టడంవల్ల ప్రయోజనం అంతంతమాత్రమేనని అర్థమైంది. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేశాం. సీలింగ్ ఫ్యాన్, ఎయిర్‌ప్యూరిఫయర్లకు సరైన ప్రత్యామ్నాయం కనుగొనాలనే నిర్ణయానికి వచ్చాం. అలా ఆవిర్భవించిందే.. 'కార్బన్ ఎన్విరోటెక్'. మా ఈ సంస్థ ద్వారా 'కార్బన్ ఎయిర్‌జోన్' ఒక పరికరాన్ని తీసుకువచ్చాం.

అలా మొదలైంది...

మా ఇద్దరిదీ రాజస్థాన్‌లోని జైపూర్ పట్టణం. నేను 'ఓపీ జిందాల్ గ్లోబల్ లా స్కూల్‌'లో బీఏ ఎల్ఎల్‌బీ చదివాను. 2019లో 'జియాంగ్ యూనివర్సిటీ' నుంచి మాస్టర్ ఆఫ్ లా పట్టా పొందాను. చదువుకొంటూనే పలు సంస్థల్లోని వివిధ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేశాను. తరువాత కొంత కాలం లీగల్ కన్సల్టెంట్‌గా, జిందాల్ స్కూల్‌లో అసిస్టెంట్ లెక్చరర్‌గా పని చేశాను. కరణ్ ఐఐటీ గువహటిలో మెకానికల్ ఇంజనీరింగ్, అమెరికాలోని పర్డ్యూ యూనివర్సిటీలో ఎంఎస్ చదివాడు. మూడేళ్ల కిందట మా ఇద్దరికీ పరిచయమైంది. మనసులే కాదు, అభిప్రాయాలు కూడా కలవడంతో పెళ్లితో ఒక్కటయ్యాం.

కొలువులు కాదనుకొని...

ఇక మా కంపెనీకి బీజం... ఒక అసౌకర్యం నుంచి మొదలైన ఆలోచన. దాని కోసం మేమిద్దరం ఉద్యోగాలు వదిలేయాలకున్నాం. కెరీర్, భవిష్యత్తు పరంగా చూస్తే... మేం తీసుకున్నది సాహసోపేత నిర్ణయం. ఎందుకంటే ఇద్దరివీ ఉన్నత ఉద్యోగాలు. మంచి సంపాదన. అన్నీ వదిలేసి 2021లో 'కార్బన్ ఎన్విరోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌'ను స్థాపించాం. ఎన్నో అధ్యయనాలు, పరిశోధనల తరువాత 'కార్బన్ ఎయిర్‌జోన్' పరికరాన్ని అభివృద్ధి చేశాం. 2023లో దీన్ని అందుబాటులోకి తెచ్చాం. ఇది ఫ్యాన్‌లా, గాలిని శుభ్రపరిచే యంత్రంలా, గది అంతా కాంతినిచ్చే లైట్‌లా ఉపయోగపడుతుంది. అంటే అన్నీ ఒకే పరికరంలో ఇమిడివుంటాయి.



ఎక్కడైనా అమరిపోతుంది...

ఇల్లు, కార్యాలయాల్లో ఎక్కడైనా అమర్చుకోవచ్చు. చూడ్డానికి కూడా చాలా అందంగా ఉంటుంది. మార్కెట్‌లో లభించి సంప్రదాయ ఫ్యాన్లు, ఎయిర్‌ప్యూరిఫయర్లతో పోలిస్తే ఇది ఎన్నో రెట్లు మెరుగైనదని కచ్చితంగా చెప్పగలం. అన్నిరకాల సీలింగ్‌లకూ సరిపోతుంది. ఇందులో సీఎఫ్‌డీ టెక్నాలజీని ఉపయోగించాం. దీనివల్ల ఎయిర్‌ఫ్లో అద్భుతంగా ఉంటటుంది. అన్ని మూలలకూ విస్తరిస్తుంది. గాలి నాణ్యతనూ కాపాడుతుంది. ప్రత్యేకించి తక్కువ ఎత్తున్న సీలింగ్‌లకు అమర్చినా భద్రత పరంగా సంకోచించాల్సింది లేదు. ఇటీవలే దీనికి లైటర్ వెర్షన్ అంటే చిన్న గదుల్లో కూడా ఇమిడేలా మరో మోడల్‌ను తీసుకువచ్చాం. మా సంస్థ ద్వారా ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. అది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.



బడా బ్రాండ్లతో కలిసి...

టైటాన్ క్యాపిటల్, ఆల్ ఇన్ క్యాపిటల్, రెయిన్‌మ్యాటర్ తదితర ప్రముఖ సంస్థల నుంచి మా స్టార్టప్‌కు నిధులు సమకూరుతున్నాయి. ఇది మా ఆర్ అండ్ డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)కు ఎంతో దోహదపడుతోంది. మొదటి ఎనిమిది మాసాల్లో వెయ్యికి పైగా ఎయిర్‌జోన్ యూనిట్లు విక్రయించాం. ఇక ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రకటించిన '30 అండర్ 30' 2025 జాబితాలో నాకు చోటు దక్కింది. అది నాకు ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది. నిత్య జీవితంలో అవసరమయ్యే పరికరాలను మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్ఫూర్తిని నాలో నింపింది."

మూగజీవాలకు రక్ష

మంచి ర్యాంకుతో మెడిసిన్‌లో సీటు వస్తే ' ఎవరైనా వెటర్నరీ వైపు చూస్తారా? కానీ డాక్టర్ రాణి మరియా థామస్ కోరి మరీ ఆ కోర్సునే ఎంచుకున్నారు. మూగ జీవాలకు తన జీవితాన్ని అంకితం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేలా వాటి కోసం ఐసీయూ సైతం ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి ఉద్యోగ అవకాశాలు వస్తున్నా... సొంత ఊళ్లోనే హాస్పిటల్ నెలకొల్పి... మన చుట్టూ ఉండే జీవజాతులను రక్షిస్తున్నారు.



"మూగ జీవాల కోసం ప్రత్యేక ఐసీయూ ఏర్పాటు చేస్తున్నానని చెప్పినప్పుడు అందరూ వింతగా చూశారు. 'వాటి కోసం అంత అవసరమా?' అనేది వాళ్ల ఆలోచన. కానీ నాకు మాత్రం అవి కేవలం జంతువులు, పక్షులు మాత్రమే కాదు... నా తోడబుట్టినవారిలా భావిస్తాను. అవే నా ప్రపంచం. కేరళ రాష్ట్రం అలప్పుళ మా స్వస్థలం. చిన్నప్పటి నుంచి నాకు జంతు ప్రేమ ఎక్కువ. మా ఇంట్లో మకావూ ఉండేది. ఎంతో ఇష్టంగా, మా కుటుంబ సభ్యురాలిగా దాన్ని చూసుకొనేవాళ్లం. ఒక రోజు దానికి అస్వస్థత చేసింది. దగ్గర్లోని వెటర్నరీ ఆసుపత్రులకు వెళ్లాను. కానీ ఇలాంటి అరుదైన పక్షులకు సంబంధించి సరైన ఆసుపత్రులు అందుబాటులో లేవని అప్పుడే అర్థమైంది. సాధ్యమైన అన్ని దారుల్లోనూ ప్రయత్నించా. అయినా పెద్దగా ఫలితం కనిపించలేదు. దాన్ని ఎలా బతికించుకోవాలంటే ఇంకా ఏంచేయాలి? ఎక్కడకు వెళ్లాలి? నాకు ఏ మాత్రం అవగాహన లేదు. చివరకు మృత్యువుతో పోరాడిన మకావూ మా కళ్లముందే ఊపిరి వదిలింది. అది మా కుటుంబాన్ని, ముఖ్యంగా నన్ను తీవ్రంగా కలచివేసింది. అంతులేని బాధను మిగిల్చింది. ఆ క్షణమే ఒక నిర్ణయానికి వచ్చాను... ఈ పరిస్థితిలో మార్పు తేవాలని.

మంచి ర్యాంకు వచ్చినా...

ప్రపంచం ఆధునికంగా ఎంత వేగంగా దూసుకుపోతున్నా జంతువుల వైద్యానికి సంబంధించి ఆ స్థాయిలో సేవలు మనకు అందుబాటులో లేవు. ఇదే నన్ను ఆలోచనలో పడేసింది. అందుకే మెడిసిన్‌లో మంచి ర్యాంకు వచ్చినా నేను అందరిలా కాకుండా వెటర్నరీనే కోరుకున్నా. అందుకు మా నాన్న కూడా మద్దతుగా నిలిచారు. ఎందుకంటే అవసరానికి సరిపడా పశువైద్యులు లేరనేది ఆయనకు కూడా అనుభవమే.. పశువైద్యం చదవాలని అనుకున్నప్పుడు... నా భవిష్యత్తు ఏమైపో తుందోనని నాన్న ఆందోళన చెందలేదు. అది నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది. విశేషం ఏమిటంటే.. నేను చదివిన కాలేజీలో ఈ కోర్సు తీసుకున్నదీ, లైబ్రరీ నుంచి ఆ పుస్తకాలు తెచ్చుకున్నదీ నేనొక్కదాన్నే.

అబుదాబి వెళ్లి...

వెటర్నరీ మెడిసిన్ పూర్తవగానే హడావుడిగా ప్రాక్టీస్ మొదలుపెట్టలేదు. అందులో మరింత లోతుగా అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో అబుదాబి వెళ్లాను. అక్కడి ఫాల్కన్ హాస్పిటల్‌లో శిక్షణ తీసుకున్నాను. అరుదైన పక్షులకు అక్కడ అంతర్జాతీయ స్థాయి వైద్యం అందుతుంది. ఆ స్థాయి వైద్యాన్ని భారత్‌కు తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో తిరిగి వచ్చాను. రాగానే మా పట్టణంలో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఆధునిక హంగులతో 'సారాస్ బర్డ్స్ అండ్ ఎగ్జాటిక్ యానిమల్ హాస్పిటల్' ప్రారంభించాను. అంతేకాదు... ఎక్కడా లేని విధంగా ఐసీయూ ఏర్పాటు చేశాను. ఎండోస్కోపీ, ఎక్స్‌రేతో పాటు గ్రూమింగ్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చాను.



వైద్యం... ఆవాసం

నేడు మా హాస్పిటల్ ఎన్నో మూగ జీవాలకు వైద్యం అందించింది. అత్యవసర సమయాల్లో మెరుగైన చికిత్సలు చేసి, ప్రాణం పోసింది. ముఖ్యంగా అరుదైన పక్షిజాతులకు నేను వైద్యం చేస్తాను. మా పట్టణంలోనే కాదు, దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ మా పశువైద్యశాలకు వస్తారు. వైద్యం ఒక్కటే కాకుండా... ఎన్నో మూగ జీవాలకు మా కేంద్రం చక్కని ఆవాసం కూడా. ప్రస్తుతం దాదాపు వంద కుక్కలు, పిల్లులు, మకావూ తదితర పక్షులు పెరుగుతున్నాయి.

అదే నా జీవితం

ఎప్పుడైతే ఈ వృత్తిని ఎంచుకున్నానో నాటినుంచీ నా జీవితం జంతువులు, పక్షులతోనే మమేకమైంది. వాటితో కలిసి జీవిస్తున్నాను. అందుకే అవి నాకు తోబుట్టువులు లాంటివని చెప్పాను. అవే నా ప్రపంచం కూడా. వివిధ దేశాల నుంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఇస్తాం, రమ్మని ఆహ్వానిస్తున్నారు. నిజమే... అక్కడకు వెళితే దేనికీ లోటు లేకుండా, నా తరువాత రెండు మూడు తరాలకు సరిపడా సంపాదించుకోవచ్చు. ఆనందంగా జీవించవచ్చు. కానీ నా ఆలోచనలు వేరు. నా లక్ష్యం వేరు. నా దృఢ సంకల్పం ఏమిటంటే... భారత్‌లో పశువైద్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలి. ఊపిరి ఉన్నంతవరకు ఈ రంగాన్ని అభివృద్ధి చేయడానికి పాటుపడాలి. మరింతమంది పశువైద్యులు తయారయ్యేలా యువతరంలో స్ఫూర్తి నింపాలి. అంతిమంగా మూగజీవాలకు అత్యుత్తమమైన చికిత్స అందాలి. అప్పటివరకు విశ్రమించేది లేదు."

ఇలా చేస్తే ఊపిరితిత్తులు శుభ్రం

వాతావరణ కాలుష్యం, అపరిశుభ్రమైన పరిసరాలు, అనారోగ్యకరమైన అలవాట్ల వల్ల ఊపిరితిత్తుల్లో రకరకాల సమస్యలు తలెత్తుతుంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఊపిరితిత్తులను శుభ్రంచేస్తే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆ చిట్కాలు ఇవే...

- వెల్లకిలా పడుకొని నడుము కింద దిండు పెట్టుకోవాలి. ముక్కుతో వేగంగా శ్వాస పీల్చుకుని నోటితో మెల్లగా వదలాలి. ఇలా పావుగంటసేపు చేస్తే ఊపిరితిత్తుల్లో పేరుకున్న శ్లేష్మం బయటికి వచ్చేస్తుంది. ఇదేవిధంగా ఓ పక్కకు తిరిగి పడుకుని చేసినా ఫలితం కనిపిస్తుంది.
- వెడల్పాటి గిన్నెలో వేడి నీళ్లు పోసి అందులో కొద్దిగా జండు బామ్ లేదా యూకలిప్టస్ ఆయిల్ వేసి ఆవిరి పట్టాలి. ఘాటైన ఆవిరిని పీల్చడం వల్ల ముక్కుదిబ్బడ తొలగిపోయి శ్వాస బాగా ఆడుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని మలినాలు తొలగిపోతాయి.
- రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల ఊపిరితిత్తుల్లోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్‌ను వాడడం మంచిది.
- రోజూ ఉదయాన్నే భస్త్రికా ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తులు పూర్తిగా శుభ్రపడతాయి. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ చేసినా కూడా శ్వాస కోశ వ్యవస్థ బలోపేతమవుతుంది.



- సాల్మోన్, మాకరెల్ లాంటి చేపలతోపాటు కోడి గుడ్లు, అవకాడో, కివీ, బాదం, గుమ్మడి గింజలు, చియా గింజలు, అల్లం, వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఉదయాన్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో రెండు చెంచాల నిమ్మరసం లేదా అల్లం రసంతోపాటు కొద్దిగా తేనె కలుపుకుని తాగితే ఊపిరితిత్తుల్లో సమస్యలు తలెత్తవు.

దిక్సూచి

జాతీయ స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో(ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ) ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ మెయిన్ షెడ్యూల్ ఆరంభమైంది. మొదటి సెషన్ జనవరి 21 నుంచి జరుగనుంది. తదుపరి రెండు నెలలూ ఇంటర్ పరీక్షలతో బిజీబిజీ. అపై ఏప్రిల్ నెలలో రెండోసెషన్ ఉంటుంది. అంటే పది నుంచి పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ప్రిపరేషన్‌కు అప్పుడు సమయంఉంటుంది. అలాగే జనవరి సెషన్‌లో ఏదైనా పొరపాటు జరిగితే రెండోదైన ఏప్రిల్ సెషన్‌లో మెరుగుపర్చుకోవచ్చు. ఆ నేపథ్యంలో జనవరి సెషన్‌లోనే మంచి స్కోర్‌కు గట్టి ప్రయత్నం చేయడం మంచిది. అలా చేస్తే ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేందుకు సరిపోను సమయం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన ముఖ్యమైన కొన్నింటిని చూద్దాం. ప్రధానంగా ఈ సారి ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ఫాంట్‌ను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

జేఈఈ మెయిన్
జనవరి సెషన్ బెస్ట్



- ఇంటర్ రెండేళ్ళ సిలబస్ - మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విషయంలో ఈ నెల నుంచే గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌పై దృష్టిపెట్టాలి. డెబ్బయ్ నుంచి ఎనభై శాతం ప్రశ్నలు ఫౌండేషన్స్‌పైనే ఆధారపడి ఉంటాయని గమనించాలి.
- ఫాస్ట్ రివిజన్ షీట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిలో అన్ని ముఖ్యమైన ఫార్ములా, రియాక్షన్స్, ఈక్వేషన్‌ని ఒకే చోట సబ్జెక్టువారీగా రాసుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంతో ప్రతి రెండు సబ్జెక్టుల మధ్య ట్రాన్సిషనల్ గ్యాప్‌ని తప్పనిసరిగా ఉంచుకోవాలి. పరీక్ష సమయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలి. జిగ్‌జాగ్ లేదంటే ర్యాండమ్ అటెంప్టులు అస్సలు చేయకూడదు.
- కాలేజీ ముగిసిన తరవాత రోజూ కనీసం నాలుగు గంటల సమయాన్ని స్టడీకి కేటాయించాలి. థియరీతోపాటు కచ్చితంగా న్యూమరికల్స్‌ను సాల్వ్‌చేయాలి. కాలిక్యులేటర్‌ను ఉపయోగించవద్దు. అటెంప్ట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మీ నోట్స్ లేదంటే పాఠ్యపుస్తకాన్ని రిఫర్ చేయండి.
- టైమ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. గడిచిన కొన్నేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేయడం ద్వారా ఒక నిర్దిష్ట అంచనాకు రావచ్చు. ఏ సబ్జెక్టులో ఏయే కాన్సెప్టుల్లో సులువైన ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు. తద్వారా వాటిపై శ్రద్ధపెట్టవచ్చు. ఉదాహరణకు ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి సులువైన ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అక్కడ మిగిలిన సమయాన్ని కష్టమైన ప్రశ్నలను సాల్వ్ చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.
- ప్రతి వారం కనీసం రెండు మాక్‌టెస్టులను ప్రాక్టీస్ చేయాలి. టెస్ట్ పూర్తయ్యాక ఎర్రర్ అనాలిసిస్ చేసుకోవాలి. ఏ టాపిక్‌లో ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయో గమనించి, ఆ కాన్సెప్ట్‌ని మరో సారి రివైజ్ చేసుకోవాలి.
- అన్ని చాప్టర్లు అని కాకుండా ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి. మేథ్స్‌లో కాలిక్యులస్, జామెట్రీ; ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ; కెమిస్ట్రీలో ఆర్గానిక్‌కు ఎక్కువ వెయిటేజ్ ఉంటుంది.
- మాక్ టెస్టుల్లో స్కోర్ యావరేజ్ అంటే 150కి మించేలా చూసుకోవాలి. ఒకవేళ తగ్గినట్లయితే ఒక చాప్టర్‌పై అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పులు ఎలా, ఎందుకు జరుగుతున్నాయో గమనించాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- గెస్ వర్క్ అస్సలు చేయవద్దు. పరీక్షలో కూడా ఎలిమినేషన్ పద్ధతి ఫాలో అవ్వండి. ఎంసీక్యూలో రెండు లేదా మూడు ఆప్షన్స్ తప్పు అని నిక్కచ్చిగా తెలిస్తే జవాబును గుర్తించడం సులువు అవుతుంది.
- అసలు ఎగ్జామ్‌లో కూడా సులువు నుంచి మోడరేట్‌గా ఉండే ప్రశ్నలు, అలాగే మీకు నచ్చిన సబ్జెక్టుతో అటెంప్ట్ మొదలుపెట్టండి. ఇందుకోసం ముందు మొత్తం పేపర్‌ని విశ్లేషించుకోవాలి. అందుకు కనీసం పది నిమిషాలు కేటాయించుకోవాలి. ఒక్క విషయం, కొన్ని సంవత్సరాల ప్రశ్నపత్రాల సరళిని గమనిస్తే, మేథ్స్‌లో అడిగే ప్రశ్నల నిడివి ఎక్కువగా, కఠినంగానూ ఉంటున్నాయి. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో సులువుగా, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ ఆధారంగా ప్రశ్నలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా మంచిది.
- అన్నింటికీ మించి సరైన ఆహార అలవాట్లు, తగిన నిద్ర తప్పనిసరి. డిజిటల్ అడిక్షన్‌కు దూరంగా ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ప్రశాంతత పెరిగి మంచి స్కోర్ సాధించే వీలు ఉంటుంది.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్స్‌లెన్సియా, హైదరాబాద్

జాబ్ కార్నర్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో
లోకల్ బ్యాంక్ ఆఫీసర్స్

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్(ఎల్‌బీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో తెలంగాణలో 88, ఏపీలో 5 పోస్టులు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం ఏడాదిపాటు క్లరికల్/ అధికారి కేడర్‌లో బ్యాంకింగ్ రంగంలో పనిచేసి ఉండాలి.
వయస్సు: 20-30 సంవత్సరాల మధ్య.
ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లోకల్ లాంగ్వేజ్ పరీక్ష ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 23
వెబ్‌సైట్: https://pnb.bank.in/

ఎన్‌సీపీఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు


ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 114 డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఆర్ 31. ఎఫ్ అండ్ ఎ 48, సీఅండ్ ఎంఎం 34, లీగల్ 1), 8 హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులు ఉన్నాయి. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం www.npcilcareers.co.in /www.npcil.nic.in. చూడవచ్చు.

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) 110 అసిస్టెంట్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. జనరల్ 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్ 2, సివిల్ 3) పోస్టులు ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి ఏదైనా పీజీ/ ఇంజనీరింగ్ డిగ్రీ/ లాలో డిగ్రీ ప్లస్ రెండేళ్ళ అనుభవం.
ఎంపిక: రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 28
వెబ్‌సైట్: www.sebi.gov.in

బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజనీర్లు



భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) 340 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఇంజనీర్స్(ఎలక్ట్రానిక్స్ 175, మెకానికల్ 109, కంప్యూటర్ సైన్స్ 42, ఎలక్ట్రికల్ 14 పోస్టులు ఉన్నాయి)
అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 25 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 14
వెబ్‌సైట్: https://bel-india.in/

ఐబీలో 258 మంది ఆఫీసర్స్

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 అధికారుల(అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(90), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(168) పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సైన్సెస్‌లో పీజీ(ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్‌తో ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024, 2025 గేట్ ఎగ్జామ్(కోడ్ ఈసీ/ సీఎస్)లో నిర్దేశిత అర్హతతో కటాఫ్ మార్కులు సాధించి ఉండాలి.
ఎంపిక: నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 16
వెబ్‌సైట్: www.mha.gov.in/www.ncs.gov.in

ఎన్‌హెచ్‌ఏఐలో...

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధపోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టులు: డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) 9, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ 1, జూనియర్ ట్రాన్స్‌లేషన్ అధికారి 1, అకౌంటెంట్ 42 స్టెనోగ్రాఫర్ 32.
పోస్టునుబట్టి ఎంపిక ప్రక్రియ ఉంది. అర్హతలు విడివిడిగా ప్రకటనలో ఇచ్చారు.
అఖరు తేదీ: డిసెంబర్ 15
వెబ్‌సైట్: nhai.gov.in/

నీట్ ఎస్ఎస్ రిజిస్ట్రేషన్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ - నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ - సూపర్ స్పెషాలిటీ(నీట్ ఎస్ఎస్) 2025కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. నవంబర్ 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనిలో సాధించిన మెరిట్ ఆధారంగానే వైద్యవిద్య సంస్థలు అందించే డీఎం, ఎంసీహెచ్, డీఆర్ఎన్‌బీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ టెస్ట్ జరుగుతుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** exam.natboard.edu.in/



టీఐఎఫ్ఆర్‌హెచ్‌లో అడ్మిషన్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ - హైదరాబాద్(టీఐఎఫ్ఆర్‌హెచ్) కెమిస్ట్రీ, ఫిజిక్స్ అడ్మిషన్ బోర్డులు కలిపి పీహెచ్‌డీ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - పీహెచ్‌డి ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో నాలుగు ఖాళీలు ఉన్నాయి. కోర్సు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://gasadmissions.tifrh.res.in
అకడమిక్ కోఆర్డినేటర్ ఈమెయిల్: gasadmissions@tifrh.res.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పెళ్లి షురూ



ప్రియదర్శి ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.



పెద్దితో ఆ కోరిక తీరింది

రామ్‌చరణ్

'సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో పనిచేయాలనేది నా కల. అది 'పెద్ది' చిత్రంతో నెరవేరింది' అని అన్నారు రామ్‌చరణ్. ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. రామ్‌చరణ్, జాన్వీకపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' నుంచి 'చికిరి' పాట లిరికల్ వీడియోను తెరపై ఆవిష్కరించారు. రెహ్మాన్ తనయుడు ఏఆర్ అమీన్ ఈ పాటను వేదికపై ఆలపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ 'నా సంగీత ప్రయాణం తెలుగులోనే ఆరంభమైంది. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమాలతో తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, ఆదరణ ఎంతో సంతోషాన్నిస్తోంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణం' అని చెప్పారు.

చిరంజీవిని క్షమాపణలు కోరిన రామ్ గోపాల్




తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఆయన్ను క్షమాపణలు కోరారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఈనెల 14న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో సందేశంలో చిత్ర బృందాన్ని అభినందించారు. "శివ' సినిమా చూసి నేను ఆశ్చర్యపోయా. అది సినిమా కాదు ఓ విప్లవం, తెలుగు సినిమాకి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం మంచి విషయం. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని చిరంజీవి అన్నారు. ఈ వీడియోను ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'థాంక్స్ చిరంజీవి గారు.. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నా. విశాల హృదయంతో మా చిత్ర బృందాన్ని అభినందించినందుకు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. గతంలో పలు సందర్భాల్లో మెగా బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు రామ్ గోపాల్ వర్మ.

ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా...



'మసూద' ఫేమ్ తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఓ చిత్రం ఆదివారం ప్రారంభమైంది. భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఓ హిలేరియస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ అన్నారు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈనెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్ అతి త్వరలోనే పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీవరప్రసాద్, సినిమాటోగ్రఫీ: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచి రాజు.

వినోదం... విజ్ఞానం



వనాలను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, నాగదుర్గ ప్రధాన తారాగణం. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మించారు. ఇటీవలె చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈనెల 21న 'కలివి వనం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.వినోదంతో పాటు విజ్ఞానాన్ని ఇచ్చే చిత్రమిదని దర్శకుడు తెలిపారు.

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయమౌతున్నాడు. కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'పలాస' చిత్రాల దర్శకుడు అజయ్‌భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు అజయ్ భూపతి. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు పిక్చర్స్ లిమిటెడ్ బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'ఏబీ4'.

క్రైమ్ థ్రిల్లర్



వజ్ర యోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. విలన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మహిళల వరుస హత్యల కేసు నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుంది' అని తెలిపారు.

వేధింపుల కేసులో ఊహించని మలుపు



సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో) మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నిరాధార ఆరోపణలతో తనను వేధిస్తున్నారని కథానాయిక అనుపమా పరమేశ్వరన్ కొన్ని రోజుల క్రితం కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. ఎవరో ఆకతాయిలు, పోకిరీ వ్యక్తులు అనుపమను వేధిస్తున్నారని భావించారు. అయితే ఆమెపై వేధింపులకు పాల్పడింది అబ్బాయిలు కాదు, ఓ 20 ఏళ్ల యువతి అని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమిళనాడుకు చెందిన నిందితురాలు పలు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకొని, అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు తేలింది. నిందితురాలు చిన్న వయస్కురాలు కావడంతో ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి వివరాలను బహిర్గతం చేయదలుచుకోలేదు అని అనుపమ తెలిపారు. అయితే ఈ కేసులో చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. సైబర్ వేధింపులు శిక్షార్హమైన నేరం, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అనుపమ కోరారు.



మేఘాలయలో చిత్రీకరణ

- వేణు దోనేపూడి

'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాజా రవీంద్ర, విస్మయ్, టిన్ను ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా గుణ మాచికంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. మేఘాలయలో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో టీమ్‌ను కలసిన మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఓ సినిమా పూర్తి షూటింగ్ మేఘాలయాలోనే జరగడం ఇదే ప్రథమం. ఒక్క రోజులో ఆరుగురు వ్యక్తుల మధ్య జరిగే ఆసక్తిరమైన క్రైమ్ కామెడీ ఇది. ఎప్పుడూ వర్షం పడుతూ ఉండే ఈ ప్రాంతంలో షూటింగ్ అంత సులువు కాదు. అయినా అన్ని సవాళ్ల స్వీకరించి ముందుకు సాగుతున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో ఉపేంద్ర లిమియే, జార్జ్ మరియన్, రాజా అక్షయ్ లఘుసాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాలుగు యుగాల నేపథ్యంలో



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'నాలుగు యుగాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేమ, పునర్జన్మ, పురాణ గాథలను స్పృశిస్తూ సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగు హక్కులను నిర్మాతలు కే. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి దక్కించుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విలియం జే, సంగీతం: జుడా శాండి.

గొప్ప అనుభూతినిచ్చేలా..



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు హరీశ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇందులోని అన్ని క్యారెక్టర్లతో మీరు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ "జిగ్రీస్' ఒక కల్ట్ సినిమాగా ఉండబోతుంది. వినోదంతోపాటు భావోద్వేగాలూ ఉంటాయి' అని తెలిపారు.

కొత్త చిత్రం ప్రారంభం



త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా దర్శకుడు కే.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో 'ఇరువురు భామల కౌగిలి'లో అనే కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ బేనర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా దర్శకుడు బి.గోపాల్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు.

స్పోర్ట్స్

వరంగల్ ● సోమవారం 10 నవంబరు 2025

దక్షిణాఫ్రికా-ఎ రికార్డు విజయం

● 417 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన సఫారీలు

● 5 వికెట్లతో భారత్-ఎపై గెలుపు


సిరాజ్

బెంగళూరు: రెగ్యులర్ టెస్ట్ బౌలర్లు సిరాజ్, ఆకాశ్ దీప్, కుల్దీప్ ఏమాత్రం ప్రభావం చూపలేక పోవడంతో.. 'ఎ' జట్ల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఎ 417 పరుగుల అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ జోర్డాన్ హెర్మన్ (91), సెనోక్వెనె (77), హమ్జా (77), బవుమా (59), కానర్ (52 నాటౌట్) అదరగొట్టడంతో సౌతాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్-ఎపై చిర స్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. భారీ ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 25/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 417/5 స్కోరు చేసి గెలిచింది. భారత్ 255, 382/7 డిక్లేర్ చేయగా.. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221రన్స్‌కు ఆలౌటైంది.

1 'ఎ' టీమ్‌ల క్రికెట్‌లో అత్యధిక లక్ష్యం (417 పరుగులు) ఛేదించిన జట్టుగా సౌతాఫ్రికా. ఈ సీజన్‌లోనే ఆస్ట్రేలియా-ఎపై భారత్-ఎ 413/5 రికార్డు ఛేదనను సఫారీలు అధిగమించారు.

సిరాజ్‌కు గాయం..: దక్షిణాఫ్రికాతో టెస్టులకు ఎంపికైన పేసర్ సిరాజ్ ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా వేలికి బంతి బలంగా తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిల్లాడుతూ మైదానాన్ని వీడాడు. ధ్రువ్ జురెల్ వేలికి కూడా గాయమైంది.

డిసెంబరు 15న ఐపీఎల్ వేలం?

ముంబై: వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్ కోసం డిసెంబరు 15న క్రికెటర్ల మినీ వేలం జరిగే అవకాశం ఉంది. గత రెండు పర్యాయాలు ఈ ప్రక్రియ దుబాయ్, సౌదీ అరేబియాల్లో జరిగిన విషయం తెలిసిందే. కానీ ఈసారి మాత్రం స్వదేశంలోనే వేలాన్ని నిర్వహించాలనుకుంటున్నారు. ఈ విషయమై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అలాగే ఏ జట్టు ఎవరెవరిని అట్టిపెట్టుకోనుందనే వివరాలను ఈనెల 15లోగా వెల్లడించాల్సి ఉంది.



జొకో @ 101

ఏటీపీలో నొవాక్ ఘనత

'హెలినిక్' ట్రోఫీ సొంతం

ఏథెన్స్ : సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో ఘనత సాధించాడు. కెరీర్‌లో 101వ ఏటీపీ సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఉత్కంఠ భరితంగా జరిగిన హెలినిక్ చాంపియన్‌షిప్ ఫైనల్లో జొకో 4-6, 6-3, 7-5తో లొరెంజో ముసేటి (ఇటలీ)ని ఓడించి విజేతగా నిలిచాడు. ఓపెన్ ఎరాలో జొకోకంటే ముందు జిమ్మీ కానర్స్ (109), రోజర్ ఫెడరర్ (103) ఏటీపీ సింగిల్స్ టైటిళ్ల సెంచరీ కొట్టారు. అంతేకాదు..38 ఏళ్ల జొకో హార్డ్‌కోర్టులపై 72వ సింగిల్స్ టైటిల్‌తో మరో రికార్డునూ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈక్రమంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) పేరిట 71 సింగిల్స్ టైటిళ్లతో ఉన్న రికార్డును నొవాక్ బద్దలుకొట్టాడు. కాగా.. వరుసగా రెండో సంవత్సరమూ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్ నుంచి జొకోవిచ్ వైదొలిగాడు. భుజం గాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు నొవాక్ ప్రకటించాడు. పురుషుల విభాగంలో టాప్-8 ఎనిమిది మంది ఏటీపీ ఫైనల్స్‌లో తలపడుతున్నారు.

పారా షట్లర్ల పసిడి మోత

షిఝౌకా (జపాన్) : భారత పారా బ్యాడ్మింటన్ స్టార్లు ప్రమోద్ భగత్, కృష్ణ నాగర్, సుకాంత్ కదమ్..జపాన్ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టారు. ఈ ముగ్గురు షట్లర్లు అరడజను స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. భగత్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణాలతో మెరిశాడు. టోక్యో పారాలింపిక్స్ చాంపియన్ కృష్ణ నాగర్ (ఎస్‌హెచ్ 6) సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. ఇక..సుకాంత్ కదమ్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణం, సింగిల్స్‌లో రజత పతకం సాధించాడు. అలాగే మహిళల విభాగంలో మన్‌దీప్ కౌర్ స్వర్ణం, నీరజ్ కాంస్య పతకం అందుకున్నారు. ఇంకా..మాన్సీ జోషి, మురుగేశన్ మహిళల డబుల్స్‌లో పసిడి పతకం నెగ్గారు.

జురెల్‌కు బెర్త్ ఖరారే


నితీశ్


జురెల్

నితీశ్ చోటుకు ఎసరు

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌ను చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికార టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌లోనూ అజేయ శతకాలతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టులో అతడికి తుది జట్టులో చోటు ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో పంత్ గాయం కారణంగా ఇంగ్లండ్ పర్యటనలో ఐదో టెస్టు, విండీస్‌తో రెండు టెస్టులకు జురెల్ ప్రధాన కీపర్‌గా వ్యవహరించాడు. అయితే పంత్ ఇప్పుడు గాయం నుంచి కోలుకుని టెస్టు జట్టులో వైస్‌కెప్టెన్ హోదాలో ఉన్నాడు. కాబట్టి కీపర్‌గా పంత్ కొనసాగడం ఖాయమే. అయితే ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఎక్కడ ఆడించాలనేది కోచ్ గంభీర్‌కు సవాల్ కానుంది. దేశవాళీ సీజన్ ఆరంభమైనప్పటి నుంచి అతడి చివరి 8 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో 631 రన్స్ సాధించాడు. ఈనేపథ్యంలో జురెల్‌ను బెంచీకే పరిమితం చేస్తే విమర్శలు తప్పవు.

ఎవరి స్థానానికి ఎసరు?

తొలి టెస్టులో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దించితే ఎవరి స్థానంలో ఆడతాడనేది చర్చనీయాంశమవుతోంది. ఇందుకు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అయితే చివరి టెస్టులో సాయి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక మిగిలింది నితీశ్ కుమార్ చోటే. స్వదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ జట్టుకు పెద్దగా అవసరం పడకపోవచ్చు. అలాగే జురెల్ ఫామ్‌తో పోలిస్తే నితీశ్‌ను తుది జట్టులోకి తీసుకుని ఆడించడం కష్టమే. దీనికి తోడు నితీశ్ గతనెలలో విండీస్‌తో జరిగిన తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ వేశాడు. ఇక రెండో టెస్టులో బ్యాటింగ్‌లో 43 పరుగులు చేసినా.. ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నితీశ్ స్థానంలో జురెల్‌ను ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఒకవేళ అదే జరిగితే 1986లో కిరణ్ మోరే, చంద్రకాంత్ పండిట్‌ల తర్వాత భారత తుది జట్టులో ఇద్దరు స్పెషలిస్ట్ కీపర్లు బరిలోకి దిగినట్టవుతుంది.

ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి?

రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' విధించిన 417 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 'ఎ' ఛేదించడం భారత టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. సిరాజ్, ఆకాశ్, ప్రసిద్ధ్, కుల్దీప్‌లాంటి బౌలర్లను దీటుగా ఎదుర్కొని భారీ ఛేదనను పూర్తి చేయడంతో బౌలింగ్ లైనప్‌పై కోచ్ దృష్టి సారించాడు. ప్రధాన పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌లు ఆడడం దాదాపు ఖాయమే. ఇక బ్యాటర్‌గా జురెల్‌ను తీసుకుంటే ముగ్గురు స్పిన్నర్లు జడేజా, సుందర్, కుల్దీప్ తుది జట్టులో ఉంటారు.

8 బంతుల్లో 8 సిక్సర్లు

11 బంతుల్లో హాఫ్ సెంచరీ

మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

అరుణాచల్‌తో రంజీ ప్లేట్ మ్యాచ్


ఆకాశ్

సూరత్: ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదితే అద్భుతమనుకున్నాం. కానీ మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ చౌదరి అంతకు మించి అన్నట్టుగా.. వరుసగా 8 బంతుల్లోనూ సిక్సర్లు బాది వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అతడి దూకుడైన ఆటతీరుకు 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకేసారి రెండు రికార్డులను నమోదు చేసిన బ్యాటరయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఆకాశ్ మొత్తం 14 బంతుల్లో 8 సిక్సర్లతో 50 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు. గతంలో 12 బంతుల్లో లెస్టర్‌షైర్ ఆటగాడు వేన్ వైట్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించాడు. అరుణాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ప్లేట్ మ్యాచ్ రెండో రోజు ఆదివారం ఆటలో ఆకాశ్ ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగాడు. స్పిన్నర్ లిమార్ దాబి వేసిన ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదగా, ఆ తర్వాత ఓవర్‌లోనూ తొలి రెండు బంతులను బౌండరీకి దాటించి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 628/6 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది. అటు అరుణాచల్ ప్రదేశ్ 73 పరుగులకే ఆలౌటై.. ఫాలోఆన్‌లోనూ 29/3 స్కోరుతో ఓటమి వైపు పయనిస్తోంది.

ఎవరీ ఆకాశ్?: 2019లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల ఆకాశ్ ఈ మ్యాచ్‌కు ముందు 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 14.37 సగటుతో 503 పరుగులు సాధించగా, ఇందులో రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే ఉన్నాయి. పేసర్‌గా రాణించే తను 87 వికెట్లు పడగొట్టాడు. అయితే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో గతంలో సోబర్స్, రవిశాస్త్రి మాత్రమే ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల ఫీట్‌ను సాధించారు.

రాధేష్ సెంచరీ

● హైదరాబాద్ 364

● రాజస్థాన్ 221/5

హైదరాబాద్: రాహుల్ రాధేష్ (129) సెంచరీతో ఆదుకోవడంతో.. గ్రూప్-డిలో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ మెరుగైన స్కోరు సాధించింది. ఆటకు రెండో రోజు ఓవర్ నైట్ స్కోరు 295/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 364 పరుగులకు ఆలౌటైంది. క్రితంరోజు బ్యాటర్ రోహిత్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రాహుల్ చాహర్, అశోక్ శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 221/5 స్కోరు చేసింది. ఆదివారం ఆట ఆఖరుకు కునాల్ సింగ్ (64 బ్యాటింగ్), అజయ్ సింగ్ (42 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తనయ్, అనికేత్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు రాజస్థాన్ ఇంకా 143 పరుగులు వెనుకంజలో ఉంది.

కార్తీక్ ముందుకు.. విదిత్ ఇంటికి

పనాజీ: ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకట్రామన్ ఫిడే వరల్డ్‌కప్‌లో నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించిన మూడో తెలుగు జీఎం కాగా ఐదో భారత క్రీడాకారుడు కావడం విశేషం. ఆదివారం జరిగిన టైబ్రేక్‌లో తొలి ర్యాపిడ్ గేమ్‌ను డ్రా చేసుకున్న కార్తీక్, రెండో గేమ్‌లో ప్రత్యర్థి బోగ్డాన్ డానియల్ (రుమేనియా)పై 43 ఎత్తుల్లో గెలిచాడు. మరో భారత జీఎం విదిత్ గుజరాతి అమెరికా జీఎం సామ్ షాంక్లాండ్ చేతిలో పోరాడి ఓడి, టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

కివీస్ ఉత్కంఠ గెలుపు

● వెస్టిండీస్‌తో మూడో టీ20

నెల్సన్ (న్యూజిలాండ్) : వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన మూడో టీ20లో న్యూజిలాండ్ తొమ్మిది పరుగులతో ఉత్కంఠ విజయం అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 177/9 స్కోరు చేసింది. కాన్వే (56), మిచెల్ (41) సత్తా చాటారు. అనంతరం విండీస్ 19.5 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. స్ప్రింగర్ (39), అథనజె (31) రాణించారు. సోధి, డఫీ చెరో మూడు వికెట్లు తీశారు.



అనీష్‌కు రజతం

వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్స్

కైరో (ఈజిప్ట్): వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్ అనీష్ భన్వాల్ రజతం సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అనీష్ మొత్తం 28 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. బెస్సాగ్వెట్ (ఫ్రాన్స్) స్వర్ణం.. హొరోడైనెట్స్ (ఉక్రెయిన్) కాంస్యం దక్కించుకొన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 25మీటర్ల ర్యాపిడ్‌ఫైర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా అనీష్ రికార్డుల్లోకి ఎక్కాడు. కాగా క్వాలిఫయింగ్ రౌండ్‌లో 585 పాయింట్లతో రెండో స్థానం సొంతం చేసుకొన్న అనీష్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.

బిజినెస్

భారత అభివృద్ధి, వ్యూహాత్మక నిధి ఏర్పాటు చేయండి

ప్రభుత్వానికి సీఐఐ సూచన

న్యూఢిల్లీ: భారత్ దీర్ఘకాలిక వృద్ధికి, ఆటుపోట్లు తట్టుకుని నిలబడేందుకు, కీలక ఆర్థిక ప్రయోజనాల సాధనకు అవసరమైన నిధుల కల్పన కోసం భారత అభివృద్ధి, వ్యూహాత్మక నిధిని (ఐడీఎస్ఎఫ్) ఏర్పాటు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వానికి సూచించింది. వృద్ధికి కొత్త శక్తి ఇవ్వడంతో పాటు దేశ భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకు ఈ నిధి అవసరమని తేల్చి చెప్పింది. క్రమశిక్షణతో రూపకల్పన చేసినట్టయితే రాబోయే రెండు దశాబ్దాల కాలంలో ఈ నిధిలోని మూలధనం 1.3 లక్షల కోట్ల నుంచి 2.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా. ప్రాథమికంగా కొంత సొమ్ము బడ్జెట్ నుంచి కేటాయిస్తే ఆస్తుల నగదీకరణ ద్వారా సమకూరే సొమ్ముతో నిధిలో మూలధనం పెరుగుతూ వస్తుందని సీఐఐ భావన. ప్రస్తుతం జాతీయ పెట్టుబడులు, మౌలిక వసతుల నిధి (ఎన్ఐఐఎఫ్) అభివృద్ధి నిధిగా వ్యవహరిస్తుందని, తాజాగా ప్రతిపాదిస్తున్న ఈ వ్యూహాత్మక నిధి భారత దీర్ఘకాలిక వృద్ధి, భద్రతా ప్రయోజనాలకు అవసరమైన విదేశీ ఆస్తులను కొనుగోలు చేసి భద్రపరుస్తుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	106		

అనిశ్చితిలోనే బులియన్ మార్కెట్



ఈ వారం మరింత దిద్దుబాటు!

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో అనిశ్చితి కొనసాగుతోంది. దీంతో ఈ వారం కూడా బంగారం, వెండి ధరల్లో మరింత దిద్దుబాటు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. 'ఈ వారం బులియన్ మార్కెట్ దృష్టి అంతా అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు, రాబోయే పరపతి విధానంపై అమెరికా ఫెడ్ రిజర్వ్ అధికారుల వ్యాఖ్యలు, కీలక ఆర్థిక విషయాలకు సంబంధించి చైనా విడుదల చేసే గణాంకాలపై ఉంటుంది. కాబట్టి ఈ వారం పసిడి ధర కొద్దిగా స్థిరీకరణ లేదా మరింత దిదుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది' అని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ అండ్ కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మెర్ చెప్పారు. గత నెలలో ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 క్యారట్స్) బంగారం ధర 10 శాతం మేర నష్టపోయింది. ప్రస్తుత అనిశ్చితి నేపథ్యంలో ఈ వారం కూడా పసిడి ధర మరింత దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ అంచనాతోనే రిటైల్ కొనుగోలుదారులు కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు.

ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ అదే ట్రెండ్

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు డౌన్‌ట్రెండ్‌లో కనిపిస్తున్నాయి. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ధర గత వారం రూ.1,17,000-1,22,000 మధ్య ట్రేడైంది. చివరికి శుక్రవారం రూ.165 నష్టంతో రూ.1,21,067 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ 'కామెక్స్'లో మాత్రం డిసెంబరులో డెలివరీ ఇచ్చే ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర గత వారం 13.3 డాలర్ల లాభంతో 4,009.8 డాలర్ల వద్ద ముగిసింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్స్ పసిడి ధర 4,000 డాలర్లకు కొద్దిగా అటుఇటుగా ట్రేడవుతోంది. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర గత వారం రూ.559 నష్టపోయి రూ.1,47,728 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ.1.5 లక్షలలోపు ట్రేడ్ అయినంత వరకు రూ.1,39,300-1,38,000 స్థాయిలను కీలక మద్దతు ధరగా చూడాలని ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ చెప్పారు.

రూ. 5,000 కోట్లతో విశాఖలో అధునాతన ప్లాంట్

లారస్ ల్యాబ్స్

హైదరాబాద్: లారస్ లేబొరేటరీస్.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద రూ.5,000 కోట్ల పెట్టుబడితో ఒక అత్యాధునిక భారీ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే 532 ఎకరాలు కేటాయించిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసే ఈ భారీ యూనిట్‌ను వచ్చే ఎనిమిదేళ్లలో పూర్తి చేయనున్నట్లు ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ కాల్‌లో ఆయన వెల్లడించారు. అవసరమైతే ఈ ప్లాంట్ కోసం మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కాగా మైసూరులో ఏర్పాటు చేయతలపెట్టిన భారీ ఫెర్మెంటేషన్ యూనిట్‌ను కూడా విశాఖకు తరలిస్తున్నట్టు సత్యనారాయణ వెల్లడించారు.

వచ్చే ఏడాది ఐపీఓకి ర్యాపిడో

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చేందుకు రెడీ అవుతోంది. వచ్చే ఏడాది చివరికల్లా ఇందుకు అవసరమైన కసరత్తు ప్రారంభమవుతుందని సంస్థ సహ వ్యవస్థాపకులు అరవింద్ చెప్పారు. ఐపీఓకు వెళ్లే ముందు కూడా ఏటా 100 శాతానికంటే ఎక్కువ వృద్ధి రేటు నమోదు చేస్తూ తమ సమీప పోటీదారుల కంటే ముందు ఉంటామన్నారు. గత రెండేళ్లుగా ర్యాపిడో ఏటా 100 శాతానికిపైగా వృద్ధి రేటు నమోదు చేస్తోంది.

మళ్లీ ఎఫ్‌పీఐల అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాల పోటు ప్రారంభమైంది. గత నెల రూ.14,610 కోట్ల నికర కొనుగోళ్లు జరిపిన ఎఫ్‌పీఐలు ఈ నెలలో ఇప్పటి వరకు రూ.12,569 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు దేశీయ స్టాక్ మార్కెట్లో ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.1.5 లక్షల కోట్లకు చేరాయి.

తదుపరి నిరోధం 25,800

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,300 స్థాయి వరకు దిగజారినా శుక్రవారం ఇంట్రాడే రికవరీ సాధించి 160 పాయింట్ల మేరకు కోలుకుని 25,490 వద్ద ముగిసింది. ముందు వారంతో పోల్చితే 230 పాయింట్లు నష్టపోయింది. నాలుగు వారాల పాటు సాగిన ర్యాలీలో 1,500 పాయింట్ల మేరకు లాభపడిన నిఫ్టీ ప్రస్తుతం టెక్నికల్ కరెక్షన్‌లో ఉంది. జీవితకాల గరిష్ఠ స్థాయి 26,000 వద్ద బలమైన రియాక్షన్లు ఏర్పడుతూ ఉండడం ఇక్కడ గట్టి నిరోధం ఎదురవుతోందనేందుకు సంకేతం. ఈ కారణంగా స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగే ఆస్కారం ఉంది. గత శుక్రవారం నాటి అమెరికన్ మార్కెట్ ధోరణి ఆధారంగా నిఫ్టీ ప్రస్తుతం టెక్నికల్ రికవరీ సాధించవచ్చు. గత రెండు వారాల కాలంలో గరిష్ఠ స్థాయిల నుంచి 700 పాయింట్ల మేరకు నష్టపోయినందు వల్ల కూడా రికవరీ అవకాశాలున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 25,650 వద్ద నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,800. ఇక్కడ నిలదొక్కుకున్నప్పుడే అప్‌ట్రెండ్‌లో మరింతగా పురోగమిస్తుంది. ఆ పైన మరో ప్రధాన నిరోధం 26,100.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,300 వద్ద రికవరీ అవకాశాలున్నాయి. ఇక్కడ కూడా విఫలమైతే మరింతగా బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: ప్రారంభ డౌన్‌ట్రెండ్ అనంతరం 320 పాయింట్ల మేరకు రికవరీ సాధించి జీవిత కాల గరిష్ఠ స్థాయిల వద్ద నిలకడగా క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రస్తుత గరిష్ఠ స్థాయి 58,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 58,600. రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం మద్దతు స్థాయి 57,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: వీక్లీ చార్టుల్లో గత వారం బ్రేక్‌డౌన్ పాటర్న్ ఏర్పడింది. స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగవచ్చుననేందుకు ఇది సంకేతం. నిఫ్టీ ప్రస్తుతం 50 డిఎంఏ వద్ద ఉంది. ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 25,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిఫ్టీకి మద్దతు ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	25,590, 25,650
మద్దతు:	25,450, 25,360

25,200 దిగువన బేరిష్

(నవంబరు 10-14 తేదీల మధ్య వారానికి)

టెక్ గైడ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,787-25,318 పాయింట్ల మధ్యన కదలాడి 230 పాయింట్ల నష్టంతో 25,497 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,616, 25,191, 25,102, 24,364 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 25,800 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,200

నిరోధ స్థాయిలు : 25,700, 25,800, 25,900 (25,600 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 25,300, 25,200, 25,100 (25,400 దిగువన బేరిష్)

పుల్‌బ్యాక్‌కు అవకాశం..!

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఈ వారం పుల్‌బ్యాక్ సూచనలు కనిపిస్తున్నాయి. గత వారం లాభాలు స్వీకరించిన ఇన్వెస్టర్లు ఈ వారం కొనుగోళ్లకు దిగే ఆస్కారం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే పెరగటం ఖాయం. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, చమురు, మెటల్, ఇన్‌ఫ్రా రంగ షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి. కంపెనీల ఫలితాలను బట్టి మదుపరులు షేర్లను ఎంపిక చేసుకోవటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరుకు రూ.600 శ్రేణిలో మద్దతు లభించింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.615 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.610లో పొజిషన్ తీసుకుని రూ.655/675 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.595 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వోల్టాస్: ఏడాది కాలంగా పతనమవుతూ వస్తున్న ఈ కౌంటర్ ప్రస్తుతం ట్రెండ్ రివర్సల్ బాటలో ఉంది. కీలకమైన రూ.1,350 స్థాయిలో కదలాడుతోంది. గత శుక్రవారం రూ.1,321 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,300 ఎగువన ప్రవేశించి రూ.1,450/1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,275.

టాటా స్టీల్: ఈ ఏడాది ఆరంభం నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం రెండేళ్ల నాటి గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసింది. స్వల్పంగా హెడ్‌లైన్ సప్లయ్ రావటంతో పుల్‌బ్యాక్ అయ్యింది. మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటిస్తుందన్న అంచనాలు, మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ నేపథ్యంలో ఈ కౌంటర్‌పై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.181 వద్ద ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.180 స్థాయిలో ప్రవేశించి రూ.220 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.175.

ఆదిత్య బిర్లా క్యాపిటల్: ఈ ఏడాది మార్చి నుంచి ఈ కౌంటర్ దాదాపుగా 130 శాతానికి పైగా పెరిగింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ చాలా బాగుంది. గత శుక్రవారం రూ.338 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.330 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.390/410 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.312.

బజాజ్ ఫైనాన్స్: రెండేళ్ల బేస్ బ్రేకౌట్ తర్వాత ఈ షేరు సుదీర్ఘ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ఫలితాల నేపథ్యంలో మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం రూ.1,066 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ1,010.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

2027 మార్చి కల్లా పునర్ వ్యవస్థీకరణ పూర్తి

అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ తన వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ వేగం పెంచింది. 2027 మార్చి నాటికి ఈ కార్యక్రమం పూర్తవుతుందని కంపెనీ సీఎఫ్ఓ కృష్ణన్ అఖిలేశ్వరన్ చెప్పారు. ఈ పునర్ వ్యవస్థీకరణ ద్వారా కంపెనీ తన ఫార్మసీ, డిజిటల్ వ్యాపారాలను ప్రత్యేక కంపెనీలుగా విభజించి.. ఆ కంపెనీలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఇందుకు సెబీతో సహా ఇతర రెగ్యులేటరీ సంస్థల అనుమతులు అవసరం. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి కల్లా ఇవన్నీ పూర్తవుతాయని భావిస్తున్నట్టు అఖిలేశ్వరన్ తెలిపారు.

● కోటక్ మహీంద్రా ఏఎంసీ.. కోటక్ రూరల్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించింది. రూరల్, అలైడ్ థీమ్‌తో రూపొందించిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్‌కు నిఫ్టీ రూరల్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో అయితే రూ.500. ముగింపు తేదీ ఈ నెల 20.


ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

పేరుకే సంపన్నుల నియోజకవర్గం మెజార్టీగా ఉన్నది మాత్రం నిరుపేదలే..

» జూబ్లీహిల్స్ అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించాలి: పొంగులేటి

రహ్మత్‌నగర్/బోరబండ/రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పేరుకే సంపన్నుల నియోజకవర్గం.. వాస్తవానికి ఇక్కడ మెజారిటీగా ఉన్నది మాత్రంబడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ పేదల సంక్షేమాన్ని పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును గుర్తించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం మంత్రి పొంగులేటి రహ్మత్‌నగర్ డివిజన్‌లోని కార్మిక నగర్, బ్రహ్మ శంకర్ నగర్, రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు, కార్యకర్తలతో సంభాషించారు. సాయంత్రం రహ్మత్‌నగర్ నుంచి బోరబండ వరకు నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. కాగా, కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీలోని కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల వద్ద మంత్రి అజారుద్దీన్, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిలతో కలిసి ఆయన కాలనీ నాయకులతో ముచ్చటించారు. అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు.

బీజేపీకి పది వేల ఓట్లు కూడా రావు

» బీఆర్ఎస్, బీజేపీలు ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ: పొన్నం

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజవర్గంలో ఉన్నప్పటికీ, ఉప ఎన్నికలో బీజేపీకి పది వేల ఓట్లు కూడా దాటవని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆదివారం యూసుఫ్‌గూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ లాగ వ్యవహరిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ అభ్యర్థి మీద సంబంధం లేని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. యువకుడు, స్థానికుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల సమస్యలు, సినీ కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్నవాడు, వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉండే వ్యక్తి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన చెప్పారు.

ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

» కాంగ్రెస్ వైపే జూబ్లీహిల్స్ ఓటర్లు: మంత్రి శ్రీధర్ బాబు



సోమాజిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే కాంగ్రెస్ పార్టీ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ నగరాభివృద్ధికి బాటలు పడ్డాయని, వివిధ ప్రాజెక్టులు చేపట్టినట్లు ఈ సందర్భంగా వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగరాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీలు బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆయన అన్నారు. కాగా బేగంపేట్‌లోని హరిత ప్లాజాలో 'తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కార్తీకమాస ఆత్మీయ సమ్మేళనం'కు మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీవీ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పథకాల అమలును వివరిస్తూ మహేశ్ ప్రచారం

» కాంగ్రెస్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నేతలు


ప్రచారంలో మహేశ్‌గౌడ్, మంత్రి తుమ్మల

వెంగళరావునగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఓటర్లకు వివరిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెంగళరావు నగర్‌లో ప్రచారం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నేతలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కూడా పాల్గొని మద్దతు తెలిపారు. వెంగళరావునగర్ వీధుల్లో తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నవీన్ యాదవ్‌ను గెలిపించండి

» ఓటర్లకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల బహిరంగ లేఖ

హైదరాబాద్/వెంగళరావునగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఓటర్లకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాలు బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయా సంఘాల తరఫున ఆదివారం లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీలలో ఉన్న బీసీలు కూడా నవీన్ యాదవ్‌కు మద్దతు తెలపాలని కోరారు. నవీన్‌ను గెలిపించడం ద్వారా అసెంబ్లీలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం

» రేవంత్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడింది: హరీశ్



ఎర్రగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి జరగాలంటే ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండేళ్లుగా రేవంత్ రెడ్డి అసమర్థ పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. నిర్మాణ అనుమతులకు 30% కమీషన్ డిమాండ్ చేస్తున్నారని, హైడ్రా పేరుతో ఇళ్లు కూలగొట్టి పేదలను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఎర్రగడ్డలోని వాసవి బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లేడీ వర్సెస్ రౌడీగా కొనసాగుతోందన్నారు. మాగంటి గోపీనాథ్‌ను మీ ఇంటి గోపీనాథ్‌గా ఆదరించారని, మాగంటి సునీతను సైతం అలాగే గెలిపించాలని కోరారు. సునీత గెలుపుతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు.

భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన

» ప్రచారం చివరిరోజు మంత్రులతో సమన్వయం, ప్రత్యేక భేటీ

» జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

» హరీశ్‌కు మతిభ్రమించింది: భట్టి


మోతీనగర్‌లో పర్యటిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి జూపల్లి

ఎర్రగడ్డ/యూసుఫ్‌గూడ/బోరబండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. మరో మూడేళ్లతో పాటు వచ్చే ఐదేళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని మోతీనగర్‌కు వెళ్లారు. అక్కడ మంత్రి జూపల్లితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక డివిజన్లో పరిస్థితిని మంత్రి జూపల్లితో ప్రత్యేకంగా భేటీ అయి సమన్వయం చేశారు. ఆ తర్వాత యూసుఫ్‌గూడ డివిజన్‌కు చేరుకొని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత స్థానిక నేతలతో భేటీ అయి పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత వెంగళరావు డివిజన్‌లో మంత్రి తుమ్మల, వాకిటి శ్రీహరితో భేటీ అయ్యారు. అనంతరం రహమత్ నగర్ డివిజన్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, బోరబండ డివిజన్‌లో సీతక్కతో సమీక్ష నిర్వహించారు. చివరగా యూసుఫ్‌గూడలో పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బలహీనవర్గాల వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని, పదవి లేకున్నా అనేక సామాజిక కార్యక్రమాలు చేసిన వ్యక్తి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. తనకు ఢిల్లీలో ఇల్లు ఉందా, లేదా? అనేది అందరికీ తెలుసని, హరీశ్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు రేషన్ కార్డులు అందించామని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 14,230 కార్డులు ఇచ్చామని తెలిపారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి 30 వేల నుంచి 50 వేల మెజారిటీతో గెలుస్తారని, ఫేక్ సర్వేలు చేయించుకున్న బీఆర్ఎస్ భ్రమలో ఉందని అన్నారు.

ఓటర్లకు రూ.100 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)



ఖర్చుకు ఏమాత్రం పొంతన లేకుండాపోయిందని ప్రధాన పార్టీలు నేతలు అంటున్నారు. ఒక పార్టీ అభ్యర్థి నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓటర్లలో ఇప్పటివరకు 70 శాతం మందికి నగదు పంపించగా, మరో పార్టీ అభ్యర్థి 50 శాతం మందికే పంపించినట్లు తెలిసింది. పార్టీకి చెందిన స్థానిక నేతల ఆధ్వర్యంలో ఓటర్లకు డబ్బులను చేరవేస్తున్నారు. బూత్‌ల వారీగా ఓట్ల లెక్క చూసుకుని పంపిణీ చేపట్టారు.

బలహీనంగా ఉంటే డబుల్..

ఒక పార్టీ మొదట్లో ఓటుకు రూ.3 వేలు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరిగినా.. ఓటుకు రూ.2500 చొప్పున ఇచ్చారు. మరో పార్టీ మాత్రం ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. అదే సమయంలో ఓటుకు రూ.2500 చొప్పున పంపిణీ చేస్తున్న పార్టీ.. తాము బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా రూ.5వేలు ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేస్తున్న పార్టీ తాను బలంగా ఉన్నచోట మాత్రం రూ.వెయ్యి మాత్రమే పంపిణీ చేయటం గమనార్హం. అయితే ఓటర్లకు పంచే నోట్ల లెక్కల విషయంలో ప్రధాన పార్టీలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. స్థానిక నేతలతో ఇతర ప్రాంతాలకు చెందిన వారిని జతచేసి.. తమ మనుషుల ద్వారా డబ్బు పంపిణీ జరిగేలా చూసుకుంటున్నారు. స్థానికంగా తమకు సహకరించే వారికి రోజుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఇవ్వటంతో పాటు.. మొత్తం ఎన్నిక పూర్తయ్యే నాటికి కొంత మొత్తాన్ని అదనంగా ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు.

మహిళల చేతికే డబ్బులు..

ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న క్రమంలో ఆ నగదును మహిళల చేతికే ఇస్తున్నారు. ఇంట్లో ఉన్న ఓటర్ల సంఖ్యను అడిగి.. సదరు ఇంటి మహిళ చేతిలో డబ్బులు పెడుతున్నారు. పురుషులకు ఇస్తే వారు ఆ డబ్బుల్ని మద్యానికి ఖర్చు చేసే అవకాశం ఉందని, అదే మహిళల చేతికి ఇస్తే.. తమ నోట్లు ఓట్లుగా మారతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. పొదుపు సంఘాల మహిళలకు పది రోజుల క్రితమే రూ.500 చొప్పున ఒక పార్టీ పెద్ద ఎత్తున పంపిణీ చేసింది. ఓటుకు ఇచ్చే మొత్తానికి ఇది అదనంగా చెబుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. నోట్లతోపాటు ఆడబిడ్డలకు కానుకగా వారి మనసుల్ని దోచుకునే బహుమతుల్ని పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం ఓ పార్టీ లక్ష పట్టుచీరలు తెప్పించినట్లు తెలిసింది. ఇప్పటివరకు 50 వేల పట్టుచీరలు పంచినట్లు, మరో 50 వేలు పంచాల్సి ఉన్నట్లు సమాచారం.

2 లక్షల మంది ఓటర్లు లక్ష్యంగా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4.01 లక్షల మంది ఓటర్లుండగా.. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ సరాసరి పోలింగ్ 47 శాతం నుంచి 52 శాతంగా నమోదైంది. ఈ నేపథ్యంలో తాజా ఉప ఎన్నికలో పోలింగ్ అదే లెక్కన సాగినా 2 లక్షల ఓట్లకు పైనే పోల్ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం ఓటర్లలో 2 లక్షల మందికి తాయిలాలు అందేలా ప్రధాన పార్టీలు వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాయి. ఇందుకోసం ఒక పార్టీ రూ.50 కోట్లను ఖర్చు చేసేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లుగా సమాచారం. ఇంత భారీగా నోట్ల పంపిణీ ద్వారా ఓటర్ల మనసు గెలుచుకోవటం ఖాయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. "మేము పంపిణీ చేసిన ఓటర్లలో 50 శాతం మంది ఓట్లు వేసినా.. గెలుపు పక్కా.. డబ్బులు ఇవ్వకున్నా పార్టీపై, అభ్యర్థిపై అభిమానంతో ఓట్లు వేస్తారు. అది అదనం అవుతుంది. గెలుపు సులువవుతుంది" అంటూ ఒక పార్టీ ఇప్పటివరకు లక్షన్నర మందికి ఓటర్లకు తాము ఇవ్వాల్సింది ఇచ్చేసినట్లుగా చెబుతుంటే.. మరో పార్టీ మాత్రం ఆదివారం సాయంత్రానికి లక్ష మంది ఓటర్లకు మాత్రమే డబ్బు పంపిణీ చేసినట్లుగా తెలుస్తోంది. దీంతో పోలింగ్ పూర్తయ్యే నాటికి ప్రధాన పార్టీ అభ్యర్థుల ఎన్నికల పంపిణీ ఖర్చు రూ.100 కోట్లు దాటిపోవటం ఖాయమన్న మాట బలంగా వినిపిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పార్టీల అధినాయకత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత అభ్యర్థుల మధ్య పోటీగా ఉన్న ఉప ఎన్నిక.. ఆ తరువాతి పరిణామాలతో ప్రధాన పార్టీల నాయకత్వాల ప్రతిష్ఠకు సవాలుగా మారింది.

మాకు డబ్బులు అందలేదు!

ప్రధాన పార్టీలు పంచుతున్న డబ్బులు తమకు అందలేదంటూ కొంతమంది ఓటర్లు చెబుతున్నారు. డబ్బులిచ్చే వారికోసం ఇళ్ల వద్ద పడిగాపులు కాశారు. ఇంటి వద్దకు పార్టీల నాయకులెవరైనా వస్తారేమోనని, డబ్బులిస్తారేమోనని ఆదివారం మధ్యాహ్నం నుంచి గంటల తరబడి నిరీక్షించారు. ఓటరు జాబితా కాగితాలు పట్టుకుని నలుగైదుగురు కలిసి కనిపించారంటే.. వారి వద్దకు వెళ్లి డబ్బుల గురించే అడగడం కనిపించింది. వాస్తవానికి పలు ప్రాంతాల్లో ఒక్కో ఓటరుకు ఆయా పార్టీల అధిష్ఠానం ఒక 'ఫిగర్'ను నిర్ణయించింది. ఆ మేరకు బూత్‌ల వారీగా నగదు కేటాయింపులు చేశారు. అయితే ఓటరు జాబితా ప్రకారం తమకు నమ్మకం కలిగిన ఓటర్లకు డబ్బులు ఇవ్వాలని ముఖ్యనాయకులు భావించినప్పటికీ.. కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు అందులో కోత విధించిన పరిస్థితి కనిపించింది. అభ్యర్థులు సరిగానే పంపించినప్పటికీ.. కిందిస్థాయి నేతలే కోత విధించారని పలువురు చెప్పుకొచ్చారు. పైగా, ఒక్కో అభ్యర్థి నియోజకవర్గంలోని సుమారు 1.20లక్షల మంది ఓటర్లకు లెక్కగట్టి డబ్బులు పంపినా.. స్థానిక నేతలు అందులో 80% మందికే పంచుతున్నట్లు తెలిసింది. దీంతో ఇచ్చిన మొత్తాన్ని సరిగా పంపిణీ చేయకపోతే కొంప మునిగే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

6 ఓట్లకు రూ.33 వేలు!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలు ఓటర్లకు పంచుతున్న డబ్బు.. ఆయా కుటుంబాలకు జాక్‌పాట్‌లాగే మారింది. నియోజకవర్గంలోని బోరబండలో ఆరు ఓట్లు కలిగిన ఓ కుటుంబానికి మూడు ప్రధాన పార్టీలు కలిసి ఏకంగా రూ.33 వేలు ఇవ్వడం గమనార్హం. ఓ పార్టీ ఒక్కో ఓటుకు రూ.2500 చొప్పున ఆరు ఓట్లకు కలిపి రూ.15 వేలు ఇవ్వగా, మరో పార్టీ ఓటుకు రూ.2 వేల చొప్పున రూ.12 వేలు, ఇంకో పార్టీ ఓటుకు రూ.వెయ్యి చొప్పున రూ.6 వేలు ఇచ్చాయి. ఇలా అన్ని కుటుంబాలకూ ఇదే నిష్పత్తిలో డబ్బులు అందుతున్నాయి. అయితే ఓటర్లు కూడా తమ ఓట్లను ఈ నిష్పత్తి ప్రకారం అందరికీ పంచుతామని అంటున్నారు. ఒక పార్టీకి మూడు ఓట్లు, మరో పార్టీకి రెండు ఓట్లు, ఇంకో పార్టీకి ఒక ఓటు వేయాలని నిర్ణయించుకున్నామని చెబుతున్నారు.


యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న కేటీఆర్

జూబ్లీహిల్స్ తీర్పుతో రేవంత్ పీఠం కదలాలి

» గోస పడుతున్న తెలంగాణ మీ దిక్కు చూస్తోంది

» యూసుఫ్‌గూడ రోడ్ షోలో కేటీఆర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల తీర్పుతో సీఎం రేవంత్‌రెడ్డి పీఠం కదలాలి. నల్లగొండ, ఖమ్మం జిల్లాల మంత్రులు సీఎం కుర్చీ కోసం ఢిల్లీలో రేవంత్‌పై కత్తులు నూరుతున్నరు. మీరిచ్చే షాక్‌తో మూడేళ్లు కాదు.. మూడు నెలలు కూడా ఆయన పదవిలో ఉండే పరిస్థితి ఉండదు' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే ఓటుకు రూ.4 వేల నుంచి రూ.6 వేలు పంచాలని కాంగ్రెస్ నేతలను సీఎం రేవంత్‌రెడ్డి పంపారని, వాటిలోనూ ఆ పార్టీ నేతలు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చే డబ్బులు తీసుకొని.. కారు గుర్తుకు ఓటేయ్యాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆదివారం యూసుఫ్‌గూడలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీలు, తులం బంగారం, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా..? అని ప్రశ్నించారు. రెండేళ్లలో ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేకపోయిన సీఎం.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తానంటే ఎలా నమ్ముతారని నిలదీశారు. శని, ఆదివారం వచ్చిందంటే పేదల ఇళ్లపైకి బుల్డోజర్ వస్తుందని, ఇందిరమ్మ రాజ్యమంటూ వేల ఇళ్లను నేలమట్టం చేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో సునీతమ్మను గెలిపిస్తే హైడ్రా బుల్డోజర్‌కు అడ్డుగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలై, పేదలు కష్టపడి కొనుక్కున్న ప్లాట్ల ధరలు అమాంతం పడిపోయి, వారి పెట్టుబడి హారతి కర్పూరంలా కరిగిపోయే దుస్థితి నెలకొందన్నారు. 'జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్‌ను ఓడిస్తే.. అన్ని హామీలు అమలవుతాయి. గోస పడుతున్న రాష్ట్ర ప్రజలంతా ఇప్పుడు మీ దిక్కు చూస్తున్నారు' అని అన్నారు.

ఇప్పుడే బెదిరిస్తున్నారు.. గెలిస్తే బతకనిస్తరా?

ఓటు వేయకుంటే సంగతి చూస్తామని కొందరు ఆకు రౌడీలు బెదిరిస్తున్నారని, ఇప్పుడే ఇలా ఉంటే వాళ్లు గెలిస్తే బతకనిస్తరా..? అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వ్యాపారులు, సామాన్య ప్రజానీకం ఆలోచించాలని కోరారు. నేర చరిత్ర ఉన్న వాళ్లకు ఓటు వేయాలా.. వద్దా..? అన్నది మీరే తేల్చుకోవాలన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ కాంగ్రెస్‌కు మద్దతుగా ఎందుకు ప్రచారం చేస్తున్నారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు.

పోలింగ్ డే.. డ్రోన్ల నిఘా!




మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగేలా రాష్ట్రంలోనే తొలిసారిగా పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా పెడుతున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, సోమవారం రాత్రిలోపు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు చేరుకుంటాయని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు సోమవారం కూడా ఇంటింటి ప్రచారం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జాయింట్ పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్‌తో కలిసి కర్ణన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 226 కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నోటాతో కలిపి 59 మంది అభ్యర్థులున్న దృష్ట్యా.. ఎన్నికల్లో 4 బ్యాలెట్ యూనిట్లను వాడుతున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయమని.. సాయంత్రం 6లోగా కేంద్రానికి వచ్చి క్యూలో ఉన్నవారికి ఓటేసే అవకాశం కల్పిస్తామని ఆయన చెప్పారు.

డ్రోన్‌లు, వెబ్ కాస్టింగ్‌తో..

మొత్తం 139 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కోచోట ఒక్కో డ్రోన్‌తో నిరంతర నిఘా ఉంటుందని కర్ణన్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల లోపల వెబ్ క్యాస్టింగ్ ద్వారా.. బయట, పరిసరాలను డ్రోన్లతో రికార్డు చేస్తామని చెప్పారు. వాటన్నింటినీ జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి.. ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని వివరించారు. ఉప ఎన్నికలో మొత్తం 561 కంట్రోల్ యూనిట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు, 595 వీవీ ప్యాట్‌లు వినియోగిస్తున్నామని.. మొత్తం 2,060 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 1,761 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని జాయింట్ పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై 27 కేసులు, ఇతర వివిధ కారణాలపై 2,600 కేసులు నమోదైనట్టు చెప్పారు. ప్రచారం ముగియడంతో నియోజకవర్గంలోని స్థానికేతరులను తక్షణమే ఖాళీచేసి వెళ్లాలని ఆదేశించినట్టు తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాలను మూసి ఉంచుతున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్టు వెల్లడించారు.

ముగిసిన ఉప ఎన్నిక ప్రచారం

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రధాన అంశమైన ప్రచారం పర్వం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఆ వెంటనే స్థానికేతరులు నియోజకవర్గం వదిలివెళ్లాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. పోలింగ్ కోసం ఎన్నికల విభాగాలు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాయి. పోలింగ్ ముందు ఓటర్లను ఆయా పార్టీలు, అభ్యర్థులు ప్రలోభపెట్టే ప్రయత్నాలను అడ్డుకొనేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ ప్రచారం చేయగా.. సిటింగ్ సీటును నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ శాయశక్తులా ప్రయత్నాలు చేసింది. ఆయా పార్టీల ముఖ్యనేతలంతా రంగంలోకి దిగి ఓటర్లను ఆకట్టుకునేందుకు తమదైన శైలిలో ప్రచారం చేశారు.

గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు?

» ఆయన మరణం మిస్టరీగా ఉంది

» కేటీఆర్ వచ్చాక చనిపోయినట్టు చెప్పారు

» గోపీనాథ్ తల్లి మహానందకుమారి


మీడియాతో మాట్లాడుతున్న మహానందకుమారి

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి మాగంటి మహానందకుమారి అనుమానం వ్యక్తం చేశారు. గోపీనాథ్ చివరి దశలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు ఆయన్ను చూసేందుకు తనతోపాటు కుటుంబసభ్యులు ఎవ్వరినీ అనుమతించలేదని ఆమె తెలిపారు. గోపీనాథ్ ఎప్పుడు మరణించారో కూడా తమకు తెలియదని, జూన్ 5న తుదిశ్వాస విడిచారా? జూన్ 8వ తేదీనా? అనే సందేహం ఉందని పేర్కొన్నారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చిన వెంటనే గోపీనాథ్ 8న మరణించారని ప్రకటించారని, అదేరోజున హడావుడిగా అంత్యక్రియలు పూర్తి చేశారని.. ఇదంతా మిస్టరీగా అనిపిస్తోందన్నారు. గోపీనాథ్ మొదటి భార్య మాలిని, మనుమడు తారక్ ప్రద్యుమ్నతో కలిసి మహానంద కుమారి.. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపీనాథ్‌ను తల్లినైన తనను ఎందుకు చూడనివ్వలేదని ప్రశ్నించారు. డయాలసిస్ చేయించుకోవాల్సిన గోపీనాథ్‌ను సహాయకుడు కూడా లేకుండా ఆస్పత్రిలో వదిలేసి సునీత ఎందుకు బయటకు వెళ్లిందో తెలియదన్నారు. గోపీనాథ్‌ను చూసేందుకు కుటుంబసభ్యులను కూడా అనుమతించవద్దని సునీత ఆస్పత్రి యాజమాన్యానికి లేఖ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఆస్పత్రి వద్ద కేటీఆర్‌ను కలిసి బాధ చెప్పుకోవాలని ఆయన కారు వెంట పరుగెత్తినా తనని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 8న ఉదయం ఎనిమిది గంటలకు గోపీనాథ్ భౌతికకాయాన్ని తీసుకొచ్చి అదేరోజు సాయంత్రం ఐదు గంటల కల్లా అంత్యక్రియలు పూర్తి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. గోపీనాథ్ జూన్ 8న మరణించగా.. అదే నెల 25న సునీత చట్టపరమైన వారసత్వం (లీగల్ హెయిర్) కోసం దరఖాస్తు చేసుకోగా జూలై 4న సర్టిఫికెట్ జారీ అయ్యిందన్నారు. అయితే, ఆ సర్టిఫికెట్‌లో తనతోపాటు మాలిని, ప్రద్యుమ్న పేర్లు లేవని, దాంతో ఆగస్టు 11వ తేదీ నుంచే ఈ విషయంపై తాము మాట్లాడుతున్నామన్నారు. పార్టీలతో, టికెట్‌తో తమకు సంబంధం లేదని, కుటుంబ విషయమని, చట్టపరమైన గుర్తింపు కోసమే ఇక్కడకు వచ్చామని ఆమె వెల్లడించారు. ఇక, మాలినితో గోపీనాథ్‌కు విడాకులు కాలేదని, తాను గోపీనాథ్, సునీతల వివాహం చేయలేదని ఆమె తెలిపారు.

మాకు గుర్తింపు లేదు: తారక్ ప్రద్యుమ్న

తారక్ ప్రద్యుమ్న అంటే ఎవరో తనకు తెలియదన్న సునీత తనకు ఎందుకు ఫోన్లు చేశారో చెప్పాలంటూ మాగంటి గోపీనాథ్ కుమారుడు తారక్ ప్రద్యుమ్న ప్రశ్నించారు. సునీత జూన్ 6న తనకు తొలిసారి ఫోన్ చేశారని చెప్పారు. ఆ తర్వాత సునీత తనతో మాట్లాడుతూ.. "నువ్వు ఇండియా రావాల్సిన అవసరం లేదు. రెజ్యూమె పంపిస్తే కేటీఆర్ అంకుల్ కంపెనీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు" అని చెప్పారని ప్రద్యుమ్న వెల్లడించారు. ఆయా ఫోన్ కాల్స్‌కు సంబంధించిన ఆధారాలను ప్రద్యుమ్న ఈ సందర్భంగా విలేకరులకు చూపించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ తనకు కాల్ చేసి 'నువ్వు రావాల్సిన అవసరం లేదు' అని చెప్పారన్నారు.

విగ్రహాల ఏర్పాటుపై వీడియోల యుద్ధం

ఎన్టీఆర్ విగ్రహాలపై, పీజేఆర్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ వాగ్బాణాలు

- ఎప్పుడో మరణించిన నేతలే కేంద్రబిందువుగా రాజకీయం
- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఇరువర్గాల వ్యాఖ్యలు

(హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలనగానే.. ఎక్కడెక్కడి వ్యక్తులపైనా ఎక్కడ లేని ప్రేమలూ వచ్చేస్తాయి! కాసిన్ని ఓట్లు రాలుస్తాయనుకుంటే కాదేదీ ప్రచారానికి అనర్హం అన్నట్టు.. జననేతల విగ్రహాలు, ఎప్పుడో మరణించిన నేతల పేర్లూ రాజకీయానికి కేంద్రబిందువులవుతాయ్! హోరాహోరీగా సాగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఇప్పుడు జరుగుతోందదే!! మాస్ లీడర్లుగా పేరున్న ఎన్టీఆర్, పీజేఆర్ పేర్లు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారంలో ప్రధానంగా మారాయి. ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుపైన, సానుభూతి అంశంపైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య 'ఎక్స్' వేదికగా వీడియో వార్ నడుస్తోంది. "ఎన్టీఆర్ విగ్రహాలు మేమే పెట్టాం" అని బీఆర్ఎస్ అంటుంటే.. "అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టే బాధ్యత మాది" అని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. నాడు పీజేఆర్ మరణించినప్పుడు ఆయన కుటుంబానికి పోటీగా మరో అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారని కాంగ్రెస్ నిలదీస్తుంటే.. అసలు పీజేఆర్ కుమారుడికి కాంగ్రెస్ టికెట్ ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. ఈ వ్యాఖ్యలు, ప్రతి వాఖ్యల వీడియోలు సోషల్ మీడియాతోపాటు, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసెంజర్లలోనూ ఇరుపార్టీల గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఉదాహరణకు.. టీడీపీ పుట్టిందే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానని, అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎన్టీఆర్ విగ్రహాలు పెడతామని చెప్పడం దారుణమని, దీనికి ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందని బీఆర్ఎస్ నేతలుచేసిన వ్యాఖ్యల వీడియోలను ఆ పార్టీ కార్యకర్తలు 'ఎక్స్'లో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఇక పీజేఆర్ విషయానికి వస్తే.. ఆయన చనిపోయినప్పుడు కుటుంబానికి వ్యతిరేకంగా అభ్యర్థిని పోటీలో పెట్టి దుష్ట సంప్రదాయానికి తెరతీసిన బీఆర్ఎస్ పార్టీ.. ఇప్పుడు మాగంటి విషయానికి వచ్చేసరికి సానుభూతి ఓట్లు అడుగుతోందని కాంగ్రెస్ నేతలు దుయ్యబడుతున్నారు. దీనికి కౌంటర్‌గా.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పీజేఆర్ కుమార్తె విజయారెడ్డికి ఎంతో గౌరవం ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తూ, ఆ సమయంలో విజయారెడ్డి కేసీఆర్‌ను కలిసిన వీడియోను వైరల్ చేస్తున్నారు. కేసీఆర్ తనకు చేసిన సహాయం, అందించిన సహకారం గురించి గతంలో విజయారెడ్డి చెప్పిన వీడియోలను కూడా పెద్ద ఎత్తున 'ఎక్స్' ఖాతాల్లో పోస్టు చేస్తున్నారు. ఎన్టీఆర్, పీజేఆర్ గురించి.. సీఎం రేవంత్, మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ చేసిన వాఖ్యల వీడియోలు నెట్టింట బాగా చక్కర్లు కొడుతున్నాయి. "తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ అభిమానులు కానోళ్లు ఉంటారా. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టే బాధ్యత నాది" అంటూ సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారంలో చెప్పిన వీడియోతో పాటు.. చంద్రబాబు అరెస్టు సమయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలనూ గుర్తుచేస్తూ ధ్వజమెత్తిన వీడియో కూడా వైరల్ అవుతోంది. వాటికి కౌంటర్‌గా.. "రాష్ట్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను బీఆర్ఎస్ పెట్టింది. ఖమ్మంలో 70 అడుగులతో ఏర్పాటుచేశాం. కూకట్‌పల్లిలో, బాన్సువాడలో కూడా పెట్టాం. ఉప ఎన్నికల సందర్భంగా సీఎంకు ఇప్పుడు ఎన్టీఆర్ గుర్తుకువచ్చాడా. మరి రెండేళ్ల నుంచి ఏం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయి కాబట్టి ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తుకువస్తున్నారా. పీసీసీ ప్రెసిడెంట్‌గా రేవంత్‌రెడ్డి ఉన్నా కూడా పీజేఆర్ కుమారుడు విష్ణుకు టికెట్ ఎందుకు ఇవ్వలేదు. పీజేఆర్‌పై అంత ప్రేమ ఉంటే ఆయన కుమారుడికి టికెట్ ఎందుకు ఇవ్వలేదు" అంటూ హరీశ్ చేసిన వ్యాఖ్యల వీడియో, "మా నాన్న టీడీపీలో ఎమ్మెల్యేగా ప్రస్థానం ప్రారంభించారు" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యల వీడియో కూడా బాగా వైరల్ అవుతున్నాయి.

కేసీఆర్ ఓట్లడగలేదేం?



'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గ ప్రజలకు ఈనాటి వరకూ కేసీఆర్ విజ్ఞప్తి చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "బయటికి వచ్చి ప్రచారం చేయడానికి ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. కానీ, పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కూడా విజ్ఞప్తి చేయడంలేదంటే కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకున్న ఆలోచనేంటో అర్థం చేసుకోవచ్చు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన కళ్ల ముందు పార్టీ కూలిపోతుంటే కుమిలిపోతున్నారని, దుఃఖం, ఆవేదనతో కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని మరీ బీజేపీకి అవయవదానం చేసిందని ఆరోపించారు. దాంతో బీజేపీ గెలుచుకున్న 8 సీట్లే మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైందంటూ కేసీఆర్ కూతురు కవితే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు.

సీబీఐ కాళ్లకు బంధం వేసిందెవరు?

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా ఇంతవరకు విచారణ ప్రారంభం కాలేదని, సీబీఐ కాళ్లకు బంధం వేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. అలాగే ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకూ గవర్నర్ నుంచి అనుమతి రాలేదన్నారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ అవమానించారని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించలేని కేటీఆర్.. ప్రజల అభిమానం ఎలా చూరగొంటారని ప్రశ్నించారు. కేసీఆర్ ధృతరాష్ట్రుడిలాగా పిల్లల దుర్మార్గాలను భరిస్తున్నారని వ్యాఖ్యానించారు. తనది కార్యకర్త మనస్తత్వమని, హుజూరాబాద్, హుజూర్‌నగర్, సాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ కంటే ఎక్కువగా ప్రచారం చేశానని తెలిపారు. 2034 జూన్ వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, దీనిని రాసిపెట్టుకోవచ్చని ప్రకటించారు. రాబోయేవి జమిలి ఎన్నికలు అని, 2028 డిసెంబరుకు బదులుగా.. 2029 జూన్‌లో జరుగుతాయని అన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించి 2034 జూన్ వరకూ అధికారంలో కొనసాగుతుందని జోస్యం చెప్పారు. ఈ పదేళ్లలో.. వందేళ్ల అభివృద్ధి చేస్తామన్నారు.

చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరగదు..

2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేసిందని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి గోదావరి నీళ్లు రావడానికి సీఎల్పీ నేతగా పీజేఆర్ నడిపిన పోరాటమే కారణమన్నారు. ఐటీ, ఫార్మా, నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్ మారిందంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక పాలసీల వల్లనేనని పేర్కొన్నారు. జంట నగరాలకు నిరంతర విద్యుత్తు ఇవ్వాలని విధానపరమైన నిర్ణయం తీసుకోవడంతో దిగ్గజ ఐటీ సంస్థలు తరలి వచ్చాయన్నారు. దేశానికి సరఫరా అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని చెప్పారు. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రణాళికలు, విధానపరమైన నిర్ణయాల కారణంగా వచ్చిన ప్రపంచ దిగ్గజ సంస్థలు.. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లుగా మారాయన్నారు. తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసిందన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలన, ఆ తర్వాత కేసీఆర్ పదేళ్ల పాలనతో పోల్చి చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డ్రగ్ కల్చర్ ఎవరిదో ఆలోచించండి

ఎవరిది పబ్ కల్చర్, ఎవరిది డ్రగ్ కల్చర్, గల్లీ గల్లీల్లో గంజాయి, డ్రగ్స్‌కు కారణం ఎవరు అన్నది జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించాలని సీఎం రేవంత్ సూచించారు. వచ్చే పదేళ్లూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తుందని చెప్పారు. నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందన్నారు. సెంటిమెంటా? డెవలప్‌మెంటా? అన్నది జూబ్లీహిల్స్ ప్రజలే తేల్చుకోవాలన్నారు. ఆర్కిటెక్చర్ చదువుకున్న యువకుడిని రౌడీ అనడం బీఆర్ఎస్ ఆలోచనా ధోరణికి అద్దం పడుతుందని మండిపడ్డారు. "మా నాన్నను చూపించి నన్ను రౌడీ అంటున్నరు. పాస్‌పోర్టు బ్రోకర్ కొడుకును ఏమనాలి? అని నవీన్ యాదవ్ అందుకే ప్రశ్నించారు" అని రేవంత్ అన్నారు.

గుజరాత్‌కు గులాం.. కిషన్‌రెడ్డి!

సబర్మతీ, గంగా, యమునా రివర్ ఫ్రంట్‌లను అద్భుతమంటూ ఓవైపు బీజేపీ ప్రచారం చేసుకుంటుంటే.. మూసీ రివర్ ఫ్రంట్‌ను మాత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ఇక్కడి పెట్టుబడులు గుజరాత్‌కు తరలి పోవాలన్నదే కిషన్‌రెడ్డి ప్రణాళిక అని, ఆయన గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు వచ్చిన సెమీకండక్టర్లు, పెట్టుబడులను ప్రధాని కార్యాలయం నుంచే బెదిరించి గుజరాత్‌కు పట్టుకుపోతే కిషన్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఆయన తనపై ఒంటి కాలిమీద లేస్తే ఏమొస్తుందని, చేతనైతే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి నిలదీయాలని అన్నారు. లేదంటే మోదీ కాళ్లు పట్టుకుని కొన్ని ప్రాజెక్టులను తెలంగాణకు వదిలేయాలంటూ కోరాలన్నారు. కేటీఆర్‌తో చెడు సావాసాన్ని కిషన్‌రెడ్డి వదులుకోవాలని సూచించారు. బ్యాడ్ బ్రదర్స్ కేటీఆర్, కిషన్‌రెడ్డి అడ్డుకోని అంశాల్లో కేంద్రం ప్రభుత్వం తన వంతు సహకారం అందిస్తోందని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, బీజేపీ డిపాజిట్లు జప్తు కావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌ను వ్యతిరేకించే ఏ ఎంపీనీ కిషన్‌రెడ్డి ప్రచారానికి రానివ్వడంలేదని ఆరోపించారు.

కేసీఆర్ ప్రారంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు..

బీఆర్ఎస్ హయాంలో కొత్తగా ఒక్క యూనివర్సిటీ కూడా తేలేదని, కనీసం వీసీలను కూడా నియమించలేదని సీఎం రేవంత్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలకు పైగా స్కూళ్లను మూసేశారని, రైతులకు వ్యవసాయాన్ని, మహిళలకు రాజ్యాధికారాన్ని దూరం చేశారని ఆరోపించారు. కొత్తగా ఆస్పత్రులనూ నిర్మించలేదన్నారు. కేసీఆర్ హయాంలో నగరంలో చేపట్టిన ఏ ఒక్క ప్రాజెక్టయినా పూర్తయిందా? అని ప్రశ్నించారు. తన రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీని లాభాల బాట పట్టించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, రూ.3 వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిని, వందెకరాల్లో హైకోర్టునూ నిర్మిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్నబియ్యం ఇస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామన్నారు. కేసీఆర్ ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్నీ ఆపకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల గోదావరి జలాలు తెచ్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బెస్ట్ ఫైనాన్షియల్ పాలసీని తీసుకువస్తామని ప్రకటించారు.

కాలేజీలు రూల్ ప్రకారం పోదామంటే సిద్ధం: సీఎం రేవంత్

కాలేజీల నిర్వహణలో నిక్కచ్చిగా రూల్ ప్రకారం పోదామంటే తాను వంద శాతం సిద్ధంగా ఉన్నానని యాజమాన్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. యాజమాన్యాలు రూపాయి కూడా డొనేషన్ తీసుకోవద్దని, మెరిట్ లేకుండా సీట్లు ఇవ్వవద్దని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, కాలేజీ మేనేజ్‌మెంట్‌లతో నిజనిర్ధారణ కమిటీ వేసి ఒక్కో కాలేజీని పరిశీలించి ప్రక్షాళన చేద్దామన్నారు. ఆయా కాలేజీల్లో నిబంధనల ప్రకారం బోధనా సిబ్బంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయా, లేదా అని పరిశీలిద్దామన్నారు. కొన్ని కాలేజీలైతే ఆయా కాలేజీల నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల పేరుమీద కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూలు చేయడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్బన్ ఇంజనీరింగ్ కాలేజీ అయితే కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డొనేషన్లు వసూలు చేస్తున్నారని, మెడికల్ కాలేజీల్లోనైతే ఇంకా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఆయా సీట్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం రూ.35 వేల చొప్పున మాత్రమేనన్నారు. "డొనేషన్లు లేని డిగ్రీ కాలేజీలకు మొదట చెల్లించి.. డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కాలేజీలకు విడతల వారీగా చెల్లిస్తామంటే.. 'లేదు ఒకేసారి కట్టాలి.. లేకుంటే బంద్ పెడతాం' అంటున్నారు. కాలేజీలు బంద్ పెట్టినా ఆరు నెలల తర్వాత వారి ఫీజు రీయింబర్స్‌మెంట్ వారికి వస్తుంది. విద్యా సంవత్సరం కోల్పోయిన విద్యార్థికి ఎవరు జవాబుదారీ? విద్యను రాజ్యాంగం సేవగానే గుర్తించింది కానీ.. వ్యాపారంగా కాదు. కాలేజీలు బంద్ పెట్టడం వల్ల సమస్యకు పరిష్కారం దొరకదు. పిల్లల కోణంలో ఈ సమస్యను చూడాలి" అని సీఎం రేవంత్ అన్నారు.

కేటీఆర్.. ప్రమాణం చెయ్

ఎప్పుడూ డ్రగ్స్ తీసుకోలేదని.. భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్దకు వచ్చి ఒట్టు వెయ్యి

కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "కేటీఆర్.. ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదని, తీసుకోనని కుటుంబ సమేతంగా భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్ద తడిబట్టలతో ప్రమాణం చేసే దమ్ముందా? సోమవారం ఉదయంలోపు ప్రమాణం చెయ్" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అయ్య పేరు చెప్పి గెలిచిన బతుకు కేటీఆర్‌ది.. కేసీఆర్ లేకుంటే ఆయనను కుక్కలు కూడా చూడవు" అని మండిపడ్డారు. విర్రవీగిన కేసీఆర్ మెడలు వంచింది బీజేపీయేనని, కాంగ్రెస్ మెడలు వంచి అధికారంలో నుండి దింపేది కూడా బీజేపీయేనని ఆయన వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డబ్బులు పంచుతున్నాయని.. కాంగ్రెస్ రూ.7 వేలు ఇస్తే, బీఆర్ఎస్ రూ.5 వేలు పంచుతోందని ఆరోపించారు. "డబ్బులు తీసుకోండి.. పువ్వు గుర్తుకు ఓటేసి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పండి" అని పిలుపునిచ్చారు. హిందువుల ఓట్లు అవసరం లేదన్నట్లుగా ముఖ్యమంత్రే మాట్లాడుతున్నారంటే ఏమనాలని ప్రశ్నించారు. బీజేపీ 80 శాతం మంది హిందువుల పక్షాన పోరాడుతోందని గుర్తుచేశారు. మాగంటి గోపీనాథ్ జూన్ 8న చనిపోతే.. ఆయన తల్లి అదే నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారని.. అయినా ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గోపీనాథ్ కుమారుణ్ని ఇండియాకు రావొద్దంటూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించారని దుయ్యబట్టారు. మాగంటి సునీతకు రెండు ఓటర్ కార్డులున్నాయని.. ఒక



కృష్ణానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

ఓటర్ కార్డులో సునీత భర్త పేరు సునీత మనోహర్ అని ఉందని.. ఇంకో ఓటర్ కార్డులో సునీత భర్త పేరు మాగంటి గోపీనాథ్ అని ఉందని ఆరోపించారు. ఆ ఓటర్ కార్డులను తాను ప్రభుత్వానికి పంపిస్తున్నానని.. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో మాగంటి సునీత తాను చదువుకోలేదని రాసిచ్చారని, 2025 ఎన్నికల అఫిడవిట్‌లో పదోతరగతి వరకు చదువుకున్నారని రాసిచ్చారని.. దీనిపైనా విచారణ జరపాలని డిమాండ్‌చేశారు. గోపీనాథ్ ఆస్తులను కాజేసేందుకు సునీతతో కలిసి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని.. ఆ ఆధారాలను, తన దగ్గరున్న సమాచారాన్ని పోలీసులకు పంపించానని తెలిపారు.

పాతబస్తీలో హిందూ బాలికలపై డ్రగ్స్ పంజా

పాతబస్తీలో డ్రగ్స్ రాకెట్ ముఠా అరాచకాలకు వందలాది మంది హిందూ బాలికలు బలవుతున్నారని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిల్ అలియాస్ అజీజ్ ఆ ముఠాకు లీడర్ అని.. దాంట్లో 40 మంది ముస్లిం యువకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. మజ్లిస్ నాయకులు, కొంతమంది పోలీసు అధికారుల అండదండలతో ఆ ముఠా హిందూ బాలికలను డ్రగ్స్‌కు బానిసలుగా చేసి వారిని శారీరకంగా దోపిడీ చేస్తోందని, వారిపై అత్యాచారం చేసి, వీడియోలు తీసి వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి జీవితాలను సర్వనాశనం చేస్తోందని మండిపడ్డారు. 'ఒక బాలికను ట్రాప్ చేసి డ్రగ్స్‌కు అలవాటు చేసే ఈ గ్యాంగ్, వారు ఎవరిని కావాలనుకుంటే వారిని తీసుకువచ్చే భారం కూడా ఆ బాలికపైనే పెడుతున్నారు. ఇలా తానే 9 మందిని తీసుకువెళ్లినట్లు ఒక బాధితురాలు వెల్లడించింది' అని ఆవేదన వెలిబుచ్చారు. బాధిత బాలికల తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లకు వెళితే కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదన్నారు. "వందలాది మంది మైనర్ బాలికలు అదృశ్యమవుతుంటే మీ నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది" అని నిలదీశారు. ఈ దారుణాలు తట్టుకోలేక వందలాది బెంగాలీ హిందూ కుటుంబాలు వెళ్లిపోయాయని, కొంత మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. "పాతబస్తీని కాపాడడం చేతగాకపోతే చెప్పండి.. చట్టానికి లోబడి కేంద్ర బలగాలను దింపుతాం.. హిందువులను మేం రక్షించుకుంటాం" అన్నారు. ఈ దారుణాలపై సీఎం తక్షణం స్పందించకపోతే బీజేపీ హిందూ రక్షక దళాలను ఏర్పాటుచేసి కవాతు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ దారుణాలపై నిబద్ధత గల అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులకు మద్దతుగా ఉన్న పోలీసు అధికారులపై కేసులు నమోదు చేయాలని కోరారు.

దేశాన్ని మతప్రాతిపదికన విభజించడమే..

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ అని ఆయన అన్నారు. దీని అర్థం ఏమిటి? మత ప్రాతిపదికన దేశాన్ని విభజించే ఉద్దేశంతోనే ఆయన ఆ వ్యాఖ్య చేశారు. ఇవేమి రాజకీయాలు? ఇదీ కాంగ్రెస్ సంస్కృతి' అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా ఆ వ్యాఖ్య చేశారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు మహమ్మద్ అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించగా, దానికి సమాధానం ఇచ్చిన రేవంత్ ఆ మాటలు అన్నారు. దాన్నే రాజ్‌నాథ్ సింగ్ బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారు. కాంగ్రెస్‌వి విభజన పూరిత, బుజ్జగింపు రాజకీయాలని విమర్శించారు. బీజేపీ మాత్రం మానవీయ రాజకీయాలను చేస్తోందని చెప్పారు. ఆర్జేడీ నేత లాలు ప్రసాద్‌ను కూడా ఆయన విమర్శించారు. 'జబ్ తక్ రహేగా సమోసా మే ఆలూ తబ్ తక్ రహేగా బిహార్ మే లాలు' (సమోసాలో ఎంతవరకు బంగాళాదుంప ఉంటుందో అంతవరకు బిహార్‌లో లాలూ ఉంటారు) అంటూ గతంలో లాలు చేసిన వ్యాఖ్యను ప్రస్తావించారు. ఇప్పుడు సమోసాలో ఆలూను అంతగా పెట్టడం లేదని, జీడిపప్పు ఇతర రుచికరమైన పదార్థాలను పెడుతున్నారని అన్నారు. అందువల్ల ఆ మాటకు కాలం చెల్లిందని చెప్పారు. ఎన్డీఏ రుచికరమైన సమోసాలను అందిస్తుందని అన్నారు. అధికారంలోకి వస్తే ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీని తప్పు పట్టారు. ఆయనకు లెక్క లేమైనా తెలుసా? జీతాలకు ఎక్కడ నుంచి డబ్బులు తీసుకొస్తారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పిస్తూ...ఆయనకు నిజంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై అంత శ్రద్ధ ఉంటే ప్రతిపక్ష నేత పదవిని ఆయా వర్గాల వారికి అప్పగించాలని డిమాండు చేశారు.



అమ్మ.. కమలం గుర్తుకే ఓటెయ్యాలె..
జూబ్లీహిల్స్ పరిధిలోని బోరబండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హస్తం మన నేస్తం
కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలంటూ వెంగళరావునగర్ పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల, మహేశ్‌గౌడ్



కారు గుర్తు.. గుర్తుంది కదా..
ఎర్రగడ్డలోని వాసవి బృందావనం అపార్ట్‌మెంట్‌వాసులతో సమావేశమైన హరీశ్‌రావు

మీ నేతలే మీ కుర్చీ లాగేందుకు ప్రయత్నిస్తున్నారు

- ముందు ఆ సంగతి చూసుకోండి
- సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చురకలు
- కాంగ్రెస్సే మతతత్వ పార్టీ అని ధ్వజం

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే ముందు మీ పార్టీ నేతలే మీ కుర్చీని లాగేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందు ఆ సంగతి చూసుకోండి' అని సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చురకలేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం కోసం 'జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయ జ్యోతి' అనే పేరుతో ఆదివారం వెంగళరావు నగర్‌లో రాంచందర్‌రావు పాద యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే మోసగిస్తున్నాయని, కులం, మతం



వెంగళరావునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రాంచందర్‌రావు

పేరిట ఆ రెండు పార్టీలు చేస్తున్న కుట్ర రాజకీయాలను నమ్మొద్దన్నారు. బీజేపీని మతోన్మాద పార్టీ అని ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు.. క్రిస్టియన్లంతా కాంగ్రెస్‌కు ఓటేయాలని డిప్యూటీ సీఎం.. కాంగ్రెస్సే ముస్లింలు.. ముస్లింలే కాంగ్రెస్ అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం మతం ఆధార ప్రచారం కాదా? అని నిలదీశారు. 'మజ్లిస్ పార్టీయే కాంగ్రెస్. కాంగ్రెస్ పార్టీయే మజ్లిస్' అని దుయ్య బట్టిన రాంచందర్‌రావు.. 'అబద్ధాలకు తల్లి వంటిది కాంగ్రెస్. అలాంటి పార్టీలో అబద్ధాల కోరు రేవంత్' అని మండి పడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ దోచుకుంటే.. మూసీ ప్రాజెక్టు పేరిట మీరు దోచుకోవాలని చూస్తున్నారా? అని అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడ్డారు. అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో రాష్ట్రం కోసం ఏం చేశారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేసిన రాంచందర్‌రావు.. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ చేసింది శూన్యమని, కేంద్రమేమీ ఇవ్వకుండానే తెలంగాణ అభివృద్ధి చెందిందా? అని ప్రశ్నించారు. 'డొక్కు బస్సులిచ్చి మహిళలకు ఉచిత ప్రయాణమని డబ్బా కొట్టుకుంటున్నారు. ఆ బస్సులు ప్రమాదాలకు గురై ప్రయాణికులు చనిపోతున్నారు. మీ పాలన అటువంటిది' అని విమర్శించారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఎప్పుడే భవనం కూల్చేస్తారోనని జనం భయపడుతున్నారు. హైడ్రా పేరిట ఎంత మంది పేదల ఇళ్లు కూల్చేశారో శ్వేతపత్రం విడుదల చేయండి' అని డిమాండ్ చేశారు. మల్కం చెరువులోని అక్రమ భవనాన్ని ఎందుకు వదిలి పెట్టారని నిలదీసిన రాంచందర్‌రావు..ఎంఎంటీఎస్‌కు రాష్ట్రం వాటా నిధులెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు.


అవార్డు అందుకుంటున్న పెరుగు రామకృష్ణ

పెరుగు రామకృష్ణకు సార్క్ సాహిత్య పురస్కారం ప్రదానం

న్యూఢిల్లీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు కవి పెరుగు రామకృష్ణకు సార్క్ సాహిత్య పురస్కారం లభించింది. 66వ సార్క్ సాహిత్య సదస్సు ఆదివారం న్యూఢిల్లీలో ఫౌండేషన్ ఆఫ్ సార్క్ రైటర్స్ అండ్ లీటరేచర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే సదస్సులో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సార్క్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రొఫెసర్ ఆశిస్ నందితోపాటు సాహిత్య అకాడెమీ అధ్యక్షులు మాధవ్ కౌశిక్ అందుకున్నారు. అలాగే పెరుగు రామకృష్ణకు సార్క్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం పెరుగు రామకృష్ణ తాజాగా రచించిన ఆంగ్ల కవిత్వం "ఈచెస్ ఆఫ్ నెల్లూర్" పుస్తకాన్ని మాధవ్ కౌశిక్ సభకు పరిచయం చేశారు.

అడవి నుంచి ఆర్థిక స్వావలంబన వరకు..

- ఆదివాసీ మహిళల 'ఇప్పపువ్వు లడ్డూ' విజయం
- దేశానికే ఆదర్శంగా నిలిచిన భీమ్ భాయి సంఘం

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రాంతంలోని గిరిజన మహిళలు ప్రకృతి సిద్ధంగా లభించే ఇప్పపువ్వును ఆధారంగా చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు. ఉట్నూర్ ఐటీడీఏ నైపుణ్యాభివృద్ధి విభాగం సహకారంతో, ఉట్నూరు మండలానికి చెందిన భీమ్ భాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం మహిళలు లడ్డూల తయారీ యూనిట్‌ను స్థాపించారు. మహారాష్ట్రలోని యువత్మాల్ జిల్లాలో శిక్షణ పొందిన 12 మంది మహిళలు ఈ యూనిట్‌ను రూ.40 లక్షల వ్యయంతో నెలకొల్పారు. ఈ యూనిట్ ఏర్పాటుకు ట్రైకార్ నుంచి 60 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం, 10 శాతం మహిళల వాటాగా సమకూర్చారు. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) నిపుణుల మార్గదర్శకత్వంలో ఇప్పపువ్వుకు పల్లీలు, నువ్వులు, కాజు, బెల్లం, ఎండుద్రాక్ష వంటి పోషక పదార్థాలను కలిపి నాణ్యమైన లడ్డూలను తయారు చేస్తున్నారు. మార్చి నెలలో సేకరించిన ఇప్పపువ్వును నిల్వచేసి ఏడాది పొడవునా లడ్డూలను ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని గిరిజన పోషణమిత్ర పథకం కింద 77 ఆశ్రమ పాఠశాలలకు నెలకు 2,300 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. ఓపెన్ మార్కెట్‌లో నెలకు 900 కిలోలు అమ్ముతున్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామం (ఇందిరా మహిళా శక్తి కేంద్రం), బాలాపూర్‌లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలే స్వయంగా విక్రయిస్తున్నారు. భీమ్‌భాయి సంఘం నిర్వాహకురాలు భగూభాయి తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పపువ్వు లడ్డూల తయారీ, విక్రయం ద్వారా సంఘం వార్షికంగా రూ.1.27 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రతి నెలా రూ.3 లక్షల లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు.

ఆదివాసీ మహిళల కృషి దేశానికే ఆదర్శం..

ఆదివాసీ మహిళల కృషిని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అభినందించారు. ప్రభుత్వ చేయూతతో ఆదివాసీ మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తున్నారని, వీరి కృషి ఆర్థిక స్వావలంబన దేశానికే ఆదర్శమని ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోదీ సైతం మన్‌కీ బాత్‌లో వీరి విజయాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. రుచికి రుచి, పోషకాలు సమృద్ధిగా ఉన్న ఈ లడ్డూలను అందరూ ఇష్టపడతారని, ఐటీడీఏ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివాసీ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

పట్టణ ప్రాంతాల్లో రూ.31,782

(మొదటిపేజీ తరువాయి)

మధ్యలో సర్వే గణాంకాల ప్రకారం.

- దేశంలో ఒక్కో కుటుంబం ఒక విద్యార్థిపై సగటున ఏటా రూ. 25002 ఖర్చు చేస్తోంది. ఇది పట్టణాల్లో రూ. 31782, గ్రామాల్లో రూ.19554.
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా వ్యవస్థల మధ్య వ్యత్యాసం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికీ ఎక్కువమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నా, పట్టణాల్లో మాత్రం ప్రైవేటు సంస్థల వైపు ఆకర్షణ ఎక్కువగా ఉంది.
- గ్రామీణ ప్రాంతాల్లో 66% మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా, 34% మంది ప్రైవేటు బడులను ఎంచుకుంటున్నారు. పట్టణాల్లో 75.7% మంది ప్రైవేటులోనే చదువుతుండగా, కేవలం 24.3% మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు.
- దేశంలో 56% మంది విద్యార్థులు ప్రభుతబడుల్లో, 44% మంది ప్రైవేటు బడుల్లో చదువుతున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో నామమాత్రపు ఫీజులు ఉన్నా, అవి చెల్లిస్తున్న విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. దేశంలోని సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల్లో 26.7% మంది మాత్రమే ఫీజు చెల్లిస్తున్నారు. మిగతా 73.3 శాతం మంది విద్యార్థులు ఎలాంటి చెల్లింపులూ చేయట్లేదు.
- ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇందుకు పూర్తి భిన్నమైన దృశ్యం కనిపిస్తోంది. పట్టణాల్లో 98 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 96 శాతం మంది 'ప్రైవేటు' విద్యార్థులు క్రమం తప్పకుండా ఫీజులు చెల్లిస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి చదువు కోసం ఒక కుటుంబం ఏడాదికి సగటున రూ.2,863 ఖర్చు చేస్తోంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2,639 కాగా, పట్టణాల్లో రూ.4,128గా ఉంది.

ట్యూషన్లపై ఆధారపడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు బడి.. ఎక్కడ చదువుతున్న విద్యార్థులైనా ట్యూషన్‌కు వెళ్తున్నవారి సంఖ్య గణనీయంగానే ఉంటోంది. దేశవ్యాప్తంగా మొత్తం విద్యార్థుల్లో 27 శాతం మంది ట్యూషన్లకు వెళ్తున్నారు. ఐదేళ్ల క్రితం ఇది 20శాతం లోపే ఉండేది. పట్టణ ప్రాంతాల్లో ఈ సగటు 30.7 శాతం కాగా.. గ్రామీణ ప్రాంతాల్లో 25.5 శాతంగా నమోదైంది.

- ప్రాథమిక పాఠశాలలో సుమారు 20% మంది ట్యూషన్‌కెళ్తుండగా.. మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ సంఖ్య 40 శాతానికి చేరింది.
- ఉన్నత పాఠశాల విద్యార్థుల ట్యూషన్ ఖర్చు కూడా గణనీయమే. పట్టణ విద్యార్థులు ఏడాదికి సగటున రూ.9,950.. గ్రామీణ విద్యార్థులు రూ.6,384 చొప్పున ఖర్చు చేస్తున్నారు.
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో తక్కువ ఫీజులు, వసతులు ఉన్నా వాటిని వాడుకోవడంలో చాలా మంది ఆసక్తి చూపించట్లేదు. అదే సమయంలో.. ప్రైవేటు బడులు విద్యను వ్యాపారంగా మార్చి మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం మోపుతున్నాయి. ఈ నేపథ్యంలో.. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను పెంపొందించడం, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

లిక్కర్ షాపు లాటరీ తగిలితే లైఫ్ సెట్టే!

లాటరీలో లైసెన్సులు పొందిన వారిపై కాసుల వర్షం.. 3 లక్షల పెట్టుబడికి రూ.కోటిన్నర దాకా రాబడి

- పెద్దమొత్తంలో డబ్బిచ్చి దుకాణాలు తీసుకుంటున్న బడా వ్యాపారులు
- లాటరీ విధానంలో మద్యం దుకాణాల కేటాయింపు మాటున నయా దందా
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆమె ఓ సాధారణ గృహిణి. మద్యం దుకాణ లైసెన్సు కోసం రూ.3లక్షలు పెట్టి ఎక్సైజ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన లాటరీలో ఆమెకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లైసెన్సు దక్కడంతో లక్ష్మీదేవి ఆమెను కటాక్షించింది. ఆ గృహిణి, ఆమె భర్తతో బేరమాడిన ఓ బడా మద్యం వ్యాపారి రూ.1.5 కోట్లకు వారి నుంచి ఆ లైసెన్సు తీసుకున్నాడు. పేరేమో ఆ గృహిణిది. వ్యాపారం ఆ బడా వ్యాపారిదన్నమాట. రూ.3లక్షల పెట్టుబడితో ఆ గృహిణి ఒక్కసారిగా కోటీశ్వరురాలైంది. మంచిర్యాల జిల్లాలో ఏడుగురు మిత్రులు 15 దుకాణాలకు దరఖాస్తు చేస్తే.. ఆ సిండికేట్‌కు లాటరీలో 5 దుకాణాలొచ్చాయి. అందులో రెండింటిని రూ.85లక్షల చొప్పున, మరో మూడింటిని రూ.3కోట్ల చొప్పున ఇతరులకిచ్చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ కుటుంబం 5 దరఖాస్తులు చేసుకోగా లాటరీలో 2 దుకాణాలు దక్కాయి. ఆ రెండింటిని వారు రూ.2 కోట్లకు అమ్మేశారు. రూ.15 లక్షల పెట్టుబడికి వాళ్లకు రూ.1.85 కోట్ల లాభం వచ్చినట్లైంది. ఇలా లైసెన్సును మరొకరికి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమైనా.. లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ మాటున నయా దందా జరుగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుత మద్యం దుకాణాల రెండేళ్ల గడువు నవంబరు 30తో ముగియనుండగా.. డిసెంబరు 1 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం కానున్నాయి. కొత్త దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానించిన ఎక్సైజ్ శాఖ.. ఇటీవల లాటరీ పద్ధతిలో కేటాయింపులు కూడా చేసింది. ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు దరఖాస్తులు తీసుకుంటోంది. దరఖాస్తుదారుకు వ్యాపార అనుభవం ఉందా? లేదా? సరుకు కొనే శక్తి ఉందా? లేదా? అనే కనీస అర్హతలనూ పరిశీలించకుండా దరఖాస్తులు స్వీకరించి లాటరీ నిర్వహిస్తుంది. దరఖాస్తులు చేసుకునే వారిలో అప్పటికే మద్యం వ్యాపారం చేస్తున్న వారి కంటే.. లాటరీలో లైసెన్స్ దక్కితే దాన్ని మరొకరికిచ్చి సొమ్ము చేసుకుందామనుకునే వారు ఎక్కువయ్యారు. రూ.3లక్షల నాన్-రిఫండబుల్ రుసుం చెల్లిస్తే చాలు.. "లాటరీ తగిలితే లైఫ్ సెట్" అని కొందరు దరఖాస్తు చేసేస్తున్నారు. అటువంటి వారి లో గృహిణులు, నిరుద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు అధికం. అదృష్టం కొద్దీ లైసెన్సు లభిస్తే రూ.80లక్షల నుంచి రూ.1.50 కోట్లకు మరొకరికి ఇచ్చేస్తున్నారు. రూ.కోట్లు చెల్లించి లైసెన్స్ తీసుకుంటున్నా రెండేళ్లలో అంతకు ఐదింతలు కచ్చితంగా సంపాదించుకోవచ్చని అసలైన వ్యాపారులూ కాసులు కుమ్మరిస్తున్నారు.

హైదరాబాద్‌లో అద్దెకు వందల లైసెన్సులు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్కో దుకాణాన్ని రూ.కోటి నుంచి రూ.1.50 కోట్ల చొప్పున వందల సంఖ్యలో లైసెన్స్‌లను అద్దెకిచ్చేశారు. జిల్లాలు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ ఒక్కో దుకాణం అమ్మకం స్థాయి బట్టి రూ.80వేల నుంచి రూ.కోటికి అమ్మేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ఏ అనుభవం లేని వ్యక్తి తనకు దక్కిన లైసెన్సును వేరేవాళ్లకు అద్దెకు ఇచ్చినందుకు అందులో వచ్చే లాభంలో సగం వాటాతో పాటు అదనంగా తక్షణమే రూ.40 లక్షలు గుడ్‌విల్‌గా ఇచ్చేశారు. ఖమ్మం జిల్లా లో ఓ ప్రైవేటు ఎరువుల దుకాణంలో గుమస్తా రూ.3లక్షలు అప్పుచేసి దరఖాస్తు చేసుకోగా లాటరీలో దుకాణం వచ్చింది. ఆ వ్యక్తి రూ.1.10 కోట్లకు పాత సిండికేట్‌కు ఆ లైసెన్సును అమ్మేసుకున్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో ఒక దుకాణం.. హుజూర్‌నగర్‌లో మద్యం దుకాణదారుడికి లాటరీలో వచ్చింది. హుజూర్‌నగర్‌లోని మద్యం వ్యాపారికి మేళ్లచెరువులో దుకాణం లాటరీలో దక్కింది. మేళ్లచెరువులో సిమెంట్ పరిశ్రమలు అధికంగా ఉండటం, జాతరల వల్ల హుజూర్‌నగర్ కంటే వ్యాపారం అధికంగా జరుగుతుంది. దీంతో ఆ ఇరువురు తమ దుకాణాలను మార్చుకున్నారు. మేళ్లచెరువులో దుకాణాన్ని నడిపించుకోవడానికి హుజూర్‌నగర్ వ్యాపారికి అదనంగా రూ.50లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబసభ్యుల పేర్ల మీద రెండు షాపులు లాటరీలో దక్కించుకున్నారు. అతను ఒక్కో దుకాణాన్ని రూ.90లక్షల చొప్పున ఇతరులకు ఇచ్చేసి రాత్రికి రాత్రే లాటరీ రాజాగా మారిపోయాడు.

ఇది ఎక్సైజ్‌శాఖ నిబంధనలకు విరుద్ధమే..

లైసెన్సుదారు స్థానంలో మరొకరు వ్యాపారం చేయడం ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధం. ఈ సంగతి తెలిసినా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. తమకు దక్కిన లైసెన్సును మరొకరికి ఇచ్చేస్తే కష్టపడకుండా కోట్లు వస్తున్నాయని కొందరు ఆశపడుతున్నారు. మద్యం దుకాణంలో అనుకోని దుర్ఘటన ఏదైనా జరిగితే మాత్రం బాధ్యత వహించాల్సింది లైసెన్సుదారే అనే విషయం కొసమెరుపు.

ఢిల్లీ, జైపూర్ వెళ్లాల్సిన ఇండిగో విమానాల రద్దు

శంషాబాద్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్గత సమస్యలతో పలు ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు వివరాల ప్రకారం.. ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివారం రావాల్సిన 6ఈ2027 విమానం అంతర్గత సమస్యలతో రద్దయింది. అలాగే శంషాబాద్ నుంచి జైపూర్‌కు వెళ్లాల్సిన 6ఈ 6638, 6ఈ816 విమానాలు ఎయిర్‌లైన్స్ సిబ్బంది (ఎయిర్ హోస్టెస్) లేకపోవడంతో రద్దయినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సోమవారం శంషాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఇండిగో 6ఈ424 విమానం కూడా రద్దయినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. విమాన సర్వీసుల రద్దుతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు.

పీఆర్సీని ప్రకటించి అమలుచేయాలి: టీపీటీఎఫ్

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వేతన సవరణకు ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా పే రివిజన్ కమిషన్ రూపొందించిన పీఆర్సీ రిపోర్టును ప్రభుత్వం వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల, పెన్షనర్ల వివిధ రకాల పెండింగ్ ఆర్థిక బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మూడు దశల పోరాటాలను ఈనెల, వచ్చే నెలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆశ్రమ పాఠశాలల సమస్యలపై చేపట్టే ఆందోళనల కరపత్రాన్ని టీపీటీఎఫ్ ప్రతినిధులు ఆవిష్కరించారు.

అధికారం శాశ్వతం అనుకున్న వారిని

ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు

(మొదటిపేజీ తరువాయి)



చెప్పారు. ఆదివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో కవిత మాట్లాడారు. "బీఆర్ఎస్‌లో నేను మంత్రిని కాదు. నా సంతకంతో పనులయ్యే పరిస్థితి లేదు. అయినా నా వద్దకు వచ్చిన వారికి శక్తిని మించి పనులు చేశాను. ఎన్నో సమస్యలు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాను అయినా ఫలితం లేకుండేది. బీఆర్ఎస్‌లో నాకు ఎవరితోనూ పంచాయితీ లేదు. అయినా కుటుంబం నుంచి నన్ను బయటికి పంపించారు. 20ఏళ్లు బీఆర్ఎస్‌లో పనిచేస్తే.. షోకాజ్ నోటీస్ కూడా ఇవ్వకుండా అవమానకరంగా సస్పెండ్ చేశారు. నేనూ తెలంగాణ బిడ్డనే.. ఆకలినైనా తట్టుకుంటా.. అవమానాన్ని మాత్రం తట్టుకోను. ఇప్పుడు నాకు రాజకీయంగా బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు. కేసీఆర్ వద్దకు కూతురిగా వెళ్తా. రాజకీయంగా వెళ్లే పరిస్థితి లేదు" అని కవిత తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశాక ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని.. ఇప్పుడే రాజకీయం చేయాలనుకోవటం లేదన్నారు. అయితే రాజకీయం చేయడం పక్కా అని.. ఆడబిడ్డలు రాజకీయంచేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని చెప్పారు. ఎన్నికలకు ఏడాది ముందు తన రాజకీయాలు ఉంటాయని, అప్పటివరకు ప్రజాసమస్యలపైనే పోరాటమని పేర్కొన్నారు.

హరీశ్‌రావు బినామీ కంపెనీకి..

గత ప్రభుత్వం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను రూ.1,100కోట్ల అంచనా వ్యయంతో ఓ కంపెనీకి అప్పగించిందని, ఆ బినామీ కంపెనీ అంచనా వ్యయాన్ని రూ.1,700 కోట్లకు పెంచేలా చేసుకుందని కవిత ఆరోపించారు. ఆ బినామీ కంపెనీ హరీశ్‌రావుదేనని అంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టినా చర్యలు చేపట్టడం లేదేమని ప్రశ్నించారు. మేడారం టెండర్ల విషయంలో ఇద్దరు మంత్రుల పంచాయితీని ప్రజలు వినోదంగా చూశారన్నారు. రిజర్వేషన్లతోనే అవకాశాలు అని కాకుండా అందరికీ సమానంగా అవకాశాలు రావాలని కవిత ఆకాంక్షించారు. రాజకీయ నేపథ్యంలేని మహిళలకు రాజకీయ అవకాశాలు రావాలన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే కొత్త నాయకత్వం వస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అవే సమస్యలు..

ఏ సమస్యలను లేవనెత్తి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో.. ఆ సమస్యలు రెండేళ్లయినా అలాగే ఉన్నాయని కవిత విమర్శించారు. ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించకపోవటం సిగ్గుచేటన్నారు. మెగా డీఎస్సీ వేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని సీఎం డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. గత ప్రభుత్వమిచ్చిన 60వేల ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకుంటోందని విమర్శించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పైసా సాయం చేయలేదని కవిత మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

రాబోయే పది రోజులు గజగజే!

- రాష్ట్రంలో మరింత పెరగనున్న చలి తీవ్రత
- 11-19 తేదీల్లో పలు జిల్లాల్లో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు
- రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చలిపులి ఇప్పటికే మొదలైంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీల నుంచి 9-13 డిగ్రీల మధ్యకు చేరుకున్నాయి. అయితే, రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగబోతుంది. అవును.. నవంబరు 11-19 తేదీల వరకు అనగా రాబోయే పది రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉండనుందని తెలంగాణ ప్రణాళిక అభివృద్ధి సంఘం ఆదివారం హెచ్చరించింది. ముఖ్యంగా 13-17 తేదీల మధ్య మరింత అధికంగా ఉంటుందని, కొన్ని జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ అంటే పది డిగ్రీల లోపునకు పడిపోనున్నాయని పేర్కొంది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. సోమవారం నుంచి బుధవారం వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9-15 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. ముఖ్యంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 9-10 డిగ్రీల మధ్య నమోదవుతాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక, మిగిలిన జిల్లాల్లో 11-15డిగ్రీల మధ్య నమోదు అవుతాయని వెల్లడించింది. అలాగే, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 26-30డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. కాగా, శనివారంరాత్రి ఆదిలాబాద్ జిల్లా అర్లీ(టీ)లో 14.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

మరో తుపాను ముప్పు!

విశాఖపట్నం: పసిఫిక్ మహాసముద్రం నుంచి వచ్చే తేమగాలుల ప్రభావంతో ఈ నెల 19 లేదా 20న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత పశ్చిమంగా పయనించే క్రమంలో ఇది బలపడి తుపానుగా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. అనంతరం ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా రానుందని అంచనావేశారు. దక్షిణ కోస్తా జిల్లాలపై దీని ప్రభావం ఉంటుందని విశ్లేషించారు. దీని కంటే ముందుగానే శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి.

'ఒక్క చాన్స్' తప్పు మీరు చేయొద్దు

- ఆచరణ సాధ్యం కాని హామీలు నమ్మి మోసపోవద్దు
- బిహార్ ఓటర్లకు ఏపీ మంత్రి లోకేశ్ పిలుపు



అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బిహార్ పాత్ర చాలా కీలకమని.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి యువత ఎన్‌డీఏను మరోమారు గెలిపించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పిలుపిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019లో ఒక్క చాన్స్ అంటూ వచ్చిన వైసీపీకి అవకాశం ఇవ్వడం వల్ల.. శాంతిభద్రతలు క్షీణించి, పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. దాని వల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయిందని.. ఆ పరిస్థితులు తెచ్చుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. బిహార్లో రెండో విడత ఎన్నికల్లో లోకేశ్ శని, ఆదివారాల్లో ప్రచారం నిర్వహించారు. శనివారం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో, బిహార్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఏపీ మంత్రిగా ఇక్కడకు రాలేదని, బాధ్యతాయుతమైన భారతీయుడిగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. 'బిహార్లో జరగబోయే ఈ ఎన్నికలు భారత రాజకీయాల్లో ఎంతో కీలకమైనవని తెలిపారు. 'లీడర్‌షిప్ ట్రాక్ రికార్డు.. స్వచ్ఛమైన అవినీతిరహిత పాలన కోసం ఎన్‌డీఏని గెలిపించాలని కోరారు. బిహార్, ఏపీలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఉండడం వల్ల కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు లభిస్తున్నాయని గుర్తుచేశారు. గుజరాత్, ఒడిసాల్లో ప్రభుత్వాల కొనసాగింపు వల్లే పెద్దఎత్తున అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు.

జాతీయ మీడియాలో కవరేజీ..

ఎన్‌డీఏలో చేరిన తర్వాత టీడీపీ తరఫున రాష్ట్రం వెలుపల లోకేశ్ చేసిన తొలి ఎన్నికల ప్రచారమిది. తన ప్రచారంలో హిందీ, ఇంగ్లిషులో ప్రసంగించి వ్యాపారులను, ఎన్‌డీఏ నేతలు, శ్రేణులను ఆకట్టుకున్నారు. లోకేశ్ బిహార్ ప్రచారానికి జాతీయ మీడియాలోనూ విస్తృత కవరేజీ లభించింది. జాతీయ రాజకీయాల్లో టీడీపీ మరింత చురుగ్గా, ఎన్‌డీఏలో కీలక భాగస్వామిగా తన ప్రాధాన్యాన్ని నిరూపించుకునే వ్యూహంలో భాగంగా ఆయన ప్రచారం ఉందని జాతీయ మీడియా అభివర్ణించింది.

వెల్‌నెస్ కేంద్రాలు.. ఇక డీఎంఈ పరిధిలోకి..

- **ఖైరతాబాద్, కూకట్‌పల్లి కేంద్రాలు నిమ్స్‌కు**
- **వైద్యేతర సిబ్బంది నియామకం ఆరోగ్యశ్రీకి**
- **నేడు అధికారికంగా అప్పగింత**

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు నగదురహిత వైద్యసేవలందించే వెల్‌నెస్ కేంద్రాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ల పరిపాలన, నిర్వహణ బాధ్యతలను ఇకపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), నిమ్స్ పరిధిలోకి తెచ్చింది. ఈ కేంద్రాల నిర్వహణను ఆయా విభాగాలకు సోమవారం అధికారికంగా అప్పగించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ముఖ్యంగా వెల్‌నెస్ సెంటర్లలో స్పెషలిస్టు వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమస్య పరిష్కారంతోపాటు ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడానికి ఈ పరిపాలనా మార్పు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా ఉన్న 12 వెల్‌నెస్ కేంద్రాల్లో.. పదింటిని వైద్య విద్య సంచాలకులకు, మరో రెండింటిని నిమ్స్ ఆస్పత్రికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ట్రస్ట్ సీఈవో ఇటీవల రాసిన లేఖ మేరకు.. ప్రభుత్వం తాజాగా జీవో నంబరు 204 జారీ చేసింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, కూకట్‌పల్లి వెల్‌నెస్ కేంద్రాలు నిమ్స్ పరిధిలోకి రాగా, ఇక ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, వనస్థలిపురం (రంగారెడ్డి జిల్లా), హన్మకొండలోని వెల్‌నెస్ కేంద్రాలు డీఎంఈ పరిధిలోకి వచ్చాయి.

తీరనున్న వైద్య నిపుణుల కొరత..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వెల్‌నెస్ కేంద్రాలకు 2వేల వరకు ఓపీ(ఔట్ పేషెంట్) వస్తుంది. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటే ఓపీల సంఖ్య 3000-4000 మధ్య నమోదయ్యే అవకాశం ఉంటుంది. వాస్తవానికి వెల్‌నెస్ కేంద్రాల్లో సుమారు 10-12 రకాల స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ, ప్రభుత్వం ఇచ్చే వేతనాలకు వైద్యులెవ్వరూ ఇక్కడ పని చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటిదాకా జిల్లాల్లో స్పెషలిస్టులు లేక అంతా హైదరాబాద్ నిమ్స్‌కు రావాల్సిన పరిస్థితి. దీంతో వైద్యుల కొరతపై నిత్యం వైద్యశాఖకు అందుతున్న ఫిర్యాదులను అధిగమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న స్పెషలిస్టు వైద్యులను వెల్‌నెస్ సెంటర్లకు అనుసంధానం చేయడం ద్వారా వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే రోగులకు కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ వంటి వివిధ విభాగాల వైద్య సలహాలు, చికిత్సలు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఉద్యోగులు పెన్షనర్లు వైద్యసేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుందని అంచనా వేస్తున్నారు. ఈ స్పెషాలిటీ వైద్యులందర్నీ బోధనాస్పత్రుల నుంచి రోస్టర్ పద్ధతిలో వెల్‌నెస్ కేంద్రాలకు పంపుతారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విధులు నిర్వహించాల్సి వుంటుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం మేరకు వైద్యేతర సిబ్బంది నియామకాలన్నీ ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షిస్తుంది. అంటే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లు వంటి పరిపాలనా సిబ్బందిని రాజీవ్ హెల్త్‌కేర్ ట్రస్టు నియమిస్తుంది.

నిధుల వినియోగం ఇలా..

కాగా, వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణకు అయ్యే వ్యయాన్ని ఉద్యోగులు, జర్నలిస్టు ఆరోగ్య పథకం (ఈజేహెచ్ఎస్) కోసం కేటాయించిన బడ్జెట్ నుంచే భరించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక పరికరాలు, మందులు కొనుగోలు, మరమ్మతులు వంటి వాటికయ్యే ఖర్చులను ఆరోగ్య పథకాల కింద ఉన్న అడ్మినిస్ట్రేటివ్ నిధులను వినియోగించి ఆరోగ్యశ్రీ ట్రస్టే ఖర్చు చేయనుంది. కాగా, కొత్తగా వచ్చే వైద్య సిబ్బందికి వేతనాలివ్వాల్సిన ఆర్థిక భారం ట్రస్టుపై ఉండదు. అదే సమయంలో, పెరిగే అవుట్ పేషెంట్‌కు అనుగుణంగా ఇవ్వాల్సిన ఔషధాల ఖర్చు మాత్రం భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏటా ఔషధాల కోసం ట్రస్టు రూ.18 కోట్లు ఖర్చు చేస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.